ప్రజాశక్తి

Vol. 1, no. 25

(Dec. 2, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 25

(Dec. 2, 1942)

Bejavāḍa, 1942

Record no. 683

10 పేజీలు : 0-1-6 **PRAJA SAKTI** Regd. No. M. 4486.

సంపాదక వర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు
(సంపాదకుడు)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
గుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

అంతర్జాతీయ పార్టీశాఖ
భారత కమ్యూనిస్టుపార్టీ
ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 1 | బుధవారం 2-12-42 బెజవాడ | సంచిక 25

★ విధ్వంసక చర్యలు మానండి!

ఐక్యతను నిర్మించండి!!

ఆగస్టు 9వ తేదీని కాంగ్రెసు సంస్థ నిషేధించబడి కాంగ్రెసు నాయకు లరెస్టు చేయబడ్డారు. ఇది జరిగి మూడు నెలలయింది. ఈ 3 నెలలలో ప్రజలనేక నరక బాధ లనుభవించారు. భయంకరమైన నిర్బంధ విధానానికి గురి అయ్యారు. ప్రభుత్వానికీ - కాంగ్రెసుకూ మధ్య భీషణ సంగ్రామం చెలరేగింది. దీని ఫలితం యేమిటి? ఈ రోజున మన మెక్కడ వున్నాం?

నిర్బంధ విధానం యొక్క ఫలితాలు

జాతీయ రక్షణకై జాతీయ ప్రభుత్వ మవసరమని కాంగ్రెసు కోరింది. కాని, ప్రభుత్వం నిరాకరించింది. అధికారాన్ని ప్రభుత్వం జాతీయ నాయకుల హస్తగతం చేయ దలచుకోలేదు. నిర్బంధ విధానం తప్ప మరొక ఆయుధం ప్రభుత్వానికిలేదు. కాని, జాతీయోద్యమాన్ని ధ్వంసం చేయాలనే ప్రయత్నం భగ్నమయింది. ఎందువల్లనంటే, ఏ జాతీయోద్యమాన్నయినా ధ్వంసం చేయాలంటే, ప్రజలందరినీ ధ్వంసం చేయాలి. ఇది సాధ్యమైన పనికాదు. ప్రజల శక్తి ఎప్పటికీ నాశనం కాదు. దేశభక్తిని యెవరూ అణచలేరు.

కాబట్టి, నిర్బంధ విధానం యొక్క ఉద్దేశం నెరవేరలేదు. పైగా దీనికి విరుద్ధమైన ఫలితాలు సంభవించాయి. బ్రిటిష్‌వ్యతిరేక భావాలు ఇప్పుడు వ్యాపించినంత యెక్కువగా ఇదివరకెప్పుడూ ప్రజలలో వ్యాపించలేదు. నిర్బంధ విధానం వల్ల యేర్పడిన ప్రత్యక్ష ఫలితం ఇది. ఇంతేకాదు. పోలీసులు గావిస్తూన్న అత్యాచారాల ఫలితంగా, బ్రిటిష్ వ్యతిరేక భావాలు జపాన్ అనుకూల భావాలుగా మారుతున్నాయి. జపాన్ వాళ్లొచ్చినప్పటికీ ఇంతకంటె మనకు పోయేదేమిటి, ఒస్తే ఒస్తారు. ఒచ్చి, బ్రిటిష్ పరిపాలనకు స్వస్తిచెపుతారు. మనం యిప్పుడైనా బానిసలమే, అప్పుడైనా బానిసలమే. మన శక్తివంచన లేకుండా వారితో కూడా యెలాగైనా పోరాడ వలసిన వాళ్లమే. ఇట్టి భావాలు నేడు ప్రజలలో వ్యాపిస్తున్నాయి. నిర్బంధ విధానం వల్ల ప్రజలు ప్రభుత్వానికే మాత్రం లొంగలేదు. కాని, వారి ఉత్సాహం, పట్టుదల, మాత్రం నశించాయి. అనేక జపాన్ సేనలు చేయవలసిన పనిని ఇండియాలో బ్రిటిష్ నిర్బంధ విధానం చేసిపెట్టింది. ఇండియా విషయంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు రాజకీయంగా పరాజయం కలిగింది. భారతీయులమైన మనమే దేశాన్ని యీ విషమావస్థనుండి కాపాడగలం.

అది భ్రమ; ఇది యదార్థం

యుద్ధప్రయత్నాల కెట్టి సహాయం చేయకపోతే, ప్రభుత్వం లొంగి తీరుతుందని కాంగ్రెసు నాయకులు భ్రమించి, కార్యశూన్యత పంథా నవలంబించారు. కాని, దీనిఫలితం శూన్యమే అయింది. కాంగ్రెసు నాయకులు ఒక అడుగు ముందుకు వేశారు. "పోరాటం" యిదుగో! అన్నారు. కొద్దిరోజుల్లోనే ఈ "పోరాటం" విజయవంత మవుతుందని వారు ఆశించారు.

"పోరాటం" ప్రారంభమై 3 నెలలయింది. కొద్దిరోజులు కాదు, అనేక రోజులు గడిచాయి. కాని, విజయంలభించలేదు, ఈ "పోరాటం"లో కాంగ్రెసు జయించలేక పోవడమేగాక కాంగ్రెస్ నాయకులంతా జైళ్లలో నిర్బంధించ బడ్డారు. కాంగ్రెసు ప్రచారకులంతా అరెస్టు చేయబడ్డారు. కాంగ్రెసు నిర్మాణమంతా మూలపడింది. "పోరాటం"లో విజయం లభించలేదని చిత్తశుద్ధిగల ప్రతి కాంగ్రెసు వాది అంగీకరిస్తున్నాడు. కాని, ప్రత్యక్ష విరుద్ధమైన ఫలితాలకు యీ "పోరాటం" యెలా దారి తీసిందో ఆతడింకా గ్రహించ లేకున్నాడు.

"పోరాటా"నికి కారణాలు - దాని ఫలితాలు

ఈ "పోరాటం" అవసరమనడానికి రాజకీయంగా ఏయే కారణాలు తెలుపబడ్డాయో, చూదాం. జపాన్ వాళ్ళతోపోరాడగలగాలంటే, మొదట మనం బ్రిటిష్ ప్రభుత్వంలో పోరాడాలి. అలా పోరాడకపోతే, జపాన్‌వాళ్ళు దిగినప్పుడు వారితో పోరాడగలశక్తి, ఉత్సాహం, ఉండవు. ఎందువల్ల? సామ్రాజ్యవాదులు మనపై చెలాయిస్తూన్న పెత్తనమే యిందుకుకారణం. బ్రిటిష్ పరిపాలనక్రింద మన ఉత్సాహమంతా నశిస్తోంది. దాన్ని తిరిగి రేకెత్తించాలంటే, బ్రిటిషు ప్రభుత్వంతో పోరాడుట అవసరం. ఇది తప్ప మరొక మార్గంలేదు. ఈవిధంగా నెహ్రూవంటి నాయకులు సహితం వాదించారు. కాని, "పోరాట" ఫలితంగా దేశంలో మనం నేడు ప్రత్యక్షంగా చూస్తూన్న యదార్థపరిస్థితులేవిధంగా ఉన్నాయి? జపాను అనుకూలభావాలు మాయంకావడానికి బదులు, విజృంభిస్తున్నాయి.

భారతీయులకు

★ కామ్రేడ్ పి. సి. జోషి ★

హెచ్చరిక

రాజకీయంగా ఈ "పోరాటం" పరాజయం పొందింది. మన దేశీయులలో విరివిగా వ్యాపించియున్న బ్రిటిష్ వ్యతిరేకభావాల్ని జపానుకు అనుకూలంగా పంచమాంగదళంవారు వినియోగించుకొంటున్నారు.

ఇక, ఆచరణలో ఈ "పోరాటం" ఎట్టి ఫలితాలకు దారి తీసిందో చూదాం. దేశభక్తులలో అంతకంత కెక్కువగా ఆశాభంగం వ్యాపించుతోంది. ప్రజలలో నిరుత్సాహం యేర్పడుతోంది. నిరంకుశాధికారవర్గం ప్రజలనెత్తిపై పూర్వంకంటె ఎక్కువగా బిగించుకొని కూర్చుంది. పోలీసులు, మిలిటరీ, విచ్చలవిడిగా తాండవమాడుతున్నారు. ఈ "పోరాటం"వల్ల వస్తుందని ఆశించిన జాతీయ ప్రభుత్వం రాకపోవడమేగాక, ఫాసిస్టుల ప్రమాదం ఇదివరకు కంటె సమీపానికి వచ్చింది. బ్రిటిష్ నిర్బంధవిధానం పూర్వంకంటె అధికమవుతోంది.

పరిస్థితులు కొత్తవి; పద్ధతులుమాత్రం పాతవి

అయితే, కాంగ్రెసువంటి ప్రధాన జాతీయ సంస్థ యీ "పోరాటం" అవసరమని తెలియజేసినప్పుడు, ఎందుకిది యిలా విఫలమయింది? అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి యిదే నిజమైన జాతీయ పోరాటమని ప్రజాసామాన్యం భావించినప్పుడు, ఎందుకు దీని ఆశయం నెరవేరలేదు? దీనికి కారణం ఒక్కటే: మనం ఉన్నపరిస్థితులు కొత్తవి; కాని, అవలంబించిన పద్ధతులు మాత్రం పాతవి.

పరిస్థితు లేవిధంగా కొత్తవో చూదాం. మన దేశానికి తూర్పుదిశనుండి, పడమటనుండి, కూడా ఫాసిస్టు దుండగీండ్రు సమీపించుతున్నారు. పడమట, సోవియట్ సైన్యం అద్వితీయమైన ధైర్యసాహసాలతో ఫాసిస్టు మూకల్ని యెదుర్కొని పోరాడుతోంది. కాని, తూర్పున మనదేశపు సరిహద్దులకే ఫాసిస్టులువచ్చారు. నేడో, రేపో, దాడిచేయడానికి వారు సిద్ధంగా వున్నారు.

మన స్వాతంత్ర్య పోరాటంలో శాసనోల్లంఘన మొక్కటే సరియైన ఆయుధమని యింతవరకూ పరిగణించబడుతూ వచ్చింది. మన జాతీయోద్యమంలో యిది మాత్రమే అంతకంత కెక్కువగా పదును పెట్టబడుతూ వచ్చింది. అయితే ఇది యేపరిస్థితులలో? బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, భారతీయులు, మాత్రమే తమతమబలాబలాలు ప్రదర్శించుకొంటూన్నప్పుడు. కాని, ఈ రోజున ఫాసిజం అనే మరొక కొత్త శత్రువు మన దేశంపై లంఘించ జూస్తోంది. పాతపరిస్థితులు మారి, కొత్తపరిస్థితులేర్పడ్డాయి. ఇప్పుడుకూడా శాసనోల్లంఘనాస్త్రం పట్టుకొని వేళ్లాడటం పనికిరాదు. అలాచేస్తే, మన జాతీయ రక్షణను ధ్వంసంచేయడమవుతుంది; మన దేశం యెడల గొప్ప అపరాధం చేసినవారమవుతాం. నేటి కొత్త పరిస్థితుల్ని గుర్తించకుండా, పాతపద్ధతులే అవలంబించడంవల్ల నేడు యదార్థ పరిసితుల్ని మనకనుకూలంగా మార్చుకోజాలం. వాని కెదురుగా మన తలకాయలు బద్దలు కొట్టుకోవడం మాత్రమే జరుగుతుంది. దేశంలో నేడు జరుగుతూన్నది సరిగా యిదే.

పంచమాంగ దళ ప్రవేశం

జాతీయ నాయకు లరెస్టు చేయబడగానే, దేశభక్తిపూరితులైన ప్రజలు క్రోధోన్మత్తులై, ఒక మహా వెల్లువలోపడి కొట్టుకు పోయారు. వారిని సరియైన మార్గంలో నడిపించే నాయకులెవరూ లేరు. పంచమాంగ దళాని కొక చక్కని అవకాశం లభించింది. వెంటనే వారు కార్యరంగంలో ప్రవేశించారు. ప్రజల దేశభక్తిని వారు సులభంగా వినియోగించుకొనగలిగారు. ఇంతేకాదు. వేలకొద్దీ దేశభక్తుల్నివారు వంచించగలిగారు బ్రిటిష్ నిరంకుశత్వంపై పోరుసల్పడానికి శాసనోలంఘన మొక్కటే అంతవరకూ మన దేశభక్తులకు తెలిసిన ఆయుధం. కాని, యిప్పుడో? తమ నాయకులరెస్టు చేయబడి నందుకు పట్టలేని కోపంతో ఆవేశపరవశులయారు. ఆ ఆవేశంలో తాముచేసే పని యుక్తమా, అయుక్తమా, అనే విచక్షణను పోగొట్టుకున్నారు. పూర్వం మాదిరిగానే ఇప్పుడు కూడా వారీ పోరాటాన్ని సంఘటితపరిచారు. కాని, ఆ పూర్వపు పద్ధతులు నేటి కొత్తపరిస్థితులలో దేశరక్షణ విధ్వంసక క్రియలుగా తయారయాయి. ఈ విధంగా, క్రోధోన్మత్తులైన దేశభక్తులు ఫాసిస్టు దురాక్రమణ దారుల క్రింద జీతంలేని ఏజంట్లుగా మార్పుచెందారు. ఎక్కడైతే వీరికి పంచమాంగదళం తటస్థపడుతుందో, అక్కడ పాతకాలపు గాంధీపద్ధతులకు స్వస్తిచెప్పవలసిందని ప్రోత్సహించ బడుతున్నారు. చట్టాలు ధిక్కరించి జైళ్లకు వెళ్లడం నిష్ప్రయోజనమనీ, ప్రభుత్వాన్ని నిజంగా దెబ్బతీసే ఉపాయాలకు దిగవలసిందనీ, వారిని పంచమాంగ దళం పురిగొల్పుతూంది. ఉదాహరణకు, రాకపోకమార్గాలు విచ్ఛిన్నం చేయడం; ఉత్పత్తిని స్తంభింపజేయడం; వంతెనలు పడగొట్టడం. ఈ కార్యక్రమమే స్వాతంత్ర్య సంపాదనకు నిజమైన విప్లవపంథా అని రుజువు చేయడానికి విప్లవ, సోషలిస్టు శబ్దజాలం కూడా ఉపయోగించబడుతోంది. ఈ పంథా జాతీయ రక్షణను నాశనం చేస్తుందనే యదార్థాన్ని కప్పిపుచ్చడానికే, ఈ విప్లవ, సోషలిస్టు శబ్దజాలం వినియోగపడుతోంది. ఈ విధ్వంసకక్రియలవల్ల మనం కళ్లార చూచిన ఫలితాలేమిటి? ఇవి బ్రిటిషు సామ్రాజ్యవాదుల్ని దెబ్బతీయడం కంటే, జపాను హంతకులకు సహాయపడ్డంలోనే ఎక్కువ వినియోగపడ్డాయి.

(మిగతా 10వ పేజీలో)

ప్రజాశక్తి

2-12-42 బుధవారం

విధ్వంసక చర్యలను అరికట్టండి!

కాంగ్రెసు నాయకులు ఆరెస్టుచేయబడిన వార్త విని, ఇతర రాష్ట్రాలలోవలె ఆంధ్ర దేశంలోకూడా, ప్రజలు క్రోధావేశులై, విధ్వంసక చర్యలకు పూనుకున్నారు. రైలుస్టేషన్లు, పోలీస్‌స్టేషన్లు, తగులపెట్టారు. టెలిగ్రాఫ తీగలు తెంచివేశారు. రైలు పట్టాలు ఊడబెరికారు ప్రభుత్వకార్యాలయాలను స్వాధీనం చేసుకోబోయారు. ఇలాచేస్తే బ్రిటిష్ ప్రభుత్వం లొంగక తప్పదని వారి విశ్వాసం.

కాని, సామ్రాజ్యవాదులు దారుణమైన నిర్బంధవిధానాన్ని దేశంలో ప్రవేశపెట్టారు. అయితే, దానివల్ల ప్రజల్ని యుద్ధోన్ముఖులుగా చేయలేకపోవడమేగాక, వారి బ్రిటిష్ వ్యతిరేకత అనేక రెట్లు ఎక్కువై, జపాన్‌కు చక్కగా వినియోగపడుతోంది.

ఇంతేకాదు. కొద్ది రోజులలోనే ముఖ్యమైన కాంగ్రెసు ప్రచారకులందరూ అరెస్టుచేయబడ్డారు. పోరాటాన్ని నడుపవలసిన నాయకులుగాని, నిర్మాణంగాని, లేదు. దేశభక్తులలో ఆశాభంగం ప్రవేశించింది. ప్రజలలో నిరుత్సాహం వ్యాపించింది. నిరంకుశాధికారవర్గం మరింత బలపడింది.

మన రాష్ట్రంలోని ప్రజలుకూడ విధ్వంసక చర్యలద్వారా బ్రిటిష్ ప్రభుత్వం కూలిపోదనీ, స్వాతంత్ర్యం లభించదనీ, క్రమేణ తెలుసుకున్నారు. కాని, అక్కడక్కడ కొద్దిమంది వ్యక్తులు చేరి, రహస్యంగా, రాత్రులలో, టెలిగ్రాఫ్ తీగలు తెంపడం, రైలుపట్టాలు పీకడం, స్కూళ్ళు తగలపెట్టడం, బ్రిడ్జిలకు నిప్పంటించడం, మొదలైన పనులు చేస్తున్నారు. ఇట్టి చర్యల ద్వారా జాతీయోద్యమం ధ్వంసం కాకుండా కాపాడుతున్నామని వారి నమ్మకం.

కాని, యిట్టి పనులు జపాన్ ఏజంట్లకు చక్కగా వినియోగపడుతున్నాయి. నెమ్మదినెమ్మదిగా ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఫార్వర్డు బ్లాకువంటి పంచమాంగదళం చేతుల్లో పడింది. ఈ యదార్థాన్ని ఉద్రేకులైన దేశభక్తులు గ్రహించడం లేదు. ఒక జిల్లా కాంగ్రెసుకమిటీ సహితం తన సర్క్యులర్‌లో యిలా వ్రాసింది: "ఈ పోరాటం సత్యాగ్రహ దశను దాటి ముందుకు వచ్చింది. మన పోరాటం చక్కని నిర్మాణముతో, కట్టుదిట్టాలతో ముందుకు సాగాలి" కొద్దిమంది వ్యక్తులు రహస్యంగా అక్కడక్కడ విధ్వంసక చర్యలు చేయడంవల్ల జాతీయ పతాకంయొక్క గౌరవాన్ని నిలెబెట్టుతున్నామని విశ్వసించే దేశభక్తులు, వాటి ఫలితాలెంత హానికరంగా పరిణమిస్తున్నాయో ఈ క్రింది ఉదాహరణలవల్ల తెలుసుకొనగోరుతున్నాం:

"— అనే గ్రామంలో.... అనే వ్యక్తి అరెస్టు చేయబడ్డాడు. అతడు లేనిపోని అబద్ధాలు చెప్పి గ్రామస్థుల్ని అరెస్టు చేయిస్తాడేమోనను భయంతో ప్రజలు రు 600 తమలో తాము వసూలు చేసుకొని, సర్కిలుకి లంచమిచ్చి, వానిని విడుదల చేయించారు. మనవారెంత (కమ్యూనిస్టులు) చెప్పినా వినలేదు." మరొక రిపోర్టులో యిలావుంది: "— అనే గ్రామముపై యీ మధ్య సాముదాయిక జరిమానా విధించిన తరువాత, ఆ గ్రామంలోనున్న పోస్టాఫీసు, స్కూలు, ఎవరో తగులబెట్టారు. ప్రజలు కోపోద్దీపితులై, ఆచర్యలు చేసిన రౌడీలను పట్టి ప్రభుత్వానికి అప్పగించాలని చూస్తున్నారు. గ్రామస్థులెంత భయపడ్డారంటే, సాముదాయిక జరిమానాను రద్దుచేయవలసిందని ఒక పిటిషన్‌పై సంతకాలు చేయడానికి సహితం నిరాకరిస్తున్నారు. జరిమానా చెల్లించుకుంటామని జవాబిస్తున్నారు." మరొక ఉదాహరణ:— "....అనే గ్రామంలో పార్టీలుండుటచే....అనేపేరుగల ఒకకాంగ్రెసు వాది తనను పోలీసులు అరెస్టు చేస్తారేమోనని భయపడి, ఆగ్రామంలో యిటీవల తీగలు తెంపిన వాళ్ల పేర్లు చెప్తానని, బహిరంగసభలలో ఖండిస్తాననీ, అంటున్నాడు. తనవద్దకు చందాకైవచ్చిన యిద్దరు ఫార్వర్డుబ్లాక్ ప్రముఖుల పేర్లు చెప్పివేస్తానంటున్నాడు."

వీటిని బట్టి, కాంగ్రెస్ దేశభక్తులు, ప్రజా సామాన్యం, ఎంతహీన స్థితికి దిగ జారిపోతున్నారో స్పష్టమవుతుంది. ఈ నైతికపతనాన్ని పోగొట్టడం స్వాతంత్ర్య ప్రియులందరి కర్తవ్యం. జపాన్‌వాడి పరిపాలన ఇంతకంటె కఠినంగా వుంటుందా? అనే భ్రమను ప్రజలనుండి పోగొట్టాలి. ఇలాచేయకపోతే, బ్రిటిష్ ప్రభుత్వ సంకెళ్లలోనుండి మన ప్రజలు జపాన్ ఫాసిస్టుల నరక కూపంలో పడిపోవలసి వస్తుంది.

అందుచే, విధ్వంసక చర్యలు చేసేవారిని ప్రజలు సర్వవిధాల నివారించవలసి యుంటుంది. అట్టి పనులు సాగనివ్వకుండా ప్రజలే అడ్డుపడాలి. తమ గ్రామసొత్తులకు పహరాకాచి, కాపాడుకోవాలి. పోలీసులకు పట్టి యివ్వడంవల్ల సామ్రాజ్యవాదుల్ని బలపరచిన వారమవుతాం. పట్టి యిచ్చినవారు ప్రజలనుండి దూరమవుతారు. విధ్వంసక చర్యల నాపుటకు యీ పద్ధతి పనికిరాదు. అయితే, గ్రామస్థులందరి సహకారం, ఐక్యత, లేకుండా విధ్వంసకారుల్ని నివారించడం కష్టం. కాబట్టి ప్రతిగ్రామంలోను పార్టీలు, కక్షలు, నశించి దుర్భేద్యమైన ఐక్యత పెంపొందాలి. ఇందుకు వివిధ పార్టీలనాయకులు, ప్రజలు, తీవ్రంగా కృషిచెయ్యాలి.

ప్రతి గ్రామంలోను రైతు కూలీల మధ్య ఐక్యత అవసరం. ఇది లేకపోచే, విధ్వంసకారులు కూలీలను సులభంగా లోబరచుకొనగల్గుతారు. ఇంతేగాక, గ్రామంలో లూటీలుజరిగి, అరాజకం వ్యాపిస్తుంది దీనిద్వారా నిర్బంధ విధానం బలపడి, ప్రజలలో జపాన్ అనుకూల భావాలు పూర్వంకంటె ఎక్కువౌతాయి.

జపాను దాడిని ఎదుర్కొటానికి, జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించడానికి, మీగృహాలను కాపాడుకోడానికి, విధ్వంసక చర్యలను అరికట్టండి! పోలీసు దౌర్జన్యానికి తావివ్వకండి! ఐక్య ప్రజారక్షణ సంఘాలు ఏర్పాటుచేయండి!!!

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం

స్వామి సహజానంద లేఖ

అఖిలభారత రైతుసంఘంనుండి ఆంధ్ర రాష్ట్ర రైతుసంఘం విడిపోయిందనీ, రాష్ట్ర రైతుసంఘమే రద్దుచేయబడిందనీ పత్రికలలో ప్రకటింపబడింది. కాని ప్రజలలో ఈ ప్రకటన వల్ల కొన్ని అపోహలు కల్గవచ్చు. రైతు సంఘాలన్నీ ఇందువల్ల రద్దుచేయబడ్డట్లు, రైతు ఉద్యమం సాగుటకే అవకాశం లేనట్లు భావించవచ్చు. కాని నిజపరిస్థితి అదికాదు: ఈ తీర్మానంవల్ల రంగాగ్రూపు మాత్రమే అ. భా. రైతు సంఘం నుండి చీలిపోవుటకు తీర్మానించిందని తెలుసుకోవాలి. ఈ విధంగా విడిపోవటం గత కొలదిమాసాలుగా రంగాగ్రూపు అనుసరిస్తున్న ఉద్యమవిచ్ఛిన్నచర్యల పర్యవసానంమాత్రమే. దీనినిగురించే అ భా. రైతు సంఘ ప్రధాన కార్యదర్శి స్వామి సహజానంద సరస్వతి రంగాగ్రూపు ఏవిధంగా రైతుసంఘ విచ్ఛిత్తికు ప్రయత్నిస్తున్నదో తన లేఖలో తెలియజేసాడు.

అ. భా. రైతు సంఘం ప్రస్తుత పరిస్థితులను గమనించి రైతు సంఘాలు మరీ తీవ్రంగాను, నిర్మాణయుక్తంగాను పనిజేయాలని హెచ్చరించింది. సంఘ సభ్యులను డిసెంబరు 31 లోగా జేర్పించ గడువిచ్చింది. కాని రంగాగ్రూపువారు రైతుసంఘాలు వ్యవహరిస్తానికే అవకాశంలేదంటూ, సంఘ సభ్యులను జేర్చ అవుసరంలేదంటూ వాదించసాగారు దీనిపై అ.భా. రైతుసంఘానికి అనేక కంప్లయింటులు చాలా జిల్లాలనుండి పంపబడ్డాయి. అందుచే అట్టి జిల్లాలనెల్ల ప్రత్యేకంగా ఫారాలు అచ్చువేయించుకోమని స్వామిజీ అధికారమిచ్చాడు. ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాన్నికూడా మందలిస్తూ, సంఘ సభ్యత్వాన్ని జేర్పించటం విషయంలో తొందరబెట్టసాగాడు. దీన్నిగురించి స్వామిజీ వ్రాస్తూ, ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాధ్యక్షులగు గోగినేని లక్ష్మినారాయణగారు తమకువ్రాసిన జాబు మిక్కిలి ఆక్షేపణీయంగాను, సహించరానిదిగాను ఉన్నదని తెలియజేసాడు. ఆజవాబువల్లనే అ. భా. రైతు సంఘం నుండి రంగాగ్రూపు చీలిపోవ సిద్ధంగా ఉన్నదనివారు గుర్తించారు. ఇందుకై అ. భా. రైతుసంఘాధ్యక్షులైన యాగ్నిక్‌తో స్వామిజీ సంప్రదించగా, ఈ విషయంలో అవుసరమైన చర్యలన్నీ దీసికొంటానికి స్వామిజీకి అధికారమిచ్చాడు. రైతు ఉద్యమాన్ని, సంఘ ఐక్యతను కాపాడటానికి అ. భా. రైతు సంఘం ఈవిధంగా కృషిచేస్తూవుంటే రంగాగ్రూపు రైతు సంఘాన్ని రద్దుచేయబూనుకొంది.

ఈ విషయాల నన్నిటిని విశదీకరిస్తూ స్వామిజీ ఇలా వ్రాస్తున్నాడు. "నా వుత్తరానికి జవాబుగా కామ్రేడ్ జి. యల్. నారాయణ వాసినవుత్తరం మిక్కిలి ఆక్షేపణీయంగాను, సహించరానిదిగాను ఉన్నది. బొంబాయిలో జరిగిన సెంట్రల్ కిసాన్ కౌన్సిల్‌తీర్మానాలను గూర్చి దూషిస్తూ నాకున్నూ యాగ్నిక్‌జీకిన్నీ వ్రాశాడు. చిరకు అ.భా. రైతు సంఘాన్నుండి కూడ విడిపోవడానికి తీర్మానంచేశాడు.

"ప్రస్తుత కర్తవ్యంస్పష్టమే. నేనుప్రస్తుతం మిమ్ములను రాష్ట్ర రైతుసంఘ ఆర్గనైజరుగా నియమిస్తున్నాను. సాధ్యమైనంత త్వరగా, చురుకుగా రైతుసంఘ సభ్యులను జేర్పించుటకు పూనుకొనండి. ఇక్కడనుండి అన్ని ఏర్పాట్లను జేస్తానికి అవకాశంలేదుగాన తగిన చర్యలన్నీ దీసుకుంటానికి మీకు సంపూర్ణమైన అధికారాన్ని ఇస్తున్నాను."

అ భా. రైతు సంఘం ప్రధానకార్యదర్శి హోదాతో స్వామిజీ వ్రాసిన పైవుత్తరంవల్ల రంగాగ్రూపు ఏవిధంగా రైతు ఉద్యమ విచ్ఛిత్తికు దారితీసిందో స్పష్టంగా తెలుసుకోవాలి. నేడు రైతాంగాన్ని అనేక క్లిష్ట సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఒకప్రక్క ఫాసిస్టు దాడి భయం, వేరొకప్రక్క దేశంలో చెలరేగుతున్న అశాంతి, అరాజక చర్యలు, మరొకప్రక్క ప్రభుత్వ నిర్బంధవిధానం మన కర్తవ్యాలను తెలియజేస్తున్నాయి. వీటన్నిటితోబాటు ఆహార పదార్థాలకొరత, జమీందారుల దాడి మొదలగుభీషణసమస్యలన్నీ ఎదుర్కొంటున్నాయి. వీటి నన్నిటిని ధైర్యంగా ఎదుర్కోవలసిన బాధ్యత రైతుసంఘాలపై బడింది. అప్పుడే స్థానికంగా అచ్చటచ్చట రైతు సంఘాలు వీటివిషయంలోకృషిజేస్తూ జయాన్ని పొందుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో రైతుసంఘాలనే రద్దుచేయటం సమస్యలనెదుర్కొనుటకు భయపడి పారిపోవటమన్నమాట; రైతు ఉద్యమ బలాన్ని, నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేయడం అన్నమాట.

స్వామిజీ యిచ్చిన సూచన ప్రకారం అన్ని జిల్లాలలోను ప్రస్తుతం రైతు సంఘాల కృషి జరుగుటకు గాను, సంఘ సభ్యత్వం జేర్పించటానికిగాను యీ క్రింది జిల్లా ఆర్గనైజర్లను నియమిస్తున్నాను. విశాఖపట్నంజిల్లా: కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్య, తూర్పు గోదావరి జిల్లా కామ్రేడ్ చింత సత్యనారాయణదాసు, ప॥ గో॥: కామ్రేడ్ భూపతిరాజు లక్ష్మి నరసింహరాజు, గుంటూరు: కామ్రేడ్ కె. కోటేశ్వర్రావు. నెల్లూరు: కామ్రేడ్ పూసపాటి నరసింహం, చిత్తూరు-కామ్రేడ్ రాటకొండ నరసింహారెడ్డి, కడప-కామ్రేడ్ మోకా వెంకటసుబ్బయ్య. అనంతపురం - కామ్రేడ్ టి. నాగిరెడ్డి. కర్నూలు-కామ్రేడ్ వి. రామయ్యశాస్త్రి.

అ॥ భా॥ రై॥ సంఘం తరపున సభ్యత్వ ఫారాలు అచ్చువేయించి, అన్ని జిల్లాలకు పంపబడ్డవి ఆయా జిల్లాలలో యీ పై ఆర్గనైజర్లు సభ్యులను జేర్పించుటకుగాను అవుసరమైన అన్ని చర్యలను తీసుకొంటారు, రైతు సంఘ వర్కర్లందరూ వీరికి సహాయపడి డిసెంబరు నెలాఖరులోగా సభ్యులను విరివిగా జేర్పించ కోరుతున్నాను.

వివిధ జిల్లాలలోని రైతు శ్రేయోభిలాషులకు ఒక మనవి చేస్తున్నాను రైతు వుద్యమ బలాన్ని, సంఘ నిర్మాణాన్ని కాపాడుటకు మీరందరూ పూనుకోవాలి. ఇందులకై మీరు చేసే సహాయాన్ని మిక్కిలి సంతోషంతో మేము అందుకుంటాము. పార్టీలు, కక్షలతో నిమిత్తం లేకుండా అందరం రైతు సంఘాలను పునరుద్ధరించి, పోరాట సంస్థలుగా తయారు చేస్తానికి కృషి చూద్దాము.

ఇందులకు మీరందరూ సహాయం జేస్తారని ఆశిస్తున్నాను.

చలసాని వాసుదేవరావు,
రాష్ట్ర రైతుసంఘ ఆర్గనైజరు.

జోయా వీరగాథ

కామ్రేడ్ నిడమర్తి ఉమారాజేశ్వరరావు

మాస్కో మొదలు వ్లాడివాస్టక్ వరకు, సోవియట్ యూనియన్ అంతటా తానియా అనే జోయాకోస్మాదెమియాన్స్కయా పేరు విననివారులేరు. ప్రజలందరిచేతను ఈమె ఒక గొప్ప వీరవనితగా యెంచబడుచున్నది. అసాధారణఆత్మబలిదానమునకును, ధైర్యసాహస, ఉత్సాహ ఉద్రేకములకును ఈమె మరణాంతరము 'సోవియట్ వీరబాలిక' 'లెనిన్ మార్గగామి,' అను బిరుదులతో గౌరవింపబడి యున్నది. ఎర్రసైన్యం నాజీలనుండి పెట్రిషీవో గ్రామాన్ని తిరిగి ఆక్రమించుకున్న తరవాత, ఆ గ్రామస్థులు జోయా జీవితాన్నిగురించి చెప్పిన కథయిది—

మాస్కోమీద గత జర్మన్ దాడి జరిగిన సమయానికి, జోయా చక్కగా చదువుకొన్నపద్ధెనిమిదేండ్ల పడుచు. రష్యనుభాషలోను, విదేశ భాషల్లోను సాహిత్యాన్ని చదువుతూండేది. విద్యాభ్యాసకాలంలోనే ఆయుధ ఉపయోగాన్ని అభ్యసించింది. నాజీలు మాస్కోమీద దాడిచేశారు. తనపవిత్ర మాతృదేశరక్షణలోతానుకూడా పాల్గోనాలనే ఉత్సాహంతోటీ,ఉద్రేకంతోటి,జర్మన్ సైనికశ్రేణులవెనుక భాగంలో పనిచేస్తోన్న ఒకగెరిల్లాదళంలోపనిచేయుటకుఅనుమతిని సంపాదించింది. మాస్కోకు అనతిదూరంలోనేవున్న పెట్రొషివో గ్రామంలో జర్మన్ సైన్యాలున్నాయి. ఆ గ్రామ సమీపంలోనే ఆ గెరిల్లాదళం పనిచేస్తోంది. యుద్ధరంగాన్నిదాటి జోయా దళాన్ని జేరుకుంది. అనేక జర్మను సైనిక శిబిరాలను, కార్యాలయాలనే కాక, శత్రు పెట్రోలు బంకులను, ఆయుధ సామగ్రిని, ఆహారపదార్థాలను జయప్రదంగా తగులబెట్టి సర్వనాశనంచేసింది. జర్మన్ సైన్యాన్ని చీకాకుపరచి, చిందరవందరగానించుటలోను, వారికి చిక్కిపోకుండా మోసంచేసి తప్పించుకొనుటలోను ఆమె పొందిన జయాల వలన త్వరలోనే ఆమె, నాజీలకు గుండెల్లో గాలము, పక్కల్లో బల్లెము, సింహస్వప్నము అయింది. పగటిపూట అడవులలోదాక్కునేది. ఆహారపదార్థా లయిపోవచ్చిన సమయంలో, దళంలో తక్కిన గెరిల్లాలు వెనక్కు తగ్గుదామన్నప్పుడుకూడా, జోయా అక్కడనేవుండి శత్రునాశనం చెయ్యాలని పట్టుపట్టేది.

ఇట్లా కొంతకాలం తన శత్రు విధ్వంసన కార్యక్రమాన్ని నిరాటంకంగా, విజయవంతంగా కొనసాగించింది. కాని ఒక రాత్రి శత్రు సరకుల మోడను తగులబెట్టే ప్రయత్నంలో జోయా పట్టుబడిపోయింది. శత్రువులు ప్రశ్నలు వేసి, సమాధానం కొరకై ఆమెను దారుణ హింసలకు గురిచేశారు. జోయా, తనదళంలో తక్కిన గెరిల్లాల అనుపానులు వెలిబుచ్చక పోవడమేకాక, తన పేరునైనా వెల్లడించ నిరాకరించింది. నాజీ లామెను నిర్బంధించి, యించుమించు వివస్త్రనుచేసి, మంచుమీద పాదరక్షలు లేకుండా నడిపించారు. త్రాగుటకు మంచి నీరడిగి నప్పుడు, పహరా సైనికుడామె నోట్లో కిరసనాయిలు పోశాడు. వెలుగుతోన్న దీపంతో ఆమె ముఖమంతా వాతలు పెట్టాడు. చివరికి, ఆమెను ఊరిమధ్య ఉరివేదిక వద్దకు ఈడ్చుకొనివెళ్ళి, బహిరంగంగా ఉరితీశారు. ఈ ఉరి దృశ్యాన్ని చూచుటకు జర్మన్ సైనికులచేత నిర్బంధంగా పోగు చేయబడిన గుంపుకు, జోయా, ఉరివేదికమీదనుండి ఈ అమరసందేశ మిచ్చింది. "కామ్రేడ్సు, అధైర్యపడొద్దు. సాహసంతో సమరంచేసి, నాజీ నరహంతకులను నుగ్గునూచగా కొట్టండి. తగులబెట్టి తరిమెయ్యండి. నాకు మృత్యువంటే ఏమాత్రమూ భయంలేదు ప్రజలకొరకై పోరాడి, ప్రాణాలర్పించడం అతి పవిత్రమైన కార్యం. ఈ మహదవకాశం కలిగినందుకు నేను చాలా గర్విస్తున్నాను."

ఈపైశాచికహింసాకార్యక్రమాన్ని జర్మన్ ఆఫీసర్లు ఫొటోలు తీసుకుంటుండగా, జోయా, జర్మన్ సైనికులకీ క్రిందిమాటలు చెప్పింది. "మీరు నన్నురితియ్యవచ్చును. కాని ఉన్నది. నేనొక్కతెనేకాదు. మా ప్రజలు యిరవైకోట్లమంది. మమ్మల్నందరినీ ఉరి తియ్యటానికి మీతరంకాదుగదా....మావారు నామరణానికి పగతీర్చుకోకమానరు. జర్మను సైనికులారా, సమయం మించిపోకపూర్వమే లొంగిపొండి. విజయలక్ష్మి ఎర్రసైన్యాన్ని వరించితీరుతుంది." ఆమె మెడకు ఉరితచ్చు బిగింపబడి కాళ్ళక్రింది కొయ్యపెట్టె తన్ని వేయబడేసమయంలో తన ప్రజలకు ఆమె తుదిసందేశమిది.

"గుడ్ బై కామ్రేడ్సు; ధైర్యసాహసాల్తో యుద్ధం కొనసాగించండి. స్టాలిన్ మనతో వున్నాడు. అతడే మిమ్మల్ని రక్షిస్తాడు."

—"సోవియట్‌యూనియన్‌న్యూస్" నుండి.

"సోవియట్ వీరుడు"

కామ్రేడ్ వి. యస్. పి.

ఫిజానొవిచ్ ప్రపంచప్రఖ్యాతిగన్న జలాంతర్గామి "మిల్యూట్కా" కాప్టెన్. అతని ఎత్తైన ఫాలభాగం కటువైన యుద్ధజీవితంవల్ల ముడుతలు వారింది. కళ్ళు ఆకాశంవలె నీలివర్ణంగా ఉంటాయి. ఆర్కిటిక్ సముద్రపు గంభీరత, నిశ్చలత్వం, ఆ కళ్ళలో ప్రదర్శించబడుతూంటాయి. ఫాసిస్టు నావలను ముంచిన అనుభవాలు వర్ణించేటప్పుడు ఆకళ్ళు మరింత మెరుస్తాయి. ఆమెపపులో క్రోధాగ్ని ప్రజ్వలిస్తూ ఉంటుంది. అతని యౌవనం ఒక చిరునవ్వులో మాత్రమే ద్యోతకమవుతూవుంటుంది.

యుక్రేన్‌లో నికిరోవాగ్రాడ్ అతని జన్మస్థానము. తండ్రి పుస్తకాలమ్ముతూండేవాడు. కుమారుడొకనాటికి ఏ నావకైనా కాప్టెనవుతాడని తలిదండ్రులు కలలోనైనా తలచలేదు. అతనికికూడా అలాంటి అభిప్రాయం ఎప్పుడూ కలగలేదు. 7 ఏట ఫిజానొవిచ్ తలిదండ్రులతో పాటు కార్ఖోవ్ వెళ్ళాడు. అచట వున్నతపాఠశాల విద్య నభ్యసించి వుత్తీర్ణుడయాడు అప్పుడప్పుడు గీతాలు వ్రాస్తూవుండేవాడు. పద్యగ్రంథాలంటే నదుప్రీతి. కళాకేంద్రాలకు ఎక్కువగా వెళ్తూండేవాడు. ఇలాంటి జీవితం తన ప్రవృత్తికి తగదని అతనికి బాగాతెలుసు.

చదువు పూర్తికాగానే కొంత కాలం "హేమర్ అండ్ సికిల్" (సుత్తి, కొడవలి) ఫాక్టరీలో పనిచేశాడు. తరువాత అతడు, నావికుడైతే ప్రపంచాన్నంతా దర్శింపవచ్చునను యాశతో, లెనిన్‌గ్రాడ్ నావికా పాఠశాలలో చేరాడు. 1936 సంవత్సరంలో- తన కప్పుడు 21 వ సంవత్సరం- ఆపాఠశాలలో ప్రత్యేక మన్ననలతో ఉత్తీర్ణుడయాడు.

అప్పటినుండి, అంటే ఆరు సంవత్సరముల నుండి, దుర్భర చలితోగూడి, ఘోరప్రమాదాల కాలవాలమైన ఆర్కిటిక్ సముద్రమే అతని నివాసస్థలమయింది. 1941 ఆగస్టు నుండి అతనిలో ఒక నూతనజ్యోతి ప్రజ్వలింపసాగింది. సర్వకాల సర్వావస్థలయందు తన జలాంతర్గామితో ఆర్కిటిక్ సముద్రపుటడుగున సంచరిస్తూ వుండేవాడు. మాతృదేశ సమీపంలోనే పల్లెలు, పట్టణాలు దుష్ట ఫాసిస్టు అగ్నికీలల కాహుతియగుచున్నవని అతనికితెలుసు. ఈసముద్రమార్గముద్వారానే శత్రువుమాతృభూమిపైకి వినాశకరమయిన మృత్యు సంరంభాన్ని తెచ్చుచున్నాడని కూడా అతడు గుర్తించాడు.

ఒకరోజున సమీపరేవుకు ఒక జర్మన్ సరఫా నావ వచ్చిందని అతడు వార్తవిన్నాడు. క్షణంలో ఆప్రదేశానికి వెళ్ళాడు. నావ తీరం వెంట రేవులో దూరంగా ప్రశాంతంగా నిలిచివుంది. నావికులు సరకులు దిగుమతి చేస్తూవున్నారు వారాసమయంలో ప్రమాదాలెంచే స్థితిలో లేరు. ఫాసిస్టులు యూరప్‌లో లభించినచవుక విజయాలతో మత్తెక్కియున్నరోజులవి. రేవులోదూరంగాయున్న ఆనావనుకొట్టటం ఫిజానొవిచ్‌కు అంత తేలికగా కనుపించలేదు. అయినా మెరుపుదెబ్బ తీయాలనుకున్నాడు. జయించాడు. జర్మన్ నావ సముద్రపుటడుగు చేరింది! కొద్ది రోజులలోనే మరొ. జర్మన్ నావ ఆరేవుకు సమీపించుట ఫిజానొవిచ్ చూచాడు. క్షణంలో, నావ రేవును చేరకమునుపే ఇదికూడా మొదటి నావ ప్రక్కకు చేరుంది.

అప్పటినుండి ఫిజానొవిచ్ తన బేబీ జలాంతర్గామితో జర్మన్ నావికుల గుండెలదరగొట్టాడు. యుద్ధ నావలరక్షణుంటే తప్ప సరఫరా నావలు ఆరేవును సమీపించలేక పోతున్నాయి. యుద్ధ నావలరక్షణున్నప్పటికినీ, ఈ సోవియట్ పిడుగు కంటపడకుండా పోవాలని ప్రయత్నించేవారు.

ఒక సమయంలో ఆయుధసామగ్రి, సైనికులతో నిండిన కొన్ని జర్మన్ సరఫరానావలు యుద్ధనావల కాపలాతో ఆర్కిటిక్ ప్రయాణం చేయటం ఫిజానొవిచ్ చూచాడు, ఆకాశం నిర్మలంగావుంది. మేఘరక్షణగాని, పొగమంచు రక్షణగాని లేదు. అయితే ఫిజానొవిచ్ ఊహలకు ఇలాంటి ఆలోచనలు చాలాదూరం. రెప్పపాటులో ఆనావల సమూహంమద్య మెరిశాడు. దెబ్బతీశాడు. సరఫరానావ లప్పటికప్పుడే సముద్రపుటడుగుజేరుకొంటూన్నాయి. యుద్ధనావలన్నియు ఒక్కసారిగా బేబీ మిల్యూట్కా వెంటబడ్డాయి, జర్మన్‌లు దానిపై 324 డెప్త్ చార్జీలకు (జలాంతర్గామి విధ్వంసక బాంబులు) పైగా విసిరారు. బేబీ మిల్యూట్కా బాగా దెబ్బతిన్నది. కాని ఫిజానొవిచ్ జంకలేదు. దృష్టి మాతృదేశతీరం వైపే యున్నది. రేవునుసమీపించుచున్నాడు. సోవియట్ తీరరక్షణ ఫిరంగులుమ్రోగాయి. జర్మన్ యుద్ధనావలు వచ్చిన త్రోవబట్టాయి. తిన్న దెబ్బలనుబట్టి బేబీ మిల్యూట్కాకు ఆ 8 జర్మన్ నావలగతి పట్టిందనుకోటానికెట్టి సందేహమూలేదు. కాని అకస్మాత్తుగా బేబీ మిల్యూట్కా నీటిపైకొచ్చింది. జర్మనులు సిగ్గుపడ్డారు. తమ విమానబలాన్నీ పంపారు. రెండుసార్లు ఫిజానొవిచ్ ప్రమాదావస్థలో చిక్కుకుపోయాడు. కాని తన నివాసమయిన ఆర్కిటిక్ సముద్రం అతన్ని రక్షించింది. క్షేమంగా గమ్యస్థానానికి జేర్చింది.

ఇలాంటివన్నీ "సోవియట్ వీరుడు" ఇజ్రైల్ ఫిజానొవిచ్‌కు దైనందిన ఘట్టాలు.

—మాస్కోన్యూస్ నుండి.

పదవోయ్ ముందుకు!

పదవోయ్‌ముందుకు, పదవోయ్‌ముందుకు,
ఫాసిస్ట్‌రాక్షసిని పరిమార్చాలోయ్ ॥పద॥

* *

భారతమాతా పల్లవకరముల
'ఢంఢం ఢాంఢం ఢాంఢాంఢం'
ప్రభాతభేరీ మ్రోగిందోయ్;
అన్నిదిక్కులా అందచీతమ్ముల
కోడికూతై మేల్కొలిపిందోయ్ ॥పద॥

* *

వేడినెత్తురు పొంగులువారే
వీరాగ్రేసర, వెనుకాడేవోయ్!
జంకూ, గొంకూ, జడుపూవిడిచీ
చంకలుగొట్టుచు సమరాంగణముకు ॥పద॥

* *

నల్లనిగుండెల నాటినఖడ్గం
వెంబడిపైపై పెచ్చగచిమ్మే
ఎర్రటినెత్తు శ్శైగపీల్చేసీ
ఫాసిజంపిశాచి పరవశ్యతొక్కే
దేశాల్వంకా తిలకించోయ్ ॥పద॥

* *

తల్లిపొట్టపై తారట్లాడే
నిసుగుగొంతుకా 'కసక్కు'మందీ;
ఆకలిబాధకు అటమటిల్లే
బీదరైతుబిడ్డనుపట్టీ
తుపాకిగుండుతో జోకొట్టేరూ;
నారీమణులను నగ్నులచేసీ
శీలంచెరిచీ, దేహంచెక్కే.
క్రౄరతొకాల్చీ, ఖూనీచేశారూ;
ముసలీ ముతకా, ఆడమగా,
పెద్దాపిన్నా భేదంలేక,
వాడికత్తితో వరసగనందరి
కవోష్ణరక్తం గుటగుటతాగారూ;
పంటలుకాల్చీ, ప్రజలనుదోచీ,
చావుమూల్గులే సంగీతంగా
ఆనందించే దెయ్యపుమూకను
చచ్చుగుండెతో సహింపగలవా?
రక్తంలొచిచ్చు రగుల్కోదా?
పొంగీ, పొరలీ, ముందుకునెట్టద? ॥పద॥

* *

ఫాసిజంరక్కసి పాదంమోపితె,
బీదాబిక్కికి బేఆఫ్‌బెంగాల్....
దేశమ్మంతా శ్మశానవాటిక,
మన్నుమశానం, మారణహోమం ॥పద॥

* *

పాలకవర్గం పౌరద్రోలీ
ప్రజాప్రభుత్వం స్థాపించుటకూ,
ఫాసిస్ట్‌భూతం పడద్రోసేసీ
భారతశౌర్యం ప్రకటించుటకూ ॥పద॥

* *

కల్లీబొల్లీ కబుర్లునమ్మకు,
ఫాసిజంమెరుగని భ్రమించబోకు,
పరులసహాయం ప్రార్థించకురా,
మనచేతులె మనఘనసంరక్షణ ॥పద॥

* *

ఎండిపోయినా ఎముకలగూండ్లతో
అచ్చనగాయలు ఆడుకొనే,
ఫాసిజరాక్షసి బారినుండీ
ఆలుబిడ్డలను ఆత్మదేశమును
సంరక్షించీ స్వాతంత్ర్యాన్నీ
ప్రతిష్ఠింపగా పరుగుపరుగునా,
చేతులుచేతులు జోడీచేసీ,
జాతీయమంత్రం జపించుకొంటూ,
'కదంతొక్కుతూ, పదంపాడుతూ'
ఎర్రబావుటా ఎత్తిచూపుతూ ॥పదవోయ్॥

—కామ్రేడ్, కొంగర జగ్గయ్య-

ప్రపంచ యుద్ధసమీక్ష

సోవియట్ అడకత్తెరలో మూడులక్షల శత్రుసైన్యం

రష్యనుల శీతాకాలపు దాడి ప్రారంభమయింది - అక్ష రాజ్యాలకు వణుకుపుట్టింది. నవంబరు 20 వ తేదీన ప్రారంభమైన యీ యెదురు దాడి యిప్పటికిప్పుడే మంచి విజయాలను సాధించగల్గింది. గత సంవత్సరం డిశంబరు 6 వ తేదీ రష్యా - జర్మనీ యుద్ధ చరిత్రలో యెట్టి మహత్తరదినమో, యీనాడు కూడ అట్టి చరిత్రాత్మక దినమని చెప్పాలి.

స్టాలిన్‌గ్రాడ్

స్టాలిన్‌గ్రాడుకు వాయువ్యం నుండి, దక్షిణంనుండి ప్రారంభమయిన యీ దాడుల ఫలితంగా, 'కలాచ్' సోవియటు సైన్యాల చేజిక్కింది. 'క్లెట్‌స్కయా' పట్టుబడింది. సోవియటు సహాయక సైన్యాలు స్టాలిన్‌గ్రాడ్ యోధులను చేరాయి. ఫ్యాక్టరీ ప్రదేశమంతా సోవియటు చేతులలో బడింది. స్టాలిన్‌గ్రాడ్ ముట్టడి భగ్నమయింది. వాయువ్యంలో 'సెరాఫిమోవిచ్' నుండి, దక్షిణాన 'కాల్మక్' పచ్చిక బయళ్ళనుండి బయలుదేరిన యెదురు దాడుల ఫలితంగా 3 లక్షల జర్మను సైన్యాలు చుట్టుముట్టడికి గురి అయి ఆహుతి అయ్యే అవకాశం గలిగింది. 'కలాచ్'కు దక్షిణంగా డాన్ నదివద్ద రష్యన్ల అడకత్తెర కలిసింది. ఇప్పటికప్పుడే పదిదినాలలో లక్షమందిజర్మన్లు హైరేలయ్యారు. వందలకొలది గ్రామాలు, పట్టణాలు తిరిగి సోవియటు చేతులలో పడుతున్నాయి. స్టాలిన్‌గ్రాడ్ ప్రదేశంలోనేకాక, "నాల్చిక్"కు ఆగ్నేయంగాను, "ట్యాప్సీ"కి ఈశాన్యంగాను కూడ సోవియటు దాడులు ప్రారంభమయాయి.

మధ్యరంగం

ఈ మధ్యరంగంలో "వెలికిలుకీ"-"రెజెవ్" ప్రదేశంలో సోవియటు దాడి ప్రారంభమయినది. "నొవొసొకొలినికి" అనే పట్టణ ప్రాంగణానికి సోవియటు సైన్యాలు చేరాయి. "నెవెల్"ను కూడా అపాయ స్థితికి గురి చేస్తున్నాయి. ఈ రెండూ, 'లెనిన్‌గ్రాడ్'నుండి, 'విటెబెస్క్'గుండా కీవుకుపోయే రైలుమార్గాన ఉన్నాయి. 'నొవొసొకొలినికి' లాట్వియా సరిహద్దులలో 60 మైళ్ళలోవుంది.

ఈ సోవియటు ఎదురుదాడుల ప్రాముఖ్యత ఏమిటి? గత శీతాకాలంలో వలెనే హిట్లరుకు దుర్గతిపడుతుంది. గతశీతాకాలంలో, హిట్లరుకు మాస్కో లభించలేదు సరికదా ఎదురుదాడులు సాగి, పట్టణం వలయంనుండి తప్పించబడింది. ఈ సారి స్టాలిన్‌గ్రాడ్ చిక్కలేదు. జర్మను సైన్యాలకు శీతాకాల స్థావరాలు లభించలేదు. విశ్వప్రయత్నంచేసి, స్టాలిన్‌గ్రాడ్ ఉత్తర ప్రాంతాన్ని వశంచేసుకొనదలచిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈసారి హఠాత్తుగా, గత సంవత్సరం కంటేముందుగా దాడి ప్రారంభమయింది. జర్మన్లకు ఆశ్చర్యం కల్గించేటట్లు హఠాత్తుగా శీతాకాలపుదాడి పారంభమయింది. ప్రవదా ఇలా వ్రాసింది "మాదాడి జర్మన్లకు పూర్తిగా ఆశ్చర్యం కలుగునట్లు ఆకస్మికంగా ప్రారంభమయిన దనుటలో సందేహంలేదు. ఆకస్మికంగా సర్వనాశనం గావించేటట్టి దెబ్బను కొట్టాం."

గందరగోళంలో, జర్మనులు విపరీతనష్టాలకు గురి అవుతున్నారు. జర్మనుల మనోదండి భగ్నమవుతోంది. ప్రతిట్రెంచిపైనా తెల్లజండా (లొంగిపోయేటప్పుడు చూపేది) ఎగురుతోంది.

స్టాలిన్‌గ్రాడ్ సంరక్షణయే, ఈ శీతాకాలపు ఎదురుదాడికి ప్రాతిపదిక అయింది. ఇదివరకు అనేకిసార్లు, స్టాలిన్‌గ్రాడ్ సంరక్షణ, యుద్ధ చరిత్రలో ఎలా కీలకస్థానమో చెప్పాము. అది ఈనాడు చూస్తున్నాం.

సుప్రసిద్ధ రష్యన్ రచయిత్రి 'ఇల్యా ఎహ్రన్ బర్గ్' ఇలా వ్రాస్తోంది. "స్టాలిన్‌గ్రాడ్ సంరక్షకులు అంత పటిమ చూపించటం నేరమనీ, అనవసర త్యాగమనీ మనమిత్రులు తలిచారు. వాస్తవంలో, స్టాలిన్‌గ్రాడ్‌రక్షణ, పెద్ద స్ట్రాటిజికల్ (వ్యూహం)ప్లానులో ఒకభాగం స్టాలిన్‌గ్రాడ్ రక్షణప్రస్తుత దాడికి దారితీసింది. రెడ్ అక్టోబరు ఫ్యాక్టరీకి, జర్మనులకు మధ్యనున్న కొన్ని అమిగుల ప్రదేశమే, ప్రపంచవ్యాపిత ప్రాముఖ్యత వహించింది."

స్టాలిన్‌గ్రాడ్, మాస్కో రంగాల దాడి ఆశయమేమిటి? ఇజ్వెస్టియా వ్రాతలనే తీసుకొందాం. "అనేక విషమ పరిస్థితుల మధ్య శత్రువును నాశనం చేయగలశక్తిగలది రెడ్ ఆర్మీ అని, అది చాటింది. జర్మనుల ఓటమిని స్టాలిన్‌గ్రాడ్‌వద్ద హిట్లరు దుండగీడుల సర్వనాశనంగా మార్చగలదు....స్టాలిన్‌గ్రాడ్‌వద్ద, వొరొనెజ్‌వద్ద, ట్యాప్సీవద్ద, మ్యూర్మన్స్కవద్ద, లెనిన్‌గ్రాడ్‌వద్ద, జర్మనులు మృత్యువు తమను ఎలా ఆవరించుతుందో తెలిసికొంటారు. వాల్గా, డాన్‌నదులు ఇచ్చిన జవాబే ఈ ప్రదేశాలలో కూడ జర్మనులకు యిస్తున్నారు."

ఇలా వ్రాసి దాదాపు వారంరోజులయింది. అప్పుడే వెలికిలుకీవద్ద దాడి ప్రారంభమయింది. కలూగా, వొరొనెజ్‌లవద్ద రష్యనులు దాడులకు సంసిద్ధమౌతున్నట్లు వార్తలు. స్టాలిన్‌గ్రాడ్‌దాడి నాధారం చేసికొని, వొరొనెజ్‌ను ప్రాతిపదికగా తీసుకొని, రోస్టావ్, వొరోషిలావ్‌గ్రాడ్‌లను తిరిగి వశంచేసికోడానికి రష్యనులుప్రయత్నించుతారు. వెలికిలుకీవద్ద ప్రారంభమయిన దాడికి అర్థం: లెనిన్‌గ్రాడ్ ముట్టడిని సడలించడం, బాల్టిక్‌తీరంలోని రేవులను ముఖ్యంగా "రీగా"ను తిరిగి పట్టుకొనడం.

గతసంవత్సరం కంటేకూడ జర్మనీకి ఈ శీతాకాలంలో పరిస్థితులు మరింత ప్రతికూలంగా వున్నాయి. ఇప్పటికే ఆతుకులబొంతగావున్న జర్మనీ సైన్యం బరువు మోయలేని స్థితికి వచ్చింది. జర్మను వెనుభాగం (రియర్)లో అగ్నిపర్వతంబ్రద్దలయేస్థితికి వచ్చింది. ఆఫ్రికా యుద్ధఫలితంగా, ఆఫ్రికారంగాన్ని ఫ్రాన్సు ఇటలీలపై దండెత్తడానికి, పశ్చిమంలో రెండవ రంగం తెరవడానికి గావలసిన పరిస్థితులు సృజించబడ్డాయి. ఇట్టి అనుకూలపరిస్థితుల మధ్య సోవియట్ సైన్యాలు, సోవియట్ సుక్షేత్రంలోనే ఫాసిస్టు నరహంతకులను సమూలంగా నాశనంచేసే అవకాశాలు కన్పించుతున్నాయి.

ఆఫ్రికా

సోవియటు ఎదురుదాడులు సకాలంలో సాగగంవలన, ఆఫ్రికాలో మిత్రరాజ్యాలపని కొంత సులభ మయింది. ట్యునీషియాకు ఆయువుపట్టులయిన బిజెర్టా, ట్యూనిస్‌లకోసం మిత్రమండలి సైన్యాలు ముందుకు సాగుతున్నాయి. ట్యూనిస్ ఫిరంగిగుండ్లకు ఎర అయేఅంత దూరం లోపలే వున్నాయి. [illegible]

యుద్ధం కొంత మందగించింది రోమెల్ ఎల్‌ఆగీలా వద్ద విలచివున్నాడు. ఈ యుద్ధ రంగంలో ఈ వారం రెండు ముఖ్యఘటనలు జరిగాయి. ఒకటి డాకర్ మిత్రమండలి చేతులలోకి (డార్లన్ ఆధిపత్యంక్రింద) రావడం టూలాన్ (మధ్యధరాసముద్రంలో ఫ్రెంచిరేవు పట్టణం)ను జర్మనీ ఆక్రమించుకోడం డాకర్ మిత్రమండలికి రావడం ఫలితంగా, అట్లాంటిక్ సముద్రంలో కొంత ఉపద్రవం తగ్గింది. టూలాన్ ఆక్రమించినప్పుడు, అచటి నౌకలను ముంచివేసి హిట్లరుచేతిలో పడకుండా చేశారు. ఎందరో నౌకాధిపతులు నౌకలతోపాటుమునిగిపోయారు. ఫ్రెంచి నౌకాదళం జర్మనీకిచిక్కకుండా వున్నందుకు (మిత్రమండలికి రాకపోయినా) సంతోషించదగ్గ విషయమే. టూలాన్ ఆక్రమణకు ఫ్రెంచి ప్రజల విముఖత పొక్కకపోలేదు. కార్మికులు సమ్మెచేశారు నౌకాధిపతులు నిస్పృహతో గత్యంతరంలేక ముంచివేశారు. టూలాన్ ఆక్రమణతో, అక్రమిత ఫ్రాన్సుకున్న తుదిఆయువుకూడా నశించింది. నౌకాబలం పోయింది. ఇది ఒకపాతంనేర్పుతుంది. ఆఫ్రికా రంగంతోపాటు, రెండవ రంగమే ఫ్రాన్సులో తెరచి యున్నట్లయిన, ఫ్రెంచి ప్రజల మాతృదేశభక్తి క్రియారూపేణా చూపే అవకాశం వచ్చేది. టూలాన్ రేవులోని నౌకలు మిత్రమండలి తరపున పోరాడియుండేవి. ఇప్పుడు లోలోన అసమ్మతి తెల్పిన టూలాన్ ప్రజలు బహిరంగంగా జర్మనీని ఎదుర్కొని యుండేవారు.

డార్లన్ ఉదంతం

డాకర్ మిత్రమండలి క్రిందకు వచ్చినా, డార్లనే దానికి అధిపతి మొన్న మొన్నటి వరకు హిట్లరు ప్రభుత్వానికి సలాములుకొట్టి, ఫ్రెంచి విప్లవకారుల నణచి, ఫ్రాన్సులో ఫేసిజానికి దారితీసిన డార్లన్ నేడు మిత్రమండలికి మిత్రుడట! మిత్రమండలి సైన్యాలు దాడి చేసేముందు, ఫ్రెంచి ఆఫ్రికాలో విప్లవాలను అణచడానికి 'జర్మను నాయకులతో' సంప్రదించిన డార్లన్—ఫ్రెంచి నాజీకొత్తు ప్రభుత్వంపై విప్లవానికి సన్నద్ధులవుతున్న సంఘాలను విషేధించిన డార్లన్—ఒక్కసారి ఫేసిస్టు ప్రతికూలుడయ్యాడట! ఇది నమ్మదగినదేనా? ఇది సామ్రాజ్యవాదుల కుట్ర. ఒక ముఠాను తీసి మరోముఠానుపెట్టి ఆడించే సామ్రాజ్యవాదుల పన్నాగం. ఫ్రెంచి మొరాకో స్వాతంత్ర ఉద్యమాన్ని అణచడానికే డార్లన్ ఈ పన్నాగం పన్నాడు. డిగాలీ డార్లన్‌ను గుర్తించనన్నాడు. ప్రపంచమంతటా గందరగోళం బయలుదేరింది. అట్టి సమాధానాలు ఎవరినీ సంతృప్తి పరచలేదు. డార్లన్‌తోటి ఒడంబడిక తాత్కాలికమే అన్న రూజువెల్టు మాటలుగూడ సంతృప్తికరంగా లేవు. ఈడెన్ డార్లనువిషయమై చర్చించడానికి అనుమతి నీయలేదు. ప్రజాందోళన ఫలితంగా, ఈడెన్, "డిగాలీతోటి మన ఒడంబడికలన్నీ అలాగే వుంటాయని" చెప్పినా, వాస్తవిక చర్యలలో అదికన్పించడంలేదు. ఫ్రీఫ్రాన్సుతరపున చేయబడే బ్రాడ్‌కాస్టుఉపన్యాసం అణచి వేయబడింది. డార్లన్‌చే,నిర్బంధింపబడిన ఫాసిస్టు ప్రతికూల ఖైదీలనుఇతర ఖైదీలనువదులుటలేదు రూజువెల్టు ఒకప్రక్క, నాజీవ్యతిరేక ఖైదీలందరినీ విడుదలచేయమని కోరినట్లు తెల్పినా, మరొకప్రక్క ఈడెన్, "స్పానిష్‌యుద్ధంలో పోరాడిన అంతర్జాతీయ బ్రిగేడ్‌యోధులను విముక్తచేసేవిషయం"లో పురప్రచేయి చూపెట్టాము. ఈ నాటి మహాదురవస్థకు కారణభూతమైన ఫాసిస్టు రాక్షసిని ఎన్నడో స్పెయిన్‌లో ఎదుర్కొని ప్రపంచ ప్రశంసలపొందిన వీరయోధులను బందీలుగా వుంచడం; డార్లన్ వంటి పచ్చి ఫాసిస్టు తొత్తులతో ఒడంబడికలు గావించుకొనడం; ఇవీ సామ్రాజ్యవాదులపంథా.

ప్రజాయుద్ధంలో, ప్రజాపక్షంలో ఇలాంటి ద్రోహులకు తావులేదు. డార్లనును తరిమివేసి, ఫ్రెంచి, మొరాకో, ఆల్జీరియాలకు స్వాతంత్ర్యమొసగే హామినిస్తేనే, ఉత్తర ఆఫ్రికాలో మంచి సంయుక్త సంఘటన నేర్పరచగలరు, అట్టి సంయుక్త సంఘటనయే, హిట్లరు ప్రతికూల ఫ్రెంచి సైన్యాన్ని ఉత్తర ఆఫ్రికాలో నిర్మించగలదు. అట్టి సైన్యమే ఫ్రాన్సుకు విముక్తి గల్గించుటలో సహాయపడగలదు.

ఇండియాకే ప్రమాదం

న్యూగినీలో 'బూనా'ను ఇంకా జపాను సహాయక సైన్యాలు, సంపత్తూ వస్తూనేవుంది. బూనావద్ద యుద్ధం ఇంకా కొనసాగుతూనే వుంది. దక్షిణ పసిఫిక్‌లో జరిగే ఈదాగుడుమూతల యుద్ధానికి అర్థం ఏమిటి?

జపాను ఇటీవల నౌకాయుద్ధంలో తీరని దెబ్బలు తిన్నమాట నిజమే. కాని ఈవిషయం ఏమితెలియజేస్తుంది? జపాను ఈప్రాంతంలో తన యావత్తు బలాన్నీ కేంద్రీకరించలేదు. అలా కేంద్రీకరించియుంటే, ఈప్రాంతంలో అత్యధిక నౌకాబలంలేని అమెరికాకు విజయం లభించియుండేదిగాదు. నేడు జపానుఆశయం, ఆస్ట్రేలియా న్యూజిలండులను ఆక్రమించుకొనుటగాక, ఆస్ట్రేలియా, న్యూజిలండులకు అమెరికా సప్లయిమార్గాలను తెగగొట్టడమే. న్యూగినియా ఉత్తరతీరమంతా ఆక్రమించింది. పోర్టుమోర్స్‌బీని ఆక్రమించే ప్రయత్నం ఫలించలేదు. సోలమన్సును ఆక్రమించుకొన్నా బలపరచుకొనకముందే అమెరికన్లు గ్వాడల్‌కెనార్‌లో తమ స్థావరాలను ఏర్పరుచుకొన్నారు. న్యూగినియాలోని దక్షిణభాగం వశంజేసికోప్రయత్నించుతున్నారు.

అందుచేతనే యీ యెడతెగని యుద్ధం. ఇటీవల నౌకా యుద్ధంలో దెబ్బలుతిన్నా, అది నౌకాబలంలో ఆధిక్యతను జపాను పోగొట్టుకొన్నదని అర్థంకాదు. అది మరోచోట కేంద్రీకరించన దన్నమాట. ఆఫ్రికా రంగంకోసంనిమగ్నమయిన అమెరికన్ నౌకలు అప్పుడే పసిఫిక్‌లో నౌకా బలాధిపత్యాన్ని సంపాదించలేవు. అయితే జపాను తన బలాన్ని ఎక్కడ కేంద్రీకరించింది? ఇటీవలనే ఒక చైనా ప్రముఖుడు బర్మాలోను, ఇండోచైనాలోను, సయాంలోను, జపాను అదనపు సైన్యాలు వస్తున్నాయని చెప్పాడు. సాల్వీన్‌నది పశ్చిమతీరాన టాంకులను, సైన్యాలను కేంద్రీకరించుతున్నట్లు కూడా చెప్పాడు. శీతాకాలం రావడం వల్ల సైబేరియాపై యిపుడు దాడికి జపాను సంసిద్ధపడలేదు. అక్ష రాజ్య మిత్రులు యూరప్‌లోను, ఆఫ్రికాలోను దెబ్బతింటున్న యీ సమయంలో, జపాను ఇండియాపై దెబ్బ కొట్టడానికి వాంఛించడం సహజమే. ఈ నాటి చర్చిల్ ఉపన్యాసంలో కూడ యూరప్ యుద్ధానంతరం పసిఫిక్ విషయం చూడవచ్చుననే దోరణి కనపడుతోంది అందుచే ఇండియాకు ప్రమాదం మరింత హెచ్చింది.

కామ్రేడ్
తుమ్మల వెంకటరామయ్య

ఐక్యతకై - సాగిరండు

బెంకుతోనూ, సంకోచంతో ఐక్యతాఉద్యమం పిల్లగాలి లాగు ప్రారంభమైంది. మూడు వారాలలో ఒక ప్రచండ మారుతంగా విజృంభించింది. మూరు మూలలకూ, సందు గొందులకూ, ఇంటింటికి, వ్యక్తివ్యక్తికీ, కులం, మతం వివక్షత లేకుండా, గొప్ప బీద భేదం లేకుండా, ఈప్రవారపు గాలి సోకింది. ఇంత వరకు రాజకీయ చైతన్యంలేని గ్రామాలకు కూడా చొచ్చుకుపోయింది.

"విప్లవకారు మొదలు లాయలిస్టు వరకూ" ఈ ఉద్యమంవల్ల, ఐక్యతా నినాదాలవల్ల ఆకర్షింపబడ్డారు.

930 గ్రామాలు, సుమారు 1000 సంది ప్రచారకులు, 95,000 సంతకాలు, 25,000 ఐక్యతా జెండాలు సుమారు 14,000 రూపాయల ఫండు- ఇదీ, క్లుప్తంగా ఆంధ్రదేశంలో మూడువారాల జాతీయ ఐక్యతా ఉద్యమం.

మూడువారాలకు ముందు-

మెషీన్‌గన్లు, తుపాకీగుండ్లు, లారీలు, ఆర్డినెన్సులు, సాముదాయక జరిమానాలు ఒకప్రక్క; తగులపెట్టడాలు, లూటీలు, మొదలైన అరాచకచర్యలు మరొకప్రక్క; మధ్య బీద రైతు, కూలీ, సాధారణ సంసారి, చిల్లర వర్తకుడు నలిగిపోయారు.

బ్రిటిషువ్యతిరేకభావం జపానుఫాసిస్టు అనుకూలభావంగా మారిపోతోంది. ఫాసిస్టువ్యతిరేక కాంగ్రెసుకూ, ఫాసిస్టు అనుకూల పార్వర్డుబ్లాకుకూ, ప్రజాబాహుళ్యంలో, భేదం కనపడటంలేదు. దేశద్రోహికి దేశభక్తుడికీ వ్యత్యాసం అగపడలేదు.

హిందువులపై, కాంగ్రెసుపై, మహమ్మదీయునికి ఉన్న సంశయం పెరిగిపోయింది.

ఏడురోజులలో వస్తుందన్న స్వరాజ్యం రాలేదు సరిగదా, ఉద్యమం క్షీణించిపోయింది; పోలీసుజులుం తగ్గలేదు సరిగదా, వారిదౌర్జన్యం హెచ్చుపెరిగిపోయింది. అందుచేత ప్రజాసామాన్యంలో భయమూ, నిస్పృహా, నిరుత్సాహము విస్తరించింది.

కమ్యూనిస్టు దేశద్రోహి, ప్రభుత్వానికి తొత్తు, రష్యాకు ఏజంటు, అన్నభావాలు వ్యాప్తిచెందాయి.

ఇవీ జాతీయ ఐక్యతా ఉద్యమానికి ముందున్న పరిస్థితులు.

మూడు వారాల తర్వాత

—అరిపోతున్న ఆశాజ్యోతి తిరిగి ప్రజ్వరించింది. ప్రజాసామాన్యాన్ని ఆవరిస్తున్న అపనమ్మిక, నిస్సహాయత మటుమాయమైపోతోంది. క్షీణించిపోయే ప్రజాప్రతిఘటనశక్తి తిరిగి తలెత్తింది. ఆత్మవిశ్వాసం, ధైర్యం, పౌరుష ప్రజల్లో మరల పైకి వస్తున్నాయి.

మహమ్మదీయులకు కాంగ్రెసుపైన వుండే అపనమ్మకం పోయే పరిస్థితులు క్రమంగా కల్పించబడుతున్నాయి. భాయీ భాయీ అని నేతలు కలిసి దేశరక్షణకు పూనుకుంటేనేగాని ఎవరికీ విముక్తి లేదనే సత్యాన్ని ఇద్దరూ గ్రహిస్తున్నారు.

స్వాతంత్రానికి బానిసత్వానికీఎంతవ్యత్యాసం ఉందో, కాంగ్రెసుకు-బోసుముఠాకు అంతభేదం ఉందని ప్రజలు ఎక్కువగా గ్రహిస్తున్నారు. విధ్వంసకులు, పంచమాంగదళం రోజురోజుకూ ఏకాకిగా చేయబడుతున్నారు.

ఐక్యతేమనకు పరమావధి ఐక్యత తప్పక వస్తుంది, వచ్చి తీరాలి అనే నిజాలు గుర్తించబడుతున్నాయి.

- దేశ ద్రోహులు కాదువీరు దేశ భక్తులు; లంచగొండులు కాదువీరు త్యాగశీలురు; ప్రభుత్వపు జోహుకులు గాదువీరు సామ్రాజ్యపు ప్రబల శతృవులు; అని ప్రజలు కమ్యూనిస్టులను గుర్తిస్తున్నారు. వారిని అర్థం చేసుకుంటున్నారు.

ఇవి మూడు వారాల ఐక్యతా వుద్యమానికి తర్వాత పరిస్థితులు.

అటూ-ఇటూ

పాత అభిమానాలతోను, నమ్మకాలతోను దేశ పరిస్థితులలోని మార్పును గ్రహించక వెనుకటి సాంప్రదాయాలలో చిక్కుకొని, కొంతమంది కాంగ్రెసువాదులు ఐక్యతావసరాన్ని గుర్తించడంలేదు. ఐక్యతా వుద్యమాన్ని అర్థం చేసికోటంలేదు.

నెల్లూరి జిల్లాలో కొందరు కాంగ్రెసువాదులు "ఐక్యతజెండా" లను కొనవద్దని ప్రచారంచేశారు.

ఐక్యతా ఉద్యమం

ఒకరు టిక్కెట్టు కొంటే దానిని ఊడబెరుక్కొని చించివేశారు. విజ్ఞప్తిపై సంతకాలు పెట్టవద్దని, పెడితే ప్రభుత్వం జైలుకు తీసుకెళ్ళుతుందనీ చెప్పారు.

అమాయకపు ప్రజలకు ధైర్యాన్ని కల్గించటానికి బదులు వారికి పిరికిమందు పోశారు. అసలే హడలిపోయిన ప్రజలను మరింత హడలుగొట్టారు.

కాని, అందరు కాంగ్రెసు వాదులూ ఆలోచనా శక్తిని కోల్పోలేదు. ఈ ఉద్యమాన్ని అర్థం చేసికొని, తోడ్పడడానికి సిద్ధమయ్యే కాంగ్రెసు అభిమానుల సంఖ్య రోజురోజుకూ ఎక్కువౌతోంది.

ఇదివరకు కమ్యూనిస్టులను తన్నటానికి సిద్ధమైన మరొక కాంగ్రెసువాది "కమ్యూనిస్టుల పంథా ఒక్కటే సరైనదని గుర్తించి" ఐక్యతా ప్రచారంలో పాల్గొన్నాడు.

"కమ్యూనిస్టులు ద్రోహులు. మేము సంతకాలు చేయం" అని ఇదివరకు అన్న కాంగ్రెసువాదులు తిరిగి సంతకాలు చేశారు ఒక చోట. రామచంద్రపురంలో ఒక కాంగ్రెసు అభిమానంగల లీడరు, కమ్యూనిస్టు పాలసీని పూర్తిగా ఒప్పుకోకపోయినా, సంతకం చేసి, ఉద్యమాన్ని ఆశీర్వదించాడు.

ముస్లింలలో - ఒకదృశ్యం

మహమ్మదీయులు సందిగ్ధంలో పడ్డారు. ఒకవ్యక్తి ఐక్యతావంక లాగుతూంటే, విధేయత ఇంకొకవంక లాగుతుంది. అభిలాష ఒక వంకకు లాగుతూంటే, అనుమానం మరొక వంకకు లాగుతూంది వీరిని.

ఒక విషయం మాత్రం ఈ ఉద్యమంలో స్పష్టమౌతూంది. సాధారణంగా, అధికసంఖ్య మహమ్మదీయులు లీగుయందూ, జిన్నాయందు భక్తి, నమ్మకం కలిగిఉన్నారు. లీగుయొక్క పలుకుబడి ముస్లిం ప్రజాసామాన్యంలో ప్రబలంగా ఉంది. చిట్రగుంటలో మన కామ్రేడ్సు ముస్లిం నివాస స్థలాలలో సభలు జరిపారు, తరవాత జిన్నా విజ్ఞప్తిపై సంతకాలు చేయమన్నారు. గుడివాడలో, కొంతమంది ముస్లింలు, కమ్యూనిస్టు పంథాను అంగీకరించినా, లీగు అనుమతిలేందే సంతకాలు పెట్టమన్నారు. తూర్పు గోదావరిలో కొంతమంది ముస్లింలు, దివితాలూకాలో కొంతమంది, లీగు చెప్పందే చేయమన్నారు.

మరొక దృశ్యం

బందరులో 31 మంది ముస్లింలు మన స్ఫూర్తిగా సంతకాలువేశారు. గన్నవరం తాలూకాలో 57 మంది, తిరువూరులో 29 మంది, నందిగామలో 172 మంది, బెజవాడలో 243 మంది, తూర్పుగోదావరిలో 11 గ్రామాలలో 480 మంది సంతకాలు చేశారు. ప్రజాశక్తి, పీపుల్సువార్, ఉర్దూ పత్రికలకు, కొంతమంది, చందాదారులుగా చేరారు. ఐక్యతాజెండాలు కొన్నారు. కమ్యూనిస్టు పంథాను అంగీకరిస్తున్నారు.

అవనిగడ్డలో కమ్యూనిస్టులు మహమ్మదీయులవద్దకు వెళ్ళారు. అచ్చటి ముస్లిం లీగు ఏజంటు ఐక్యతాప్రచారానికి విముఖుడుగాఉన్నా బీదరికపు ముస్లింలు సంతకాలు వేశారు. "ఇది పేదల పార్టీ, మేముపేదవాళ్ళం. మేము సంతకాలు వేశాము" అని అన్నారు.

వాళ్ళ సంశయాలు

"కాంగ్రెసు మా స్వయం నిర్ణయం హక్కును గుర్తించడంలేదు." "కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేసిన తర్వాత వారు మావిడిపోయేహక్కును గుర్తించరు. కాబట్టి మేము సంతకాలుచేసినా లాభం లేదు" ఇవి సాధారణంగా మధ్యతరగతి మహమ్మదీయుల అనుమానాలు, ప్రశ్నలు.

కమ్యూనిస్టు వర్కర్లు ఈ ప్రశ్నలకు తగిన సమాధానం చెప్పారు. "లీగు, కాంగ్రెసూ - రెండూ, ఈ సమస్య పట్ల అభివృద్ధి కరమైన మార్పుచూపారు. ఇద్దరిమధ్యవిభేదం సన్నగిలుతోంది. ముస్లిం జాతులకు విడిపోయే హక్కు ఉన్నది. ప్రజాసామాన్యమంతా ఏకమైపోషిస్తే కాంగ్రెసు నాయకులు వ్యతిరేకించలేరు. ఏ శక్తితో నైతే, జాతీయ ప్రభుత్వాన్ని సాధిస్తామో, ఫాసిస్టులను హత మారుస్తామో ఆ శక్తితోనే వివిధ జాతుల స్వయం నిర్ణయ హక్కును కాంగ్రెసు గుర్తించేటట్లు చేయగలుగుతాము.

ఒక్క ముఖ్య విషయం. మీరు ఇప్పుడు మాతో చేయి కలపక, తాటస్థ్యంగా ఉంటే మీకు విడిపోయే హక్కు వస్తుందను కుంటున్నారేమో. అది ఎన్నడూ జరగదు. బ్రిటిషు సామ్రాజ్యం మీకు ఆ హక్కును ఇవ్వడమనేది కల్ల. అది స్వతంత్రభారత దేశంలోనే జరుగుతుంది. కాని, అస్వాతంత్రం కాంగ్రెసు నాయకులు జైలులో ఉన్నంత వరకు రాదు. అందువలన ఈ ఐక్యతా ఉద్యమంలో పాల్గొని జిన్నాపై వత్తిడి తెచ్చి, నాయకుల విడుదలకు ముందంజ వేసేటట్లు చేయాలి. ముస్లిం ప్రజాసామాన్యాన్ని, హిందు ప్రజా సామాన్యాన్ని ఐక్యం చేసేటట్లు కృషి చేయాలి"

శ్రమజీవి

పాటకపువర్గాలు ఈవుద్యమంలో చైతన్యం పొందినట్లు మరే తరగతులూ చైతన్యం పొందలేదు. సంతకాలు చేసిన వారిలో కూలీలు, వ్యవసాయకూలీలు అధికులు. పార్టీఫండుకు కూడా ఇచ్చినవారి సంఖ్యలో ఎక్కువమంది ఈ బీదజనమే. అవనిగడ్డలో 59 కూలీలు 4-1-3 ఇచ్చారు. ఇంకొక కూలీ సంఘం 2-8-0 ఇచ్చింది. మరొక చోట 95 రెండు అణాల టిక్కెట్లు అమ్మారు. ఇవి చిన్న మొత్తాలే. కాని, దరిద్రంలో మునిగి తేల్తూ, ఈయుద్ధపు దినాలలో ఒకపూటకూడా సరిగ తిండిలేక, నిరంతరం ఆకలి దేవతకు ఆహుతి అయిన ఈ శ్రమజీవి ఇచ్చిన ప్రతి దమ్మిడీ విలువ తూచడానికి వీలులేనిది. చెమటోడ్చి, తన రక్తమాంసాలతో సంపాదించి ఇచ్చిన ఒక్క రాగి డబ్బైనా, ఐక్యతాఉద్యమం అంగీకార చిహ్నముగా దాని ప్రాముఖ్యత అమోఘం.

"మాకు స్వాతంత్ర్యం వద్దా?"

తమ పార్టీకి చందాలు ఇవ్వటంలో కూలీలు ఎంత ఉత్సాహం, ఆతృత చూపించారో, సంతకాలు చేయడానికి అంత చూపించారు.

గుడివాడ మునిసిపల్‌వర్కర్లు, వ్యవసాయ కూలీలు, చిత్తూరుజిల్లాలో చేతిపనివారు, కార్మికులు, రైతులు, నాగవరప్పాడులో వ్యవసాయ కూలీలు సంతకాలు చేశారు.

గన్నవరంలో కూలీలు సంతకాలుచేస్తుంటే, మిషనరీకిచెందిన ఒకమిస్ట్రెసువచ్చి "కాంగ్రెసు మనకు శతృవు. సంతకాలు పెట్టవద్దు" అని కూలీలను ప్రబోధించింది. మన కామ్రేడ్సు నెమ్మదిగా కూలీలకు పరిస్థితులు వివరించారు. ఐక్యత ఎందుకు, ఉద్యమం ఆశయాలేమిటి; నాయకులుఎందుకు విడుదలవ్వాలి, మొదలైనవి విషయంవెంబడివిషయంవచ్చచెప్పారు. దాంతో, అంతవరకు తటపటాయించుతున్న వారితో సహా అందరు "మాకు మాత్రం స్వాతంత్రం వద్దా!" అని సంతకాలు చేశారు.

కమ్యూనిస్టులు దొంగలు అని అపోహపడ్డ ఒక వ్యక్తి, గుడివాడలో, మన కామ్రేడ్సుకు తారసిల్లాడు. వాదోపవాదాలు జరిగాయి. చివరికి ఆ వ్యక్తి పార్టీపాలసీ అంగీకరించాడు. విజ్ఞప్తిమీద సంతకం చేశాడు. "ప్రజాశక్తి" ప్రతివారం చదువుతానని వాగ్దానంచేశాడు.

బెజవాడలోలో ఒక రాయిస్టు తలపడ్డాడు. చర్చలు జరిగిన మీదట పార్టీకి ఒక రూపాయి విరాళమిచ్చాడు. పీపుల్సువార్ పత్రిక కొన్నాడు. రాజకీయంగా పూర్తిగా ఒప్పుకొనక పోయినా, కమ్యూనిస్టులు నిర్విరామంగా పని చేస్తారని అభినందించాడు.

గన్నవరంలో మన పార్టీ పత్రికను చదివిన 4 గురు ఆఫీసర్లు సంతకాలు పెట్టారు. అందులో ఒక ఉద్యోగి మన పార్టీ పాలసీయే సరియైనదని ప్రశంసించి కొంత విరాళమిచ్చాడు. ప్రజాశక్తికి చందా దారుడుగా చేరాడు. ముగ్గురు గ్రామోద్యోగులు మన పంథాను అంగీకరిస్తూ విరాళమిచ్చారు.

కామ్రేడ్
జి. రాధాకృష్ణమూర్తి

ప్రపంచ యుద్ధసమీక్ష

సోవియట్ అడకత్తెరలో మూడులక్షల శత్రు సైన్యం

రష్యనుల శీతాకాలపు దాడి ప్రారంభ మయింది - అది రాజ్యాలను గణుసుస్తుంది. నవంబరు 20 వ తేదీన ప్రారంభమైన యీ యెదురు దాడి యిప్పటికిప్పుడే మంచి విజయా లను సాధించగల్గింది. గత సంవత్సరం డిసెం బరు 6 వ తేదీ రష్యా - జర్మనీ యుద్ధ చరి త్రలో చెట్టి మహత్తరదినమో, యీనాడు కూడ అట్టి చారిత్రాత్మక దినమని చెప్పాలి.

స్టాలిన్‌గ్రాడ్

స్టాలిన్‌గ్రాడుకు వాయువ్యం నుండి, దక్షి ణంనుండి ప్రారంభమయిన యీ దాడుల ఫలి తంగా, కలాచ్' సోవియటు సైన్యాల చేజి క్కింది. 'క్లెట్స్కాయా' పట్టుబడింది. సోవి యటు సహాయక సైన్యాలు స్టాలిన్‌గ్రాడ్ యోధులను చేరాయి. ఫ్యాక్టరీ ప్రదేశమంతా సోవియటు చేతులలో బడింది. స్టాలిన్‌గ్రాడ్ ముట్టడి భిన్నమయింది. వాయువ్యంలో 'సెరాఫిమోవిచ్' నుండి, దక్షిణాన 'కాల్మక్' పచ్చిక బయళ్ళనుండి బయలుదేరిన యెదురు దాడుల ఫలితంగా 3 లక్షల జర్మను సైన్యాలు చుట్టు ముట్టడికి గురి అయి హరించి అయ్యే అవకాశం గలిగింది. 'ఎలాటేస్కి' దక్షిణంగా డాన్ నదివద్ద రష్యన్లు అడకత్తెర కలిసింది. ఇప్పటిప్పుడే పదదినాలలో లక్షమందిజర్మన్లు ఖైదీలయ్యారు. పందలకొలది గ్రామాలు, పట్టణాలు తిరిగి సోవియటు చేతులలో పడు తున్నాయి, స్టాలిన్‌గ్రాడ్ ప్రదేశంలోనేకాక, "నాల్చిక్"కు ఆగ్నేయంగాను, "ట్వాప్సి"కి ఈశాన్యంగాను కూడ సోవియటు దాడులు ప్రారంభమయాయి,

మధ్యరంగం

ఈ మధ్యరంగంలో "వెలికిలుకి"-"ర్జెవ్" ప్రదేశంలో సోవియటు దాడి ప్రారంభమయి నది. "నొవాసొకొలినికి" అనే పట్టణ ప్రాంగ ణానికి సో వి య టు సై న్యా లు చే రా యి. "నెవెల్"ను కూడా అపాయ స్థితికి గురి చేస్తు న్నాయి. ఈ రెండూ, 'లెనిన్‌గ్రాడ్'నుండి, 'విటబెస్క్'గుండా కీవునుపాయే రైలు మార్గాన ఉన్నాయి 'నొవాసొకొలినికి' లాట్వియా సరిహద్దులలో 60 మైళ్ళలోవుంది.

ఈ సోవియటు ఎదురుదాడుల ప్రాముఖ్యత ఏమిటి? గత శీతాకాలంలో వలెనే హిట్లరుకు దుర్గతిపడుతుంది. గతశీతాకాలంలో, హిట్లరుకు మాస్కో లభించలేదు సరికదా ఎదురుదాడులు సాగి, పట్టణం వలయంనుండి తప్పించబడింది. ఈ సారి స్టాలిన్‌గ్రాడ్ చిక్కలేదు. జర్మను సైన్యాలకు శీతాకాల స్థావరాలు లభించలేదు. విశ్వప్రయత్నంచేసి, స్టాలిన్‌గ్రాడ్ ఉత్తర ప్రాంతాన్ని వశంచేసుకొనదలచిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈసారి హఠాత్తుగా, గత సంవత్సరం కంటేముందుగా దాడి ప్రారంభ మయింది. జర్మన్లకు ఆశ్చర్యం కల్గించేటట్లు హఠాత్తుగా శీతాకాలపుదాడి ప్రారంభమయింది. ప్రవదా ఇలా వ్రాసింది "మాదాడి జర్మన్లకు పూర్తిగా ఆశ్చర్యం కలుగునట్లు ఆకస్మికంగా ప్రారంభమయిన దనుటలో సందేహంలేదు. ఆకస్మికంగా సర్వనాశనం గావించేటట్టి దెబ్బను కొట్టాం."

గందరగోళంలో, జర్మనులు విపరీతనష్టా లకు గురి అవుతున్నారు. జర్మనుల మనో దండి భగ్నమవుతోంది. ప్రతిచెంచిపైనా తెల్ల జండా (లొంగిపోయేటప్పుడు చూపేది) ఎగురుతోంది.

స్టాలిన్‌గ్రాడ్ సంరక్షణమే, ఈ శీతాకాలపు ఎదురుదాడికి ప్రారంభం అయింది. ఇదివరకు అనేకసార్లు, స్టాలిన్‌గ్రాడ్ సంరక్షణ, యుద్ధ చరిత్రలో ఎలా కేంద్రస్థానమో చెప్పాము. అది ఈనాడు చూస్తున్నాం.

సుప్రసిద్ధ రష్యన్ రచయిత 'ఇల్యా ఎహ్రెన్‌బర్గ్' ఇలా వ్రాస్తాడు. "స్టాలిన్‌గ్రాడ్ సంరక్ష కులు అంత పటిమ చూపించటం వల్లనే, అనవసర త్యాగములేకుండా మనమిప్పుడు తెలివిగా వ్యాపించాం, స్టాలిన్‌గ్రాడ్‌రక్షణ, పెద్ద స్ట్రాటజికల్ (వ్యూహాత్మకమైన) ఉపాయం స్టాలిన్‌ గ్రాడ్ రక్షకులప్రదర్శనాశక్తికి దానికి చాలాదీసింది. చెట్ ట్జోకుడు ఫ్యాక్టరీ, జర్మనులను చుట్టుముట్టి కొన్ని అనుకుల ప్రదేశమే, ప్రపంచచారిత్ర ప్రాముఖ్యత వహించింది."

స్టాలిన్‌గ్రాడ్, మాస్కో రంగాల దాడి ఆశయమేమిటి? ఇజ్వెస్తియా వ్రాతలనే తీసు కొందాం. "అనేక విధముల పరిస్థితులు ఉచ్చ శత్రువును నాశనం చేయగలశక్తిగలది రెడ్ ఆర్మీ అని, అది చాటింది. జర్మనుల ఓటమిని స్టాలిన్‌గ్రాడ్‌వద్ద హిట్లరు దుండగీయుల సర్వ నాశనంగా మార్చగలము. స్టాలిన్‌గ్రాడ్‌వద్ద, వొరొనెజ్‌వద్ద, ట్వాప్సేవద్ద, ముర్మాన్స్క్‌వద్ద, లెనిన్‌గ్రాడ్‌వద్ద, జర్మనులు మృత్యువును ఏమను ఎలా అవలించుతుందో తెలిసికొంటారు. వాల్గా, డాన్‌నదులు ఇచ్చిన జవాబే ఈప్రదేశాలలో కూడ జర్మనులకు యిస్తున్నారు."

ఇలా వ్రాసి దావాపు వారంరోజులయింది. అప్పుడే వెలికిలుకివద్ద దాడి ప్రారంభమయింది. కలుగా, వొరొనెజ్‌లవద్ద రష్యనులు దాడు లకు సంసిద్ధమౌతున్నట్లు వార్తలు. స్టాలిన్ గ్రాడ్‌దాడి నాధారం చేసికొని, వొరొనెజ్‌ను ప్రాతిపదికగా తీసుకొని, రోస్టావ్, వొరోషి లావ్‌గ్రాడ్‌లను తిరిగి వశంచేసికోడానికి రష్య నులు ప్రయత్నించుతారు. వెలికిలుకివద్ద ప్రారం భమయిన దాడికి అర్థం: లెనిన్‌గ్రాడ్ ముట్ట డిని సడలించడం, బాల్టిక్‌తీరంలోని రేవులను ముఖ్యంగా "రేగా"ను తిరిగి పట్టుకొనడం.

గతసంవత్సరం కంటేకూడ జర్మనీకి ఈ శీతాకాలంలో పరిస్థితులు మరింత ప్రతికూలంగా వున్నాయి. ఇప్పటికే ఆతుకులబొంతగావున్న జర్మనీ సైన్యం బరువు మోయలేని స్థితికి వచ్చింది. జర్మను వెనుభాగం (రియర్)లో అగ్నిపర్వతంబ్రద్దలయేస్థితికి వచ్చింది. ఆఫ్రికా యుద్ధఫలితంగా, ఆక్రికారంగాన్ని ఫ్రాన్సు ఇటలీలపై దండెత్తడానికి, పశ్చిమంలో రెండవ రంగం తెరవడానికి గావలసిన పరిస్థితులు సృజించబడ్డాయి. ఇట్టి అనుకూలపరిస్థితుల మధ్య సోవియట్ సైన్యాలు, సోవియట్ సుక్షేత్రంలోనే ఫాసిస్టు నరహంతకులను సమూ లంగా నాశనంచేసే అవకాశాలు కల్పించు తున్నాయి.

ఆఫ్రికా

సోవియటు ఎదురుదాడులు సకాలంలో సాగగందవలన, ఆఫ్రికాలో మిత్రరాజ్యాలపని కొంత సులభ మయింది. ట్యునీషియాను ఆయువుపట్టులయిన బిజెర్టా, ట్యూనిస్‌లకోసం మిత్రమండలి సైన్యాలు ముందుకు సాగుతు న్నాయి. ట్యూనిస్ పిరం గిగుండ్లకు ఎర అయే అంత దూరం లోపలే వున్నది. ఆఫ్రికా [illegible]

యుద్ధం కొంత మందగించింది రోమెల్ ఎల్‌అఘేలావద్ద నిలబడివున్నాడు. ఈ యుద్ధ రంగంలో ఈవారం రెండు ముఖ్యఘటనలు జరిగాయి. ఒకటి ఫ్రెంచి మిత్రమండలి చేతు లలోకి (డార్లన్ ఆధిపత్యంక్రింద) రావడం, టూలాన్ (మధ్యధరాసముద్రంలో ఫ్రెంచివేవు పట్టణం)ను జర్మని ఆక్రమించుకోవడం నాజీ మిత్రమ చలికి రావడం ఫలితంగా, అట్లాంటిక్ సముద్రంలో కొంత ఉద్రిక్తత తగ్గింది. టూలాన్ ఆక్రమించిన సమయం, అందలి నౌకలను ముంచివేసి హిట్లరుచేతికి పడకుండా చేశారు. ఎందరో నౌకాధిపతులు నౌకలతోనాటుమునిగి పోయారు. ఫ్రెంచి నౌకాదళం జర్మనీకిదక్క కూడా వున్నందుకు (మిత్రమండలికి రాకపో యినా) సంతోషించవలసిన విషయమే టూలాన్ ఆక్రమణను ఫ్రెంచి ప్రజల ఎదుర్కోవడం నాజీయాకోక పోలేదు. కాకుండా నిమ్మచేతులు నౌకాధి పతులు నిస్సహాయతో గత్యంతరంలేక ముంచి వేశారు. టూలాన్ ఆక్రమణతో, అపరిమిత ఫ్రాన్సుకున్న బడిఆయుధంగానూ నశించింది. నౌకాబలం పోయింది. ఇది ఒకసారంచెప్పు తుంది. ఆఫ్రికా రంగంతోపాటు, రెండవ రంగమే ఫ్రాన్సులో తెరచి యున్నట్లయిన, ఫ్రెంచి ప్రజల మాతృదేశభక్తి క్రియారూపేణా చూపే అవకాశం వచ్చేది. టూలాన్ రేవులోని నౌకలు మిత్రమండలి తరఫున పోరాడి యుండేవి. ఇప్పుడు లోలోన అసమ్మతి తెల్పిన టూలాన్ ప్రజలు బహిరంగంగా జర్మనీని ఎదుర్కొని యుండేవారు.

డార్లన్ ఉదంతం

డాకర్ మిత్రమండలి క్రిందకు వచ్చినా, డార్లనే దానికి అధిపతి మొన్న మొన్నటి వరకు హిట్లరు ప్రభుత్వానికి సలాములుకొట్టి, ఫ్రెంచి విప్లవకారుల నణచి, ఫ్రాన్సులో ఫేసి జానికి దారితీసిన డార్లన్ నేడు మిత్రమండ లికి మిత్రుడట! మిత్రమండలి సైన్యాలు దాడి చేసేముందు, ఫ్రెంచి ఆఫ్రికాలో విప్లవాలను అణచడానికి 'జర్మను నాయకులతో' సంప్ర దించిన డార్లన్—ఫ్రెంచి నాజీతొత్తు ప్రభు త్వంపై విప్లవానికి సన్నద్ధులవుతున్న సంఘా లను నిషేధించిన డార్లన్—ఒక్కసారి ఫేసిస్టు ప్రతికూలుడయ్యాడట! ఇది నమ్మదగిన దేనా? ఇది సామ్రాజ్యవాదుల కుట్ర. ఒక ముఠాను తీసి మరోముఠానుపెట్టి ఆడించే సామ్రాజ్యవాదుల పన్నాగం ఫ్రెంచి మొరాకో స్వాతంత్ర ఉద్యమాన్ని అణచడానికే డార్లన్ ఈ పన్నాగం పన్నాడు. డిగాలీ డార్లన్‌ను గుర్తించనన్నాడు. ప్రపంచమంతటా గందర గోళం బయలుదేరింది. అట్టి సమాధానాలు ఎవరినీ సంతృప్తి పరచలేదు. డార్లన్‌తోటి ఒడంబడిక తాత్కాలికమే అన్న రూజువెల్టు మాటలుగూడ సంతృప్తికరంగా లేవు. ఈడెన్ డార్లనువిషయమై చర్చించడానికి అనుమతి నీయలేదు. ప్రజాందోళన ఫలితంగా, ఈడెన్, "డిగాలీతోటి మన ఒడంబడికలన్నీ అలాగే వుంటాయని" చెప్పినా, వాస్తవిక చర్యలలో అదికన్పించడంలేదు. ఫ్రీఫ్రాన్సుతరఫున చేయ బడే బ్రాడ్‌కాస్ట్ ఉపన్యాసం అణచి వేయబ డింది. డార్లన్‌చే నిర్బంధింపబడిన ఫాసిస్టు

ప్రతికూలప్రచారకులు [illegible] నీలనువదులు ఒలేదు మొరాక్కో ఆల్జీరియా, నావికులలోను ఖైదీ లందరినీ విడుదలచేయమని కోరినట్లు తెల్పినా, ముస్సోలినీ [illegible], "స్పెయిన్‌యుద్ధంలో పోరాడిన అంతర్జాతీయ బ్రిగేడ్‌యోధులను విడుదలచేసేవిషయంలో" పుర్రచేయి చూపె ట్టాడు ఈనాటి మహాయుద్ధంలో స్పెయిన్‌కు కారణ భూతమైన ఫాసిస్టు రాజ్యాని ఎన్నదో స్పెయిన్ లో ఎదుర్కొని ప్రపంచ ప్రశంసలనుపొందిన వీరయోధులను బంధించడం ఏమిటి? డార్లన్ వంటి పచ్చి ఫాసిస్టు శక్తులలో ఒడంబడికలు గావించుకొనడం; ఇదే సామ్రాజ్యవాదులపంథా.

ప్రజాయుద్ధంలో, ప్రజా శక్తిలో ఇలాంటి ద్రోహాలకు తావులేదు. డార్లనును తరిమివేసి, ఫ్రెంచి, మొరాకో, అల్జీరియాలు స్వాతంత్ర్య మొసగే హామీనిస్తేనే, ఉత్తర ఆఫ్రికాలో మంచి సంయుక్త సంఘటన నేర్పరచగలరు. అట్టి సంయుక్త సంఘటనయే, హిట్లరు ప్రతి కూల ఫ్రెంచి సైన్యాన్ని ఉత్తర ఆఫ్రికాలో నిర్మించగలదు. అట్టి సైన్యమే ఫ్రాన్సుకు విముక్తి గల్గించడంలో సహాయపడగలదు.

ఇండియాకే ప్రమాదం

న్యూగినీలో బూనాకు ఇంకా జపాను సహాయక సైన్యాలు, సంపన్నూ వస్తూనేవుంది. బూనావద్ద యుద్ధం ఇంకా కొనసాగుతూనే వుంది. దక్షిణ పసిఫిక్‌లో జరిగే ఈదాగుడు మూతల యుద్ధానికి అర్థం ఏమిటి?

జపాను ఇటీవల నౌకాయుద్ధంలో తీరని దెబ్బలు తిన్నమాట నిజమే. కాని ఈవిషయం ఏమితెలిపుతోంది: జపాను ఈప్రాంతంలో తన యావత్తు బలాన్ని కేంద్రీకరించలేదు. అలా కేంద్రీకరించియుంటే, ఈప్రాంతంలో అత్యధిక నౌకాబలంలేని అమెరికాకు విజయం లభించియుండేదిగాదు. నేడు జపానుఆశయం, ఆస్ట్రేలియా న్యూజీలండులను ఆక్రమించు కొనుటగాక, ఆస్ట్రేలియా, న్యూజిలండులకు అమెరికా సప్లయిమార్గాలను తెగగొట్టడమే. న్యూగినియా ఉత్తరతీరమంతా ఆక్రమించింది. పోర్టుమోర్స్‌బీని ఆక్రమించే ప్రయత్నం ఫలించలేదు సోలమన్సును ఆక్రమించుకొన్నా బలపరచుకొనకముందే అమెరికన్లు గ్వాడల్ కెనాల్‌లో తమ స్థావరాలను ఏర్పరుచు కొన్నారు. న్యూగినియాలోని దక్షిణభాగం వశం జేసికోప్రయత్నించుతున్నారు.

అందుచేతనే యీ యెడతెగని యుద్ధం. ఇటీవల నౌకా యుద్ధంలో దెబ్బలుతిన్నా, అది నౌకాబలంలో ఆధిక్యతను జపాను పోగొట్టు కొన్నదని అర్థంకాదు. అది మరోచోట కేంద్రీ కరించిన దన్నమాట. ఆఫ్రికా రంగంకోసంనిమ గ్నమయిన అమెరికన్ నౌకలు అప్పుడే పసి ఫిక్‌లో నౌకా బలాధిపత్యాన్ని సంపాదించ లేవు. అయితే జపాను తన బలాన్ని ఎక్కడ కేంద్రీకరించింది? ఇటీవలనే ఒక చైనా ప్రముఖుడు బర్మాలోను, ఇండోచైనాలోను, సయాంలోను, జపాను అదనపు సైన్యాలు వస్తున్నాయని చెప్పాడు. సాల్వీన్‌నది పశ్చిమ తీరాన టాంకులను, సైన్యాలను కేంద్రీకరించు తున్నట్లు కూడా చెప్పాడు. శీతాకాలం రావడం వల్ల సైబేరియాపై యిపుడు దాడికి జపాను సంసిద్ధపడలేదు. అక్ష రాజ్య మిత్రులు యూరప్‌లోను, ఆఫ్రికాలోను దెబ్బతింటున్న యీ సమయంలో, జపాను ఇండియాపై దెబ్బ కొట్టడానికి వాంఛించడం సహజమే. ఈ నాటి చర్చిల్ ఉపన్యాసంలో కూడ యూరప్ యుద్ధానంతరం పసిఫిక్ విషయం చూడవచ్చు ననే ధోరణి కనపడుతోంది అందుచేత ఇండి, యాకు ప్రమాదం మరింత హెచ్చింది.

కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

ఐక్యతకై - ★ ★ సాగిరండు

బెంకుతోనూ, సంకోచంతో ఐక్యతాఉద్య మం పిల్లగాలి లాగు ప్రారంభమైంది. మూడు వారాలలో ఒక ప్రచండ మారుతంగా విజృ భించింది. మూరు మూలలకూ, సందు గొందు లకూ, ఇంటింటికి, వ్యక్తివ్యక్తికీ, కులం, మతం వివక్షత లేకుండా, గొప్ప బీద భేదం లేకుండా, ఈప్రచారపు గాలి సోకింది. ఇంత వరకు రాజకీయ చైతన్యంలేని గ్రామాలకు కూడా చొచ్చుకుపోయింది.

"విప్లవకారు మొదలు లాయలిస్టు వరకూ" ఈ ఉద్యమంవల్ల, ఐక్యతా వినాదాలవల్ల ఆకర్షింపబడ్డారు.

930 గ్రామాలు, సుమారు 1000 నంది ప్రచారకులు, 95,000 సంతకాలు, 25,000 ఐక్యతా జెండాలు, సుమారు 14,000 రూపా యల ఫండు- ఇదీ, క్లుప్తంగా ఆంధ్రదేశంలో మూడువారాల జాతీయ ఐక్యతా ఉద్యమం.

మూడువారాలకు ముందు-

మెషీన్‌గన్లు, తుపాకిగుండ్లు, లారీలు, అర్ది నెన్సులు, సాముదాయక జరిమానాలు ఒక ప్రక్క; తగులపెట్టడాలు, లూటీలు, మొదలైన అరాచకచర్యలు మరొకప్రక్క; మధ్య బీద రైతు, కూలీ, సాధారణ సంసారి, చిల్లర వర్తకుడు నలిగిపోయారు.

బ్రిటిషువ్యతిరేకభావం జపానుఫాసిస్టు అను కూలభావంగా మారిపోతోంది. ఫాసిస్టువ్యతిరేక కాంగ్రెసుకూ, ఫాసిస్టు అనుకూల ఫార్వర్డు బ్లాకుకూ, ప్రజాబాహుళ్యంలో, భేదం కనప డటంలేదు. దేశద్రోహికీ దేశభక్తుడికీ వ్యత్యాసం అగపడలేదు.

హిందువులపై, కాంగ్రెసుపై, మహమ్మదీ యునికి ఉన్న సంశయం పెరిగిపోయింది.

ఏడురోజులలో వస్తుందన్న స్వరాజ్యం రాలేదు సరిగదా, ఉద్యమం క్షీణించిపోయింది; పోలీసుజులుం తగ్గలేదు సరిగదా, వారిదౌర్జన్యం పెచ్చుపెరిగిపోయింది: అందుచేత ప్రజా సామాన్యంలో భయమూ, నిస్పృహ, నిరు త్సాహము విస్తరించింది.

కమ్యూనిస్టు దేశద్రోహి, ప్రభుత్వానికి జోహుకుం, రష్యాకు ఏజంటు, అన్నభావాలు వ్యాప్తి చెందాయి.

ఇవీ జాతీయ ఐక్యతా ఉద్యమానికి ముం దున్న పరిస్థితులు.

మూడు వారాల తర్వాత

– ఆరిపోతున్న ఆశాజ్యోతి తిరిగి ప్రజ్వ లించింది. ప్రజాసామాన్యాన్ని ఆవరిస్తున్న అవిజయభీతి, విస్పహాయత మటుమాయమై పోతోంది. క్షీణించిపోయే ప్రజాప్రతిఘటనా శక్తి తిరిగి తలెత్తింది. ఆత్మవిశ్వాసం, ధైర్యం, చొరవ ప్రజల్లో మరల పైకి వస్తున్నాయి.

మహమ్మదీయులకు కాంగ్రెసుపైన ఉండే అపనమ్మకం పోయే పరిస్థితులు క్రమంగా కల్పించబడుతున్నాయి. భాయీ, భాయీ అని చేతులుకలిపి దేశరక్షణకు పూనుకుంటేనేగాని ఎవరికీ విముక్తి లేదనే సత్యాన్ని ఇద్దరూ గ్రహిస్తున్నారు.

స్వాతంత్ర్యానికి బానిసత్వానికీఎంతవ్యత్యాసం ఉందో, కాంగ్రెసుకు-బోసుముఠాకు అంతభేదం ఉందని ప్రజలు ఎక్కువగా గ్రహిస్తున్నారు. విధ్వంసకులు, పంచమాంగదళం రోజురోజుకూ ఏకాకిగా చేయబడుతున్నారు.

ఐక్యతేమనకు పరమావధి ఐక్యత తప్పక వస్తుంది, వచ్చి తీరాలి అనే నిజాలు గుర్తించ బడుతున్నాయి.

- దేశ ద్రోహులు కాదువీరు దేశ భక్తులు; లంచగొండులు కాదువీరు త్యాగశీలురు; ప్రభు త్వపు జోహుకులు గాదువీరు సామ్రాజ్యపు ప్రబల శత్రువులు; అని ప్రజలు కమ్యూనిస్టు లను గుర్తిస్తున్నారు. వారిని అర్థం చేసుకుం టున్నారు.

ఇవి మూడు వారాల ఐక్యతా వుద్యమానికి తర్వాత పరిస్థితులు.

అటూ-ఇటూ

పాత అభిమానాలతోను, నమ్మకాలతోను దేశ పరిస్థితులలోని మార్పును గ్రహించక వెనుకటి సాంప్రదాయాలలో చిక్కుకొని, కొంతమంది కాంగ్రెసువాదులు ఐక్యతావస రాన్ని గుర్తించడంలేదు. ఐక్యతా వుద్యమాన్ని అర్థం చేసికోటంలేదు.

నెల్లూరి జిల్లాలో కొందరు కాంగ్రెసువాదులు "ఐక్యతజెండా"లను కొనవద్దని ప్రచారంచేశారు. ఒకరు టిక్కెట్టు కొంటే దానిని ఊడబెరుక్కొని చించివేశారు. విజ్ఞప్తిపై సంతకాలు పెట్టవద్దని, పెడితే ప్రభు త్వం జైలుకు తీసుకెళ్తుతుందనీ చెప్పారు.

ఐక్యతా ఉద్యమం

అమాయకపు ప్రజలకు ధైర్యాన్ని కల్గించ టానికి బదులు వారికి విరికిమందు పోశారు. అసలే హడలిపోయిన ప్రజలను మరింత హడలుగొట్టారు.

కాని, అందరు కాంగ్రెసు వాదులూ ఆలో చనా శక్తిని కోల్పోలేదు. ఈ ఉద్యమాన్ని అర్థం చేసికొని, తోడ్పడడానికి సిద్ధమయ్యే కాంగ్రెసు అభిమానుల సంఖ్య రోజురోజుకూ ఎక్కువౌతోంది.

ఇదివరకు కమ్యూనిస్టులను తన్నటానికి సిద్ధమైన మరొక కాంగ్రెసువాది "కమ్యూనిస్టు ల పంథా ఒక్కటే సరైనదని గుర్తించి" ఐక్యతా ప్రచారంలో పాల్గొన్నాడు.

"కమ్యూనిస్టులు ద్రోహులు. మేము సంత కాలు చేయం" అని ఇదివరకు అన్న కాం గ్రెసువాదులు తిరిగి సంతకాలు చేశారు ఒక చోట. రామచంద్రపురంలో ఒక కాంగ్రెసు అభిమానంగల లీడరు, కమ్యూనిస్టు పాలసీని పూర్తిగా ఒప్పుకోకపోయినా, సంతకం చేసి, ఉద్యమాన్ని ఆశీర్వదించాడు.

ముస్లింలలో - ఒకదృశ్యం

మహమ్మదీయులు సందిగ్ధంలో పడ్డారు. ఉద్దేశ్యాలు ఒకవంక లాగుతూంటే, విధేయత ఇంకొకవంక లాగుతూంది. అభిలాష ఒక వంకకు లాగుతూంటె, అనుమానం మరొక వంకకు లాగుతూంది వీరిని

ఒక విషయం మాత్రం ఈ ఉద్యమంలో స్పష్టమౌతూంది. సాధారణంగా, అధికసంఖ్య మహమ్మదీయులు లీగుయందూ, జిన్నాయందు భక్తి, నమ్మకం కలిగిఉన్నారు. లీగుయొక్క పలుకుబడి ముస్లిం ప్రజాసామాన్యంలో ప్రబ లంగా ఉంది. విజ్రగుంటలో మన కామ్రేడ్స్ ముస్లిం నివాస స్థలాలలో సభలు జరిపారు. తరవాత జిన్నా విజ్ఞప్తిపై సంతకాలు చేయమ న్నారు. గుడివాడలో, కొంతమంది ముస్లింలు, కమ్యూనిస్టు పంథాను అంగీకరించినా, లీగు అనుమతిలేందే సంతకాలు పెట్టమన్నారు. తూర్పు గోదావరిలో కొంతమంది ముస్లింలు, దివితాలూకాలో కొంతమంది, లీగు చెప్పందే చేయమన్నారు.

మరొక దృశ్యం

బందరులో 31 మంది ముస్లింలు మన స్ఫూర్తిగా సంతకాలుచేశారు. గన్నవరం తాలూకాలో 57 మంది, తిరువూరులో 29 మంది, నందిగామలో 172 మంది, బెజవాడలో 243 మంది, తూర్పుగోదావరిలో 11 గ్రామా లలో 480 మంది సంతకాలు చేశారు. ప్రజా శక్తి, పీపుల్సువార్, ఉర్దూ పత్రికలకు, కొంత మంది, చందాదారులుగా చేరారు. ఐక్యతా జెండాలు కొన్నారు. కమ్యూనిస్టు పంథాను అంగీకరిస్తున్నారు.

అవనిగడ్డలో కమ్యూనిస్టులు మహమ్మదీ యులవద్దకు వెళ్ళారు. అచ్చటి ముస్లిం లీగు ఏజంటు ఐక్యతాప్రచారానికి విముఖుడుగాఉన్నా బీదరికపు ముస్లింలు సంతకాలు చేశారు, "ఇది పేదల పార్టీ, మేముపేదవాళ్ళం. మేము సంత కాలు చేశాము" అని అన్నారు.

వాళ్ల సంశయాలు

"కాంగ్రెసు మా స్వయం నిర్ణయం హక్కును గుర్తించడంలేదు." "కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేసిన తర్వాత వారు మావి డిపోయేహక్కును గుర్తిం చరు. కాబట్టి మేము సంతకాలుచేసినా లాభం లేదు" ఇవి సాధారణంగా మధ్యతరగతి మహ మ్మదీయుల అనుమానాలు, ప్రశ్నలు.

కమ్యూనిస్టు వర్కర్లు ఈ ప్రశ్నలకు తగిన సమాధానం చెప్పారు. "లీగు, కాంగ్రెసూ - రెండూ, ఈ సమస్య పట్ల అభివృద్ధి కరమైన మార్పుచూపారు. ఇద్దరిమధ్యభేదం సన్నగిలు తోంది, ముస్లిం జాతులకు విడిపోయే హక్కు ఉన్నది. ప్రజాసామాన్యమంతా ఏకమైపోతే కాంగ్రెసు నాయకులు వ్యతిరేకించ లేరు. ఏ శక్తితో నైతే, జాతీయ ప్రభుత్వాన్ని సాధి స్తామో, ఫాసిస్టులను హత మారుస్తామో ఆ శక్తితోనే వివిధ జాతుల స్వయం నిర్ణయ హక్కును కాంగ్రెసు గుర్తించేటట్లు చేయ గలుగుతాము.

ఒక్క ముఖ్య విషయం. మీరు ఇప్పుడు మాతో చేయి కలపక, తాటస్థ్యంగా ఉంటే మీకు విడిపోయే హక్కు వస్తుందను కుంటు న్నారేమో. అది ఎన్నడూ జరగదు. బ్రిటిషు సామ్రాజ్యం మీకు ఆ హక్కును ఇవ్వద మనేది కల్ల. అది స్వతంత్రభారత దేశంలోనే జరుగుతుంది. కాని, అస్వాతంత్ర్యం కాంగ్రెసు నాయకులు జైలులో ఉన్నంత వరకు రాదు. అందువలన ఈ ఐక్యతా ఉద్యమంలో పాల్గొని జిన్నాపై వత్తిడి తెచ్చి, నాయకుల విడుదలకు ముందంజ వేసేటట్లు చేయాలి; ముస్లిం ప్రజా సామాన్యాన్ని, హిందు ప్రజా సామాన్యాన్ని ఐక్యం చేసేటట్లు కృషి చేయాలి"

శ్రమజీవి

పాటకపువర్గాలు ఈవుద్యమంలో చైతన్యం పొందినట్లు మరే తరగతులూ చైతన్యం పొంద లేదు. సంతకాలు చేసిన వారిలో కూలీలు, వ్యవసాయకూలీలు అధికులు. పార్టీఫండుకు కూడా ఇచ్చినవారి సంఖ్యలో ఎక్కువమంది ఈ బీదజనమే. అవనిగడ్డలో 53 కూలీలు 4-1-3 ఇచ్చారు. ఇంకొక కూలీ సంఘం 2-8-0 ఇచ్చింది. మరొక చోట 35 రెండు అణాల టిక్కెట్లు అమ్మారు. ఇవి చిన్న మొత్తాలే. కాని, దరిద్రంలో మునిగి తేల్తూ, ఈయుద్ధపు దినాలలో ఒకపూటకూడా సరిగ తిండిలేక, నిరంతరం ఆకలిదేవతకు ఆహుతి అయిన, ఈ శ్రమజీవి ఇచ్చిన ప్రతి దమ్మిడీ విలువ తూచ డానికి వీలులేనిది. చెమటోడ్చి, తన రక్త మాంసాలతో సంపాదించి ఇచ్చిన ఒక్క రాగి డబ్బైనా, ఐక్యతాఉద్యమం అంగీకార చిహ్న ముగా దాని ప్రాముఖ్యత అమోఘం.

"మాకు స్వాతంత్ర్యం వద్దా?"

తమ పార్టీకి చందాలు ఇవ్వటంలో కూలీలు ఎంత ఉత్సాహం, ఆతృత చూపించారో, సంత కాలు చేయడానికి అంత చూపించారు.

గుడివాడ మునిసిపల్‌వర్కర్లు, వ్యవసాయ కూలీలు, చిత్తూరుజిల్లాలో చేతిపనివారు, కార్మి కులు, రైతులు, నాగవరప్పాడులో వ్యవసాయ కూలీలు సంతకాలు చేశారు.

గన్నవరంలో కూలీలు సంతకాలుచేస్తుంటే, మిషనరీకిచెందిన ఒకమిస్త్రీనువచ్చి "కాంగ్రెసు మనకు శత్రువు. సంతకాలు పెట్టవద్దు" అని కూలీలను ప్రబోధించింది. మన కామ్రేడ్సు నెమ్మదిగా కూలీలకు పరిస్థితులు వివరించారు. ఐక్యత ఎందుకు, ఉద్యమం ఆశయాలేమిటి; నాయకులుఎందుకు విడుదలవ్వాలి, మొదలైనవి విషయంవెంబడివిషయంనచ్చచెప్పారు. దాంతో, అంతవరకు తటపటాయించుతున్న వారితో సహా అందరు "మాకు మాత్రం స్వాతంత్ర్యం వద్దా!" అని సంతకాలు చేశారు.

కమ్యూనిస్టులు దొంగలు అని అపోహపడ్డ ఒక వ్యక్తి, గుడివాడలో, మన కామ్రేడ్సుకు తారసిల్లాడు. వాదోపవాదాలు జరిగాయి. చివ రికి ఆ వ్యక్తి పార్టీపాలసీ అంగీకరించాడు. విజ్ఞప్తిమీద సంతకం చేశాడు. "ప్రజాశక్తి" ప్రతివారం చదువుతానని వాగ్దానంచేశాడు.

బెజవాడలో ఒక రాయిన్సు తలపడ్డాడు. చర్చలు జరిగిన మీదట పార్టీకి ఒక రూపాయి విరాళమిచ్చాడు. పీపుల్సువార్ పత్రిక కొన్నాడు. రాజకీయంగా పూర్తిగా ఒప్పుకొనక పోయినా, కమ్యూనిస్టులు నిస్సి యరుగా పని చేస్తారని అభినందించాడు.

గన్నవరంలో మన పార్టీ ప్రణాళికను చది విన 4 గురు అధికారులు సంతకాలు పెట్టారు. అందులో ఒక ఉద్యోగి మన పార్టీ పాలసీయే సరియైనదని ప్రకటించి కొంత విరాళ మిచ్చాడు. ప్రజాశక్తికి చందా దారుడుగా చేరాడు. ముగ్గురు గ్రామోద్యోగులు మన పంథాను అంగీకరిస్తూ విరాళాలిచ్చారు.

కామ్రేడ్ జి. రాధాకృష్ణమూర్తి

"తిరిగి యుద్ధభూమిలో కలుద్దాం"

ఐక్యతా ప్రచారం అమోఘంగా సాగిపోతూంది. వీధి మూలల్లో, ఇండ్లల్లో, ఫాక్టరీలలో, ఫాక్టరీలబైట, బస్సులలో, రైళ్లలో - ప్రతిచోటా ఐక్యతా ప్రచారం.

మన కామ్రేడు కాకినాడ వెళ్లడానికి రైలెక్కాడు. సంచిలో "పీపుల్సువార్" "ప్రజాశక్తి" ఎట్టిజెండా టిక్కెట్లు, విజ్ఞప్తి కాగితాలూ ఎప్పుడూ ఉంటాయి. బండి కదిలింది మన కామ్రేడ్ విజ్ఞప్తి కాగితం బైటకు తీశాడు. "మూగవాడెమో, అడుక్కోడానికి కాగితం కాబోలు" అని ప్రయాణీకులు అనుకుంటూండగానే, కమ్యూనిస్టు ఐక్యతా నినాదాలతో ప్రచారం ప్రారంభించాడు. కమ్యూనిస్టు పార్టీ పాలసీ వివరిస్తూ, విజ్ఞప్తిపై సంతకాలు చేయండి అని ప్రతి ప్రయాణీకుని వద్దకూ వెళ్లుతూ, ఒక వ్యక్తిదగ్గరకు వచ్చాడు. అతను ఒక రిటైర్డు సబ్ ఇన్‌స్పెక్టరు. సంతకం పెట్టండి అంటే "మీరడ్డుకుంటే జపాను ఆగుతుందా! జరగాల్సింది జరుగుతుంది గాని" అని తలత్రిప్పుకున్నాడు. ఎదురుగా ఉన్న ఒక ప్లీడరు, కాంగ్రెసు అభిమాని, సానుభూతితో పార్టీపాలసీని చర్చించాడు. కాని, సంతకం దగ్గరకు వచ్చేటప్పటికి "క్షమించండి" అని అన్నాడు. ఈ సంఘటనంతా వింటూ, చిరునవ్వుతో కూర్చున్న మిలిటరీ యువకుడు కనబడ్డాడు మన కామ్రేడుకు. "పీపుల్సువారు కొంటారా?" అని అతని దగ్గిఅకు వెళ్లాడు. ఇంతలోకే బండి ఆగింది. మన కామ్రేడు దిగి వెళ్లాల్సి వచ్చింది.

తిరిగి ఆ మిలిటరీ యువకుడే కాకినాడలో తారసిల్లాడు. కొంతసంభాషణ ఐనమీదట పార్టీ పాలసీ విపులీకరించమని కోరాడు. యుద్ధం ప్రారంభమైనది మొదలు జపాను ఫాసిస్టులు భారత దేశంమీద విమానదాడి చేసినంతవరకు జరిగిన సంఘటలు తెలిపాడు మన కామ్రేడు. తృప్తితో తలవూపి, "పీపుల్సువారు" ఇమ్మన్నాడు. రెండణాల టిక్కెట్టుకూడా కొన్నాడు. దానిమీద తెలుగులోఉన్న నినాదాలు తర్జుమా చేసి చెప్పమన్నాడు. విని "భాయీ, ఈ నినాదాలన్నిటినీ సైన్యంలోఉన్న నా కామ్రేడ్సు కందరికీ అందజేస్తాను!" అని ఉద్రేకంతో అన్నాడు. తిరిగి ఎప్పుడు కలుసుకుంటాం అని అంటే, "జపాను ఫాసిస్టులను దునుమాడే యుద్ధభూమిమీద" అని పిడికిలి బిగించి అన్నాడు.

రెండులక్షల పార్టీఫండుకు రూపాయి విరాళమిచ్చి, కరస్పర్శచేస్తూ, "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్" అనిఅంటూ వెళ్ళిపోయాడు.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు

ఐక్యతానినాదాలు మూడూ, మూడు వాడియైన ఆయుధాలు. వాటిని సరిగా, తెలివిగా ప్రయోగిస్తే, సర్వసాధారణంగా గెలుపు తప్పక వస్తుంది.

నెల్లూరు నుంచి మద్రాసు రైలు జోరుగా పరుగెత్తుతోంది. అంత జోరుతో, ఐక్యతా ఉద్యమం ఏవిధంగా విజయవంతంగా చేయాలి? అనే ఆలోచనలు పరుగెత్తు తున్నాయి మన కామ్రేడు మెదడులో. ఇంతలోకే, దించినతల ఎత్తకుండా ఏకదీక్షతో పత్రిక చదువుతున్న ఒకప్రయాణీకుడు కన్పించాడు. కాంగ్రెసువాదిలాగా కనబడుతున్నాడు. ధనికుడు గూడాను! సరే. మన కామ్రేడు పీపుల్సువారు పత్రిక పుచ్చుకొని, మెల్లిగా అతని ప్రక్కకు చేరాడు. "మహాశయా! ఈ పత్రిక చూచారా?" కాంగ్రెసువాది నిదానించిచూచి, పత్రిక పుచ్చుకున్నాడు. రెండు లక్షల నిధికి జోషీ అప్పీలు, సంపాదకీయం, చదవండని కామ్రేడు సూచించాడు.

కొంతసేపు రెండు వ్యాసాలు శ్రద్ధగా చదివిన ఆ కాంగ్రెసువాదిని చూచి "మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు, మన కామ్రేడు. "బాగానేఉంది."...."ఐతే, మీకు తోచిన సహాయం...." "మీరెవరు? పేరు? ఊరు?....పార్టీ మెంబరా?"....ఆ కాంగ్రెసువాది ఏమీ సహాయం చేయనని మొగమాటం లేకుండా చెప్పాడు. వాదిస్తే ప్రయోజనం కనపడలా. చివరకి ఒక్క కానీ కూడా ఇవ్వనన్నాడు. మీ పార్టీతో, మీ కార్యక్రమంతో ఏకీభవించనన్నారు.

భేదించడానికి కారణాలు- ఒకటి కమ్యూనిస్టులు కాంగ్రెసు పోరాటంలో పాల్గొనకపోవడం. రెండు కాంగ్రెసులీగు ఐక్యత నినాదం. మూడు జపాను, జపాను అని గోల బెట్టడం. ఈ మూడు పాయింట్లలో తాను ఏకీభవించడట-

"మీరేకీభవించడం లేదూ!" అని అంటూ లేచాడు, అంతవరకూ నిద్రపోతున్న మరొక డాక్టరు కామ్రేడు. ఇక ఊపిరి సలపలేదు. ఆ కాంగ్రెసు అభిమానితో డాక్టరు కామ్రేడు చర్చ ప్రారంభించాడు. కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని సపోర్టు చేస్తున్నారనేది ఎలా భ్రమో, స్వాతంత్ర్య పోరాటాన్ని కమ్యూనిస్టు లొక్కరే ఏలా ముందుకు తీసుకు పోతున్నారో, జాతీయ ప్రభుత్వానికి జాతీయ ఐక్యత ఎంత అవుసరమో, జాతీయ ఐక్యతకు స్వయం నిర్ణయ హక్కు గుర్తించడం ఎంత ముఖ్యమో, మన పార్టీ పాలసీ ఒక్కటే అటు జపాను ఫాసిజాన్ని, ఇటు బ్రిటిషు సామ్రాజ్యాన్ని, ఐక్యతా యుధంతో యెలా నిర్మూలించగలదో విపులీకరించాడు.

కాంగ్రెసువాదికి ఒక్కసారి కంటిమీదపొర తీసేసినట్లయింది. కమ్యూనిస్టులపంథాఒక్కటే సరైనదని గుర్తించాడు. వెంటనే డాక్టరు కామ్రేడు "ఇప్పుడు చెప్పండి పార్టీఫండుకెంత ఇస్తారో" అని అడిగాడు. "యాభై రూయలు" అని జవాబుచెప్పుతూ, క్రిందటి సత్యాగ్రహంలో కూడా రు 50లు ఇచ్చాననిచెప్పాడు ఆకాంగ్రెసువాది. వెంటనే మన డాక్టరు "అప్పుడు రు 50 లిస్తే, ఇప్పుడు కనీసం రు 100 లైన ఇవ్వాలి" అని అన్నాడు. కాంగ్రెసువాది అంగీకరించాడు. అంతేగాదు, తన గ్రామంలో రూ 2000 లు వసూలు చేయడానికి మాట ఇచ్చాడు.

ఈ ఘటనతో బండిలో ఒకమార్పువచ్చింది, ఈ చర్చనంతా వింటున్న ఐదుగురు "పీపుల్సువార్"కు చందాదారులుగా చేరడానికి తమ ఎడ్రసులు ఇచ్చారు.

స్త్రీలు పురుషులకు తీసిపోలేదు

ఇదివరకు లేని చైతన్యం, ఉత్సాహం, త్యాగం ఆంధ్రస్త్రీలలో కనబడుతోంది. ఐక్యతా ఉద్యమంలో వారు కనబరచే పౌరవ, శ్రద్ధ, తీవ్రత మగవారిని మరుగుపరుస్తున్నాయి.

గుడివాడ, గన్నవరం మొదలగు తాలూకాలలో స్త్రీ కామ్రేడ్సు దళాలుగా బయలుదేరి ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి సంతకాలు కలెక్టు చేశారు. రెండణాల టిక్కెట్లను వందల కొలది అమ్మారు. గుడివాడలో పైసాఫండు ఇచ్చిన వారిలో హెచ్చుమంది స్త్రీలు.

కనగాలలో ఒక మహిళ మంగళ సూత్రాన్ని, కాలిపట్టాలను పార్టీకి విరాళంగా ఇచ్చింది. ఒక కామ్రేడ్ భార్య తన మంగళ సూత్రాన్ని, ఒక బంగారు గాజును పార్టీకి ఇచ్చింది. మొన్న మొన్నటి వఱకూ రాజకీయ పరిచయం ఏమాత్రం లేని ఒక స్త్రీ ఐక్యతా ఉద్యమంలో కలసి పనిచేసింది జపాను దండయాత్రనుంచి దేశాన్ని రక్షించడానికి కృషి చేస్తున్న పార్టీ ఆశయాలు తెలిసికొని తన బంగారు గాజుల జత విరాళంగా ఇచ్చివేసింది.

నూతనానుభవం

పార్టీ ఫండు వసూలైన విధాలు పరిశీలిస్తే, ఈఐక్యతా ఉద్యమం ప్రజాబాహుళ్యంలో ఎంత నూతన రాజకీయ చైతన్యం కలిగించిందో స్పష్టమౌతుంది. పార్టీయందు ప్రజా సామాన్యంలో ఎంత అభిమానము, ప్రేమ ఉందో తెల్లమౌతుంది. ఇత్తడి సామానులు, వంట సామాగ్రి, స్టౌలు, గడియారాలు, మంగళ సూత్రాలు, వెండి గిన్నెలు, ఉంగరాలు, గాజులు, ఖద్దరునూలు, ధాన్యము, బియ్యము సకల విధాలైన వస్తువులు విరాళంగా వచ్చాయి.

ఐక్యతా వారంలో కొన్ని ఘటనలు

ఒక కామ్రేడు ప్రయాణం చేస్తూ బస్సులో చేసిన ప్రచారం వల్లప్రయాణీకులు పార్టీకి చందాలనిచ్చారు.

విరాళంకోసం కొంతమంది కామ్రేడ్సు ఒక కాంగ్రెసు వాది ఇంటికి వెళ్ళారు. ఆ కాంగ్రెసు అభిమాని చందా ఇవ్వనిరాకరించి, కామ్రేడ్సు ఉండగానే ఇల్లువదిలి వెళ్ళిపోయాడు. ఈ ఘటన నంతా చూస్తు ఆయన భార్యభరించలేకపోయింది. వెంటనే లోపలికి వెళ్ళి 6 శేర్ల బియ్యం తెచ్చింది. "నాభర్త మీకేమీ ఇవ్వ వద్దన్నారు." అని కూడా చెప్పింది. ఇంకొక వృద్ధురాలు, కొడుకులు అసమ్మతి తెలుపుతున్నా, 3 సేర్లబియ్యం ఇచ్చింది. ఒక రైతు ఇంటికి వెళ్ళితే, ఆయన భార్య కామ్రేడ్సు చెప్పినదంతావిని 5 రూపాయలిచ్చింది. ఆమె తల్లి అడ్డుతగిలితే ఆమె ఈ విధంగా జవాబు చెప్పింది. "నేనేమి అడుబ్బు పాడు. చెయ్యదంలేదు. ఒక మహోత్కృష్టమైన కార్యానికి ఇస్తున్నాను"

'గంజిఅక్కర్లేదు, నీళ్లుం చాలు!'

సాటిలేని పట్టుదల, కార్యదీక్ష ప్రదర్శింపబడుతున్నాయి. ఈ ఐక్యతా ఉద్యమంలో.

ఇంతవరకు రాజకీయరశ్మి తగలని మారుమూలల గ్రామాలకు కూడా ప్రాకిపోతోంది ఉద్యమం.

ఉద్యమంలో లీనమై కమ్యూనిస్టు ప్రచారకులు ఆకలి, దప్పిక, నిద్ర అనేవి మరచిపోతున్నారు. వీరి ఉత్సాహంముందు ప్రజలలో ఉండే నిరాశ అదృశ్యమైపోతోంది.

నెల్లూరు జిల్లాలో ఒక గ్రామం - ప్రపంచమంతా తల్లకిందులౌతున్నా, దేశమంతా మండిపోతున్నా, ఈ గ్రామంలో రాజకీయ ప్రచారం ఇంతవరకు జరగలేదు. అట్టి గ్రామంలో రాజకీయ అంకురార్పణ చేశారు మన కామ్రేడ్సు.

గ్రామంలో కాలుపెట్టారోలేదో, ఒక పెద్ద భూస్వామి తగులుకున్నాడు. "ఈ ఊరెందుకు వచ్చారయ్యా? ఈ వూళ్లో దొంగతనం జరిగింది, పోలీసులు వస్తారు. అరెస్టు చేస్తారేమో. శీఘ్రంగా వెళ్లిపొండి" అని ఆప్యాయత ఉట్టిపడేటట్లు చెప్పాడు. "పోలీసు అరెస్టులకు జడిసే ఘటాలుకాదు మేము", అని బదులు చెప్పారు మన కామ్రేడ్సు. భూకామందు కొంత సేపు నిదానించి, తిరిగి ఎత్తుకున్నాడు. "ప్రొద్దు గూకుతోంది. పోరే? ఈ ఊళ్లో కాస్తగంజి నీళ్ల పోసే వాళ్లకూడా లేరు సుమా!" అని అన్నాడు. "అన్నందొరక్కపోతే, నీళ్లయినా దొరుకు తాయిగా" అని కామ్రేడ్సు జవాబు. "లాభం లేదురాబాబూ" అని భూస్వామి నడచి పోయాడు.

రాత్రిఅయింది. కిరసనాయలు దీపాలకు కరువు ఎలెక్ట్రిక్కు దీపాలు అసలే ఉండవు. అంతా చీకటి. ఏలా మీటింగు నడపడం? ఒక గ్రుడ్డి దీపమైనా దొరకదే!

కామ్రేడ్సు ఓటమిని ఒప్పుకునే ఘటాలు కావు. గుడికివెళ్ళి ఒక ప్రమిదె దీపం సంపాదించారు. దీపంపెద్దదిచేసి, మధ్యపెట్టి మీటింగు ప్రారంభించారు. అనుభవాలతో, ఉపమానాలతో, ఉద్రేకంతో ఉపన్యాసాలిచ్చారు. సభికులు అంగీకారంతో తలలూపారేగాని, సంతకాలు చేయమంటే, "అయ్యబాబో, సంతకాలే!" అని పులిక్కిపడ్డారు. సంతకంచేస్తే అరెస్టు చేస్తారేమో! కాని మన కామ్రేడ్సు పట్టుదల వారిభయంకన్నా బలమైంది. చివరకు ఒకపెద్దరైతు ముందుకువచ్చి "ఏ భయం లేద"న్నాడు. ఇక సంతకాల కేమి కొరత!

సవరణ

గతసంచిక సంపాదకీయంలో, "ఇవి ఆధారరహితమైన కారణాలుకాదు" అని ఒకవాక్యం వుంది. "ఇవి ఆధారరహితమైన కారణాలు" అనడానికిబదులు పైవిధంగా పొరబాటుపడింది. పాఠకులీ పొరబాటును గుర్తించ ప్రార్థన.

— సంపాదక వర్గం.

విభేదాలను రెచ్చగొట్టడానికి

ప్రభుత్వోద్యోగుల పన్నాగం

— కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖరరావు

గతవారం జలంధర్, లైలపూర్‌లలో ముస్లింలీగ్ అధ్యక్షుడు జిన్నా యిచ్చిన ఉపన్యాసాలలో ఫాసిజాన్ని ఎదిరించి, పితృభూమిని రక్షించ లేనా కి భారతీయుల ఐక్య సంఘటిత ప్రయత్నానికి తన సంసిద్ధతను వెల్లడించాడు. 'తాము నివసించే ప్రదేశంలోఅధిక సంఖ్యాకులుగావున్న ప్రత్యేకజాతి' కాబట్టి ముస్లిం జాతులకు స్వయం నిర్ణయహక్కు యివ్వబడాలని విశదీకరించాడు. సంయుక్తరాష్ట్రా లలోవున్న మహమ్మదీయులు అధిక సంఖ్యాకులుకాదు కాబట్టి, ప్రత్యేక ముస్లిం జాతికాదని, వారికి స్వయం నిర్ణయహక్కు కోరడంలో అర్థంలేదనీ, స్పష్టపరిచాడు జాతీయ ప్రభుత్వానికి సంపూర్ణ అధికారం అప్పగించాలనిపోరాడు ప్రస్తుత ప్రభుత్వానికి ప్రమాదంలేదనీ, సర్వంధ విధానంపైనే మసగిల్లుతూందనీ, తెలిపాడు. తాను బ్రిటిషు పరిపాలన కోరుతున్నాననడం వట్టినిందఅని నిరశించాడు పైన ఉదహరించిన జిన్నాకోర్కెలు ప్రతి 'జాతీయవాది హర్షింపదగినవి. అవి కాంగ్రెసుకోరే జాతీయవాంఛకు దరిదాపుగా వున్నాయికూడా.

జాతీయవాంఛను సాధించేమార్గం

కాని యీన్యాయమైన కోర్కెలనుసాధించడానికి జిన్నా సూచించే మార్గం ఏమిటి? "భారత దేశానికి పశ్చిమోత్తరంగాను, ఈశాన్యంగానువున్న ప్రాంతాలలో అత్యధికసంఖ్యాకులుగా వున్న ప్రాంతాలకు స్వయం నిర్ణయాధికారం అంగీకరించండి. జాతీయ ప్రభుత్వవాంఛను లీగు బలపరుస్తుంది" అని జిన్నా కాంగ్రెసును, హిందువులను హెచ్చరించాడు. ఇంతవరకు బాగానేవుంది. కాని నేడు కాంగ్రెసు నాయకులను బ్రిటిషు ప్రభుత్వం జైళ్లలోపెట్టింది. వారితో రాయబారాలు జరుపడానికి రాజాజీకి వైస్రాయి అనుమతి నిరాకరించాడు. కాంగ్రెసు లీగ్‌లమధ్య రాయబారాలకేఆటంకమేర్పడింది దీన్ని దేశమంతా, లీగ్‌పత్రిక 'డాన్' సైతం, నిరశించింది. దేశంలో పరిస్థితి మరింత క్లిష్టమవుతోందిమనసరిహద్దునేజపాన్‌తనబలాలను కేంద్రీకరించుతోంది. ప్రమాదానికి సమీపంగా వున్న బెంగాలులో గవర్నరు నిరంకుశాధికారం వల్ల ముఖర్జీ రాజీనామా యిచ్చాడు: మంత్రివర్గంలో ప్రతిష్టంభన ఏర్పడింది. అనగా లీగ్ ముస్లింల మాతృభూమియని స్వయంనిర్ణయ హక్కులను కోరుతున్న ఒక ప్రాంతానికి ప్రమాదం హెచ్చింది.

పొరపాటు పంథా

జపాను దుండగీడులు జయించితే భారతీయులకు (ముస్లిం జాతులతోసహా) బానిసత్వము ప్రాప్తించుతుంది. ఈ సమయంలో జిన్నా లాహోరు పత్రికాధిపతులతో సంభాషణలోకాంగ్రెసుపైదాడి ప్రారంభించాడు. కాంగ్రెస్ పాలసీ మార్చుకుంటేగాని రాయబారాలకే అవకాశం లేదన్నాడు. కాంగ్రెసు నాయకులు జైళ్ళలో వుండుటచే రాజీకి అవకాశాలు కల్గించే బాధ్యత ప్రధానంగా యితర దేశ భక్తులు, సంస్థలపై వుంది. రాజాజీ అలాంటి ప్రయత్నంచేశాడు. రాజాజీతో లీగుయెట్టి రాజీచేసికోలేదని జిన్నా ప్రకటించాడు, ఇది వినాశకరమైన దృష్టిఫలం ముస్లిం ప్రజల ప్రధాన రాజకీయ సమస్యనుపరిష్కరించడానికి ఉపకరించదు. కాదు.

ఇంతేకాదు; కాంగ్రెసు రాజీకి రాకపోతే 10 కోట్ల ముస్లింలతోనే పోరాటం జరుపుతానని జిన్నా బ్రిటిషు ప్రభుత్వాన్ని కోరాడు ఈ దేశం లానే విధానం ప్రజా నాయకులకు తగదు. కాంగ్రెసు పట్టుదలపై ఒత్తిడి చేయాలని అవలంబించిన పాలసీ యేవిధంగా దేశాభ్యుదయానికి పరిణమించిందో తెలుపునూనే, మరల ముస్లిం లీగ్ లనే పాలసీని అవలంబించునని తెగాడు. కాంగ్రెసును మినహాయించితే భారతదేశంలో జాతీయ ప్రభుత్వమనేది కల్ల. కాంగ్రెసు-లీగ్ ఐక్యత పునాదిపైనే నిజమైన జాతీయ ప్రభుత్వం సాధ్యమవుతుంది. వైస్రాయి దయకోసం యెదురుచూస్తే, వచ్చేదిజాతీయప్రభుత్వంకాదు; ఇపుడు వైస్రాయి. అతని తోటకూలు, సాగించే ప్రభుత్వం వంటిదే అవుతుంది. దానిలో చేరడమంటే కాంగ్రెసు దేశభక్తుల నిర్బంధాలు, సాముదాయక జరిమానాలు, పగయిరా నిరంకుశ చర్యలు సాగించడానికి బ్రిటిషు సామ్రాజ్యవాదులకు సాయపడడమే అవుతుంది. ముస్లిం దేశభక్తులు, ప్రజలు ఇట్టిదౌర్భాగ్యాన్ని కాంక్షించడం లేదనే సంగతి జిన్నాజీ గుర్తించాలి.

ఉద్యోగుల చెలగాటం

ఒకవంక బ్రిటిషు సామ్రాజ్య వాదులు భారత దేశంలో ఐక్యత లేదని చాటుతున్నారు. రెండోవైపున ప్రభుత్వోద్యోగులు ఐక్యత రాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సర్ జఫ్రుల్లాఖాన్ వంటి ప్రజల సొమ్ము తినే ప్రభుత్వోద్యోగి పాకిస్థానును బలపరుస్తూ ప్రచారం సాగించు తున్నాడు. రెండోవైపున లీగ్‌కోర్కెలకు విరుద్ధంగా డాక్టరు అంబేదకర్ ప్రచారం చేస్తున్నాడు. ప్రభుత్వం బహుశా భారతీయులలో వున్న విభేదాలను తమ ఉద్యోగుల ద్వారాప్రదర్శించ దలచుకుందికాబోలు. జాతీయ విచ్ఛిన్నానికి ప్రోత్సహించుతూ గావించబడే యీ ఉన్నతోద్యోగుల ఉపన్యాసాలకు అంతరార్థం ఇదే.

అలహాబాద్‌లో సమావేశమయిన ఆంగ్లో యిండియన్ సమావేశానికి అధ్యక్షత వహించిన మిస్టర్ ఆంథోనీ తాము జాతీయ ప్రభుత్వాన్ని బలపరుస్తామనీ, దేశ విభజన ప్రయత్నాలకు తాము వ్యతిరేకులమనీ, ఉపన్యసించాడు. ఆకస్మికంగా యీ లాయలిస్టుకు జాతీయ ప్రభుత్వంపైకలిగినప్రేమనిజమైనది కాదు. ఒకవైపు జాతీయవాంఛనుబలపరుస్తున్నట్టు కనపడుతూనే, రెండోవైపున ఇతడు జాతుల స్వయం నిర్ణయ సూత్రాన్ని "దేశ విభజనగా" ప్రచారం గావించుతున్నాడు. అనగా జాతీమైక్యత సాధ్యమయ్యే ఒకే ఒక మార్గాన్ని చెడుగా ప్రచారం చేస్తున్నాడు. ఇట్టి లాయలిస్టుల ప్రచారం జాతీయ విభేదాలను హెచ్చు చేయడానికి, జాతీయోద్యమ విచ్ఛిన్నానికి, మాత్రమే ఉద్దేశింపబడింది. నిజమైన జాతీమైక్యత వివిధజాతుల స్వయం నిర్ణయ హక్కును గుర్తించేనే సాధ్యమవుతుంది. అప్పుడే బ్రిటిషు సామ్రాజ్యవాదులనుండి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోగల్గుతాము; స్వాతంత్ర్యాన్ని సాధించగల్గుతాం.

జమ్నాదాస్ మెహతావంటి దేశాన్ని విభజించరాదని ప్రకటించాడు. మిస్టర్ ఆంథోనీ, జమునాదాస్ మెహతావంటి ప్రభుత్వ ఏజంట్లు మిత్రులవలే అయాచితంగా యిస్తున్న సలహాలను జాతి ప్రజాసేవకులు మోసపోకూడదు. దేశం చీల్చరాదనే చేసే ప్రచారం వాస్తవంలో జాతీయ ప్రభుత్వానికి విరుద్ధమనీ, జాతీమోద్యమ విధ్వంసానికే ఉద్దేశించబడిందనీ గ్రహించాలి. ప్రభుత్వ ఉద్యోగులచేతను, ఏజెంట్లచేతను సాగించబడే ఈ అడకత్తెర మోసానికి లొంగకూడదు.

మద్రాసు మహిళాసభ

బి కామేశ్వరమ్మగారి అధ్యక్షతను సమావేశమయిన మద్రాసు రాష్ట్ర మహిళాసంఘ వార్షిక సభ కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలనీ, స్వాతంత్ర్యం కోసం డిమాక్రసీ కోసం జరిగే యుద్ధంలో స్త్రీలందరూ పాల్గొనాలనీ తీర్మానించింది.

జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలని కోరింది. జాతీయ ప్రతిష్టంబన తొలగించడానికి ప్రయత్నించుకున్నరాజాజీకి, కాంగ్రెసు నాయకులను కలసికోడానికైఅవకాశమివ్వనందుకువైస్రాయిని నిరశించింది. స్త్రీ లందరూ నూతన ప్రపంచ వ్యవస్థను నిర్మించడంలో తమపాత్రను నిర్వహించాలనీ విశ్వమానవ కళ్యాణానికి, శాంతికి పాటుబడాలనీ తీర్మానించారు.

మన రాజకీయాలు

అరాజక ఉద్యమం

ప్రభుత్వం ఎన్ని నిర్బంధచర్యలు అవలంబించినా ప్రజలలో అసంతృప్తివున్నంతకాలం విధ్వంసక చర్యలు కొనసాగుతూనే వుంటాయి ప్రతిదినం దేశంలో ఎదో ఒక మూల రైలుస్టేషను తగులబెట్టారనో, పట్టాలు పీకారనో, టెలిగ్రాఫ్ టెలిఫోన్ తీగలు తెగ్గొట్టారనో వార్తలు వస్తూనేవున్నాయ్. ఇవి దేశహితకరంకాదని దేశభక్తులకు నచ్చచెప్ప గలిగితేనూ, జాతీయ ప్రభుత్వం ఏర్పడి ప్రజలందరిని యుద్ధకృషికి సుముఖుల్ని చేసినపుడే యివి ఆగిపోతాయి. ప్రభుత్వం నిర్బంధ విధానము, సాముదాయక జరిమానాలు కొనసాగినకొలదీ దేశభక్తుల క్రోధం అలాగే వుంటుంది. అరాచక చర్యలు దేశభక్తి అనీ, ప్రభుత్వాన్ని దెబ్బకొడుతుందనీ భ్రమతో జరుపబడుతూనే వుంటాయి.

లోకల్ బోర్డులకు నామినేషన్లు

మద్రాసు ప్రభుత్వం యిదివరకు రాజకీయంగా సామ్రాజ్యవాదుల చెప్పుచేతలలో వుండలేదని అణచివేయబడిన లోకల్ బోర్డులను పునరుద్ధరించుచుందట. వాటిని లాయలిస్టులతోను, జాతీయ విద్రోహులతోను నింపడానికి నిర్ణయించుకుందట. ప్రజా విశ్వాసాన్ని పూర్తిగా గోల్పోయిన ప్రభుత్వం తమ జోహుకుంలకు నామినేట్‌చేసి, పదవులిచ్చి వారి విశ్వాసాన్ని చూరగొనాలని ప్రయత్నించుతూంది. ఈ జాతీయ విద్రోహులపై ఆధారపడినంత కాలం జపాన్ దుండగీడులను ఎదిరించడం దుస్సాధ్యమవుతుంది. ఏమంటే మాతృదేశం కొరకు వారెపుడూ త్యాగం చేయలేదు. రానున్న జపాన్ దుండగీడులకు వ్యతిరేకంగా ప్రాణాలొడ్డి పోరాడటానికి సిద్ధపడరు, క్లిష్ట సమయంలో రెండో పక్షాన చేరడానికి సిద్ధమయితే ఆశ్చర్యంలేదు.

కాబట్టి భారతదేశాన్ని జయప్రదంగాజపాన్ దురాక్రమణనుంచి ఎదిరించాలంటే ఒకేమార్గముంది. ప్రజావిశ్వాసాన్ని చూరకొన్న వివిధ పార్టీల ప్రతినిధులతో సంయుక్త జాతీయప్రభుత్వానికి సంపూర్ణ అధికారం అప్పగించి నపుడే భారత ప్రజలందరూ ఉత్సాహంగా యుద్ధ కృషికి తోడ్పడుతారు. జపాన్ దుండగీడులను జయప్రదంగా అరికట్టి, భారత స్వాతంత్ర్యాన్ని సాధించ గల్గుతారు.

సామ్రాజ్య వాదుల ఎత్తులు

బ్రిటీషు, అమెరికన్ సామ్రాజ్య వాదులు మొన్నటి వరకు హిట్లరు ఏజెంటుగా పనిజేసి, ఫ్రెంచి ప్రజలకు ద్రోహంచేసిన డార్లాన్‌కు ఉత్తరాఫ్రికాలో సివిల్ అధికారం యివ్వడం, ఉత్తరాఫ్రికాలోని ప్రజల స్వాతంత్ర్యాన్ని గురించి ముచ్చటించక పోవడం, వారు యుద్ధములో ఫాసిస్టులను ఓడించినాక మరల సామ్రాజ్య వాద అధికారాన్ని కాలనీలపై సాగించాలంచాలని కుట్రలు పన్నుతున్నారని విదితమవుతూంది. కాని సామ్రాజ్య వాదుల కుట్రలు సాగవు. ఫాసిజాన్ని ఓడించడానికి పోరాడుతున్న ప్రపంచ ప్రజలు ప్రపంచమందలి వివిధ జాతుల స్వాతంత్ర్యాన్ని, ప్రజలకు ఆర్థిక న్యాయాల్ని, భద్రతను సంపాదించ డానికి పోరాడు తున్నారు. ఆఫ్రికా ఎడారులలోగాని యూరపు రంగములోగాని హిట్లరును ఓడించిన ప్రజలు పాతప్రపంచంలో వున్న అసమానత్వాన్ని, వైరుధ్యాలను ఇకముందు కొనసాగనివ్వరు. ప్రజలు ధారబోసినరక్తం, చేసిన త్యాగం వృధాగా పోనివ్వరు.

ప్రజాశక్తి కోటాలు

జిల్లాలు	విడికాపీలు	చందాదార్లు	మొత్తం	లెనిన్ దినోత్సవం నాటికి
విశాఖపట్నం.	175	19	194	300
తూర్పుగోదావరి	595	46	641	500
పశ్చిమగోదావరి	440	307	747	1000
కృష్ణా	1251	1084	2335	2500
గుంటూరు	891	450	1341	1250
నెల్లూరు	524	299	823	1000
కర్నూలు	114	50	164	250
కడప	50	26	76	200
అనంతపురం	40	51	91	200
చిత్తూరు	68	37	105	300
యితర రాష్ట్రాలు	553	107	660	
	4701	2476	7177	7500

"తిరిగి యుద్ధభూమిలో కలుద్దాం"

ఐక్యతా ప్రచారం అమోఘంగా సాగిపోతూంది. వీధి మూలల్లో, ఇండ్లల్లో, ఫాక్టరీలలో, ఫాక్టరీలబైట, బస్సులలో, రైళ్లలో - ప్రతిచోటా ఐక్యతా ప్రచారం.

మన కామ్రేడు కాకినాడ వెళ్లడానికి రైలెక్కాడు. సంచిలో "పీపుల్సువార్" "ప్రజాశక్తి" ఎట్టిజెండా టిక్కెట్లు, విజ్ఞప్తి కాగితాలూ ఎప్పుడూ ఉంటాయి. బండి కదిలింది. మన కామ్రేడ్ విజ్ఞప్తి కాగితం బైటకు తీశాడు. "మూగవాడెమో, అడుక్కోడానికి కాగితం కాబోలు" అని ప్రయాణీకులు అనుకుంటూండగానే, కమ్యూనిస్టు ఐక్యతా నినాదాలతో ప్రచారం ప్రారంభించాడు. కమ్యూనిస్టు పార్టీ పాలసీ వివరిస్తూ, విజ్ఞప్తిపై సంతకాలు చేయండి అని ప్రతి ప్రయాణీకునీ వద్దకూ వెళ్లుతూ, ఒక వ్యక్తిదగ్గరకు వచ్చాడు. అతను ఒక రిటైర్డు సబ్ ఇన్‌స్పెక్టరు. సంతకం పెట్టండీ అంటే "మీరడ్డుకుంటే జపాను ఆగుతుందా! జరగాల్సింది జరుగుతుంది గాని" అని తలత్రిప్పుకున్నాడు. ఎదురుగా ఉన్న ఒక ప్లీడరు, కాంగ్రెసు అభిమాని, సానుభూతితో పార్టీపాలసీని చర్చించాడు. కాని, సంతకం దగ్గరకు వచ్చేటప్పటికి "క్షమించండి" అని అన్నాడు. ఈ సంఘటనంతా వింటూ, చిరునవ్వుతో కూర్చున్న మిలిటరీ యువకుడు కనబడ్డాడు మన కామ్రేడుకు. "పీపుల్సువారు కొంటారా?" అని అతని దగ్గిఅకు వెళ్లాడు. ఇంతలోకే బండి ఆగింది. మన కామ్రేడు దిగివెళ్లాల్సి వచ్చింది.

తిరిగి ఆ మిలిటరీ యువకుడే కాకినాడలో తారసిల్లాడు. కొంతసంభాషణ ఐనమీదట పార్టీ పాలసీ విపులీకరించమని కోరాడు. యుద్ధం ప్రారంభమైనది మొదలు జపాను ఫాసిస్టులు భారతదేశంమీద విమానదాడి చేసినంతవరకు జరిగిన సంఘటలు తెలిపాడు మన కామ్రేడు. తృప్తితో తలవూపి, "పీపుల్సువారు" ఇమ్మన్నాడు. రెండణాల టిక్కెట్టుకూడా కొన్నాడు. దానిమీద తెలుగులోఉన్న నినాదాలు తర్జుమా చేసి చెప్పమన్నాడు. విని "భాయీ, ఈ నినాదాలన్నిటినీ సైన్యంలోఉన్న నా కామ్రేడ్సుకందరికి అందజేస్తాను!" అని ఉద్రేకంతో అన్నాడు. తిరిగి ఎప్పుడు కలుసుకుంటాం అని అంటే, "జపాను ఫాసిస్టులను దునుమాడే యుద్ధభూమిమీద" అని పిడికిలి బిగించి అన్నాడు.

రెండులక్షల పార్టీఫండుకు రూపాయి విరాళమిచ్చి, కరస్పర్శచేస్తూ, "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్" అనిఅంటూ వెళ్ళిపోయాడు.

ఒక్క దెబ్బకు రెండు పిట్టలు

ఐక్యతానినాదాలు మూడూ, మూడు వారియైన ఆయుధాలు. వాటిని సరిగా, తెలివిగా ప్రయోగిస్తే, సర్వసాధారణంగా గెలుపు తప్పక వస్తుంది.

నెల్లూరు నుంచి మద్రాసు రైలు జోరుగా పరుగెత్తుతోంది. అంత జోరుతో, ఐక్యతా ఉద్యమం ఏవిధంగా విజయవంతంగా చేయాలి? అనే ఆలోచనలు పరుగెత్తు తున్నాయి మన కామ్రేడు మెదడులో. ఇంతలోకే, దించినతల ఎత్తకుండా ఏకదీక్షతో పత్రిక చదువుతున్న ఒకప్రయాణీకుడు తప్పించాడు. కాంగ్రెసువాదిలాగా కనబడుతున్నాడు. ధనికుడు గూడాను ! సరే, మన కామ్రేడు పీపుల్సువారు పత్రిక పుచ్చుకొని, మెల్లిగా అతని ప్రక్కకు చేరాడు. "మహాశయా! ఈ పత్రిక చూచారా?" కాంగ్రెసువాది నిదానించి చూచి, పత్రిక పుచ్చుకున్నాడు. రెండు లక్షల నిధికి జోషీ అప్పీలు, సంపాదకీయం, చదవండని కామ్రేడు సూచించాడు.

కొంతసేపు రెండు వ్యాసాలు శ్రద్ధగా చదివిన ఆ కాంగ్రెసువాదిని చూచి "మీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగాడు, మన కామ్రేడు. "బాగానేఉంది."...."ఐతే, మీకు తోచిన సహాయం...." "మీరెవరు? పేరు? ఊరు?....పార్టీ మెంబరా?"....ఆ కాంగ్రెసువాది ఏమీ సహాయం చేయనని మొగమాటం లేకుండా చెప్పాడు. వాదిస్తే ప్రయోజనం కనపడలా. చివరకి ఒక్క కానీ కూడా ఇవ్వనన్నాడు. మీ పార్టీతో, మీ కార్యక్రమంతో ఏకీభవించనన్నారు.

భేదించడానికి కారణాలు- ఒకటి కమ్యూనిస్టులు కాంగ్రెసు పోరాటంలో పాల్గొనకపోవడం. రెండు కాంగ్రెసులీగు ఐక్యత నినాదం. మూడు జపాను, జపాను అని గోల బెట్టడం. ఈ మూడు పాయింట్లలో తాను ఏకీభవించడట-

"మీరేకీభవించడం లేదూ!" అని అంటూ లేచాడు, అంతవరకూ నిద్రపోతున్న మరొక డాక్టరు కామ్రేడు. ఇక ఊపిరి సలపలేదు. ఆ కాంగ్రెసు అభిమానితో డాక్టరు కామ్రేడు చర్చ ప్రారంభించాడు. కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని సపోర్టు చేస్తున్నారనేది ఎలా భ్రమో, స్వాతంత్ర్య పోరాటాన్ని కమ్యూనిస్టు లొక్కరే ఎలా ముందుకు తీసుకు పోతున్నారో, జాతీయ ప్రభుత్వానికి జాతీయ ఐక్యత ఎంత అవసరమో, జాతీయ ఐక్యతకు స్వయం నిర్ణయ హక్కు గుర్తించడం ఎంత ముఖ్యమో, మన పార్టీ పాలసీ ఒక్కటే అటు జపాను ఫాసిజాన్ని, ఇటు బ్రిటిషు సామ్రాజ్యాన్ని, ఐక్యతా యుధంతో యెలా నిర్మూలించగలదో విపులీకరించాడు.

కాంగ్రెసువాదికి ఒక్కసారి కంటిమీదపొర తీసేసినట్లయింది. కమ్యూనిస్టులపంథాఒక్కటే సరైనదని గుర్తించాడు. వెంటనే డాక్టరు కామ్రేడు "ఇప్పుడు చెప్పండి పార్టీఫండుఎంత ఇస్తారో" అని అడిగాడు. "యాభై రూపాయలు" అని జవాబుచెప్పుతూ, క్రిందటి సత్యాగ్రహంలో కూడా రు 50లు ఇచ్చానని చెప్పాడు ఆకాంగ్రెసువాది. వెంటనే మన డాక్టరు "అప్పుడు రు 50 లిస్తే, ఇప్పుడు కనీసం రు 100 లైన ఇవ్వాలి" అని అన్నాడు. కాంగ్రెసువాది అంగీకరించాడు. అంతేగాదు, తన గ్రామంలో రూ 2000 లు వసూలు చేయడానికి మాట ఇచ్చాడు.

ఈ ఘటనతో బండిలో ఒకమార్పువచ్చింది. ఈ చర్చనంతా వింటున్న ఐదుగురు "పీపుల్సువార్"కు చందాదారులుగా చేరడానికి తమ ఎడ్రసులు ఇచ్చారు.

స్త్రీలు పురుషులకు తీసిపోలేదు

ఇదివరకు లేని చైతన్యం, ఉత్సాహం, త్యాగం ఆంధ్రస్త్రీలలో కనబడుతోంది. ఐక్యతా ఉద్యమంలో వారు కనబరచే చొరవ, శ్రద్ధ, తీవ్రత మగవారిని మరుగుపరుస్తున్నాయి.

గుడివాడ, గన్నవరం మొదలగు తాలూకాలలో శ్రీ కామ్రేడ్సు దళాలుగా బయలుదేరి ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి సంతకాలు కలెక్టు చేశారు. రెండణాల టిక్కెట్లను వందల కొలది అమ్మారు. గుడివాడలో పైసాఫండు ఇచ్చిన వారిలో హెచ్చుమంది స్త్రీలు.

కనగాలలో ఒక మహిళ మంగళ సూత్రాన్ని, కాలిపట్టాలను పార్టీకి విరాళంగా ఇచ్చింది. ఒక కామ్రేడ్ భార్య తన మంగళ సూత్రాన్ని, ఒక బంగారు గాజును పార్టీకి ఇచ్చింది. మొన్న మొన్నటి వరకూ రాజకీయ పరిచయం ఏమాత్రం లేని ఒక స్త్రీ ఐక్యతా ఉద్యమంలో కలసి పనిచేసింది. జపాను దండయాత్రనుంచి దేశాన్ని రక్షించడానికి కృషి చేస్తున్న పార్టీ ఆశయాలు తెలిసికొని తన బంగారు గాజుల జత విరాళంగా ఇచ్చివేసింది.

నూతనానుభవం

పార్టీ ఫండు వసూలైన విధాలు పరిశీలిస్తే, ఈఐక్యతా ఉద్యమం ప్రజాబాహుళ్యంలో ఎంత నూతన రాజకీయ చైతన్యం కలిగించిందో స్పష్టమౌతుంది. పార్టీయందు ప్రజా సామాన్యంలో ఎంత అభిమానము, ప్రేమ ఉందో తెల్లమౌతుంది. ఇత్తడి సామానులు, వంట సామాగ్రి, స్టౌలు, గడియారాలు, మంగళ సూత్రాలు, వెండి గిన్నెలు, ఉంగరాలు,

ఐక్యతా వారంలో కొన్ని ఘటనలు

గాజులు, ఖద్దరునూలు, ధాన్యము, బియ్యము సకల విధాలైన వస్తువులు విరాళంగా వచ్చాయి.

ఒక కామ్రేడు ప్రయాణం చేస్తూ బస్సులో చేసిన ప్రచారం వల్లప్రయాణీకులు పార్టీకి చందాలనిచ్చారు.

విరాళంకోసం కొంతమంది కామ్రేడ్సు ఒక కాంగ్రెసు వాది ఇంటికి వెళ్ళారు. ఆ కాంగ్రెసు అభిమాని చందా ఇవ్వనిరాకరించి, కామ్రేడ్సు ఉండగానే ఇల్లువదిలి వెళ్ళిపోయాడు. ఈ ఘటననంతా చూస్తు ఆయన భార్యభరించలేకపోయింది. వెంటనే లోపలికి వెళ్ళి 6 శేర్ల బియ్యం తెచ్చింది. "నాభర్త మీకేమీ ఇవ్వవద్దన్నారు." అని కూడా చెప్పింది. ఇంకొక వృద్ధురాలు, కొడుకులు అసమ్మతి తెలుపుతున్నా, 3 సేర్లబియ్యం ఇచ్చింది. ఒక రైతు ఇంటికి వెళ్ళితే, ఆయన భార్య కామ్రేడ్సు చెప్పినదంతావిని 5 రూపాయలిచ్చింది. ఆమె తల్లి అడ్డుతగిలితే ఆమె ఈ విధంగా జవాబు చెప్పింది. "నేనేమీ అడబ్బు పాడు చెయ్యడంలేదు. ఒక మహోత్కృష్టమైన కార్యానికి ఇస్తున్నాను"

"గంజిఅక్కర్లేదు, నీళ్లుంటేచాలు"

సాటిలేని పట్టుదల, కార్యదీక్ష ప్రదర్శింపబడుతున్నాయి. ఈ ఐక్యతా ఉద్యమంలో.

ఇంతవరకు రాజకీయరశ్మి తగలని మారుమూలల గ్రామాలకు కూడా ప్రాకిపోతోంది ఉద్యమం.

ఉద్యమంలో లీనమై కమ్యూనిస్టు ప్రచారకులు ఆకలి, దప్పిక, నిద్ర అనేవి మరచిపోతున్నారు. వీరి ఉత్సాహంముందు ప్రజలలో ఉండే నిరాశ అదృశ్యమైపోతోంది.

నెల్లూరు జిల్లాలో ఒక గ్రామం - ప్రపంచమంతా తల్లకిందులౌతున్నా, దేశమంతా మండిపోతున్నా, ఈ గ్రామంలో రాజకీయ ప్రచారం ఇంతవరకు జరగలేదు. అట్టి గ్రామంలో రాజకీయ అంకురార్పణ చేశారు మన కామ్రేడ్సు.

గ్రామంలో కాలుపెట్టారోలేదో, ఒక పెద్ద భూస్వామి తగులుకున్నాడు. "ఈ ఊరెందుకు వచ్చారయ్యా? ఈ వూళ్లో దొంగతనం జరిగింది. పోలీసులు వస్తారు. అరెస్టు చేస్తారేమో. శీఘ్రంగా వెళ్లిపొండి" అని ఆప్యాయత ఉట్టిపడేటట్లు చెప్పాడు. "పోలీసు అరెస్టులకు జడిసే ఘటాలుకాదు మేము". అని బదులు చెప్పారు మన కామ్రేడ్సు. భూస్వామి కొంత సేపు నిదానించి, తిరిగి ఎత్తుకున్నాడు. "ప్రొద్దు గూకుతోంది. పోరే! ఈ ఊళ్లో కాస్తగంజి నీళ్లు పోసే వాళ్లకూడా లేరు సుమా!" అని అన్నాడు. "అన్నందొరక్కపోతే, నీళ్లయినా దొరుకు తాయిగా!" అని కామ్రేడ్సు జవాబు. "లాభం లేదురాబాబూ" అని భూస్వామి నడచి పోయాడు.

రాత్రిఐంది. కిరసనాయలు దీపాలకు కరువు ఎలెక్ట్రిక్కు దీపాలు అసలే ఉండవు. అంతా చీకటి. ఏలా మీటింగు నడపడం? ఒక గ్రుడ్డి దీపమైనా దొరకదే!

కామ్రేడ్సు ఓటమిని ఒప్పుకునే ఘటాలు కావు. గుడికివెళ్ళి ఒక ప్రమిదె దీపం సంపాదించారు. దీపంపెద్దదిచేసి, మధ్య పెట్టి మీటింగు ప్రారంభించారు. అనుభవాలతో, ఉపమానాలతో, ఉద్రేకంతో ఉపన్యాసాలిచ్చారు. సభికులు అంగీకారంతో తలలూపారేగాని, సంతకాలు చేయమంటే, "అయ్యబాబో, సంతకాలే!" అని వులిక్కిపడ్డారు. సంతకంచేస్తే అరెస్టు చేస్తారేమో! కాని మన కామ్రేడ్సు పట్టుదల వారిభయంకన్నా బలమైంది. చివరకు ఒక పెద్దరైతు ముందుకువచ్చి "ఏ భయం లేద"న్నాడు. ఇక, సంతకాలకేమి లోటు!

సవరణ

గతసంచిక సంపాదకీయంలో, "ఇవి ఆధారరహితమైన కారణాలుకాదు" అని ఒకవాక్యం వుంది. "ఇవి ఆధారరహితమైన కారణాలు" అనడానికిబదులు పైవిధంగా పొరబాటుపడింది. పాఠకులు పొరబాటును గుర్తించ ప్రార్థన.

— సంపాదక వర్గం.

విభేదాలను రెచ్చగొట్టడానికి ప్రభుత్వోద్యోగుల పన్నాగం

— కామ్రేడ్ మద్దుకూరి చంద్రశేఖరరావు

గతవారం జలంధర్, లైలపూర్‌లలో ముస్లింలీగ్ అధ్యక్షుడు జిన్నా యిచ్చిన ఉపన్యాసాలలో ఫాసిజాన్ని ఎదిరించి, తమమాతృభూమిని రక్షించుకోడానికి భారతీయులందరిని సంఘటిత పరచడానికి తన సంసిద్ధతను వెల్లడించాడు. 'తాము నివసించే ప్రదేశంలోఅధిక సంఖ్యాకులుగావున్న ప్రత్యేకజాతి' కాబట్టి ముస్లిం జాతులకు స్వయం నిర్ణయహక్కు యివ్వబడాలని విశదీకరించాడు. సంయుక్తరాష్ట్రాలలోవున్న మహమ్మదీయులు అధిక సంఖ్యాకులుకాదు కాబట్టి, ప్రత్యేక ముస్లింజాతికాదనీ, వారికి స్వయం నిర్ణయహక్కును కోరడంలో అర్థంలేదనీ, స్పష్టపరచాడు జాతీయ ప్రభుత్వానికి సంపూర్ణఅధికారం అప్పగించాలనికోరాడు. ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజాబలంలేదనీ, నిర్బంధ విధానంపైనే మనగల్గుతూందనీ, తెలిపాడు. తాను బ్రిటిషు పరిపాలన కోరుతున్నాననడం వట్టినిందఅని నిరశించాడు పైన ఉదహరించిన జిన్నాకోర్కెలు ప్రతి 'జాతీయవాది హర్షింపదగినవి. అవి కాంగ్రెసుకోరే జాతీయవాంఛకు దరిదాపుగా వున్నాయికూడా.

జాతీయవాంఛను సాధించేమార్గం

కాని యీన్యాయమైన కోర్కెలనుసాధించడానికి జిన్నా సూచించే మార్గం ఏమిటి? "భారతదేశానికి పశ్చిమోత్తరంగాను, ఈశాన్యంగానువున్నప్రాంతాలలో అత్యధికసంఖ్యాకులుగా వున్న ప్రాంతాలకు స్వయం నిర్ణయాధికారం అంగీకరించండి. జాతీయ ప్రభుత్వవాంఛను లీగు బలపరుస్తుంది" అని జిన్నా కాంగ్రెసును, హిందువులను హెచ్చరించాడు. ఇంతవరకు బాగానేవుంది. కాని నేడు కాంగ్రెసు నాయకులను బ్రిటిషు ప్రభుత్వం జైళ్లలోపెట్టింది. వారితో రాయబారాలు జరుపడానికి రాజాజీకి వైస్రాయి అనుమతి నిరాకరించాడు. కాంగ్రెసు లీగ్‌లమధ్య రాయబారాలకేఆటంకమేర్పడింది. దీన్ని దేశమంతా, లీగ్‌పత్రిక 'డాన్' సైతం, నిరశించింది. దేశంలో పరిస్థితి మరింత క్లిష్టమవుతోంది మనసరిహద్దునేజపాన్ తనబలాలను కేంద్రీకరించుతోంది. ప్రమాదానికి సమీపంగా వున్న బెంగాలులో గవర్నరు నిరంకుశాధికారం వల్ల ముఖర్జీ రాజీనామా యిచ్చాడు: మంత్రివర్గంలో ప్రతిష్టంభన ఏర్పడింది. అనగా లీగ్ ముస్లింల మాతృభూమియని స్వయంనిర్ణయ హక్కులను కోరుతున్న ఒక ప్రాంతానికి ప్రమాదం హెచ్చింది.

పొరపాటు పంథా

జపాను దుండగీడులు జయించితే భారతీయులకు (ముస్లిం జాతులతోసహా) బానిసత్వము ప్రాప్తించుతుంది. ఈ సమయంలో జిన్నా లాహోరు పత్రికాధిపతులతో సంభాషణలో కాంగ్రెసుపైదాడి ప్రారంభించాడు. కాంగ్రెస్ పాలసీ మార్చుకుంటేగాని రాయబారాలకే అవకాశం లేదన్నాడు. కాంగ్రెసు నాయకులు జైళ్ళలో వుండుటచే రాజీకి అపకాశాలు కల్గించే బాధ్యత ప్రధానంగా యితర దేశ భక్తులు, సంస్థలపై వుంది. రాజాజీ ఆలాంటి ప్రయత్నంచేశాడు. రాజాజీతో లీగుమెట్టి రాజీచేసికోలేదని జిన్నా ప్రకటించాడు, ఇది వినాశకరమైన దృశ్యం. ముస్లిం ప్రజల ప్రధాన రాజకీయ సంస్థ నాయకుడు అవలంబించాలసిన పంథా కాదు.

ఇంతేకాదు: కాంగ్రెసు లొంగి రాకపోతే 10 కోట్ల ముస్లింలతోనే ప్రారంభించమని జిన్నా బ్రిటిషు ప్రభుత్వాన్ని కోరాడు ఈ బేరాలాడే విధానం ప్రజా నాయకులకు తగదు. కాంగ్రెసు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అవలంబించిన పాలసీ యేవిధంగా దేశారిష్టకరంగా పరిణమించిందో తెలుపుతూనే, మరల ముస్లిం లీగ్ అదే పాలసీని అవలంబించడం సరిగాదు. కాంగ్రెసును మినహాయించితే భారతదేశంలో జాతీయ ప్రభుత్వమనేది కల్ల. కాంగ్రెసు-లీగ్ ఐక్యత పునాదిపైనే నిజమైన జాతీయ ప్రభుత్వం సాధ్యమవుతుంది. వైస్రాయి దయకోసం యెదురుచూస్తే, వచ్చేదిజాతీయప్రభుత్వంకాదు; ఇపుడు వైస్రాయి. అతని జోహుకుంలు, సాగించే ప్రభుత్వం వంటిదే అవుతుంది. దానిలో చేరడమంటే కాంగ్రెసు దేశభక్తుల నిర్బంధాలు, సాముదాయక జరిమానాలు, వగయిరా నిరంకుశ చర్యలు సాగించడానికి బ్రిటిషు సామ్రాజ్యవాదులకు సాయపడడమే అవుతుంది. ముస్లిం దేశభక్తులు, ప్రజలు ఇట్టిదౌర్భాగ్యాన్ని కాంక్షించడం లేదనే సంగతి జిన్నాజీ గుర్తించాలి.

ఉద్యోగుల చెలగాటం

ఒకవంక బ్రిటిషు సామ్రాజ్య వాదులు భారత దేశంలో ఐక్యత లేదని చాటుతున్నారు. రెండోవైపున ప్రభుత్వోద్యోగులు ఐక్యత రాకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సర్ జఫ్రుల్లాఖాన్ వంటి ప్రజల సొమ్ము తినే ప్రభుత్వోద్యోగి పాకిస్థానును బలపరుస్తూ ప్రచారం సాగించు తున్నాడు. రెండోవైపున లీగ్‌కోర్కెలకు విరుద్ధంగా డాక్టరు అంబేదకర్ ప్రచారం చేస్తున్నాడు. ప్రభుత్వం బహుశా భారతీయులలో వున్న విభేదాలను తమ ఉద్యోగుల ద్వారాప్రదర్శించ దలచుకుందికాబోలు. జాతీయ విచ్ఛిన్నానికి ప్రోత్సహించుతూ గావించబడే యీ ఉన్నతోద్యోగుల ఉపన్యాసాలకు అంతరార్థం ఇదే.

అలహాబాద్‌లో సమావేశమయిన ఆంగ్లో యిండియన్ సమావేశానికి అధ్యక్షత వహించిన మిస్టర్ అంథోనీ తాము జాతీయ ప్రభుత్వాన్ని బలపరుస్తామనీ, దేశ విభజన ప్రయత్నాలకు తాము వ్యతిరేకులమనీ, ఉపన్యసించాడు. ఆకస్మికంగా యీ లాయలిస్టుకు జాతీయ ప్రభుత్వంపైకలిగిన ప్రేమనిజమైనది కాదు. ఒకవైపు జాతీయవాంఛనుబలపరుస్తున్నట్టు కనపడుతూనే, రెండోవైపున ఇతడు జాతుల స్వయం నిర్ణయ సూత్రాన్ని "దేశ విభజనగా" ప్రచారం గావించుతున్నాడు; అనగా జాతీయైక్యత సాధ్యమయ్యే ఒకే ఒక మార్గాన్ని చెడుగా ప్రచారం చేస్తున్నాడు. ఇట్టి లాయలిస్టుల ప్రచారం జాతీయ విభేదాలను హెచ్చు చేయడానికి, జాతీయోద్యమ విచ్ఛిన్నానికి, మాత్రమే ఉద్దేశింపబడింది. నిజమైన జాతీయైక్యత వివిధజాతుల స్వయం నిర్ణయ హక్కును గుర్తించితేనే సాధ్యమవుతుంది. అప్పుడే బ్రిటిషు సామ్రాజ్యవాదులనుండి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోగల్గుతాము; స్వాతంత్ర్యాన్ని సాధించగల్గుతాం.

జమ్నదాస్ మెహతాకూడ దేశాన్ని విభజించరాదని ప్రకటించాడు. మిస్టర్ అంథోనీ, జమ్నదాస్ మెహతావంటి ప్రభుత్వ ఏజంట్లు మిత్రులవలే ఆయాచితంగా యిస్తున్న సలహాలను జూచి ప్రజలెవ్వరు మోసపోకూడదు. దేశం చీల్చకూడదనే చేసే ప్రచారం వాస్తవంలో జాతీయ ప్రభుత్వానికి విరుద్ధమనీ, జాతీయోద్యమ విధ్వంసానికే ఉద్దేశించబడిందనీ గ్రహించాలి. ప్రభుత్వ ఉద్యోగులచేతను, ఏజెంట్లచేతను సాగించబడే ఈ అడకత్తెర మోసానికి లొంగకూడదు.

మద్రాసు మహిళాసభ

బి. కామేశ్వరమ్మగారి అధ్యక్షతను సమావేశమయిన మద్రాసు రాష్ట్ర మహిళాసంఘ వార్షిక సభ కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలనీ, స్వాతంత్ర్యం కోసం డిమాక్రసీ కోసం జరిగే యుద్ధంలో స్త్రీలందరూ పాల్గొనాలనీ తీర్మానించింది.

జాతీయప్రభుత్వాన్ని స్థాపించాలని కోరింది. జాతీయ ప్రతిష్టంబన తొలగించడానికి ప్రయత్నించుతున్నరాజాజీకి, కాంగ్రెసు నాయకులను కలసికోడానికిపైఅవకాశమివ్వనందుకువైస్రాయిని నిరశించింది. స్త్రీ లందరూ నూతన ప్రపంచ వ్యవస్థను నిర్మించడంలో తమపాత్రను నిర్వహించాలనీ విశ్వమానవ కళ్యాణానికి, శాంతికి పాటుబడాలనీ తీర్మానించారు.

మన రాజకీయాలు

అరాజక ఉద్యమం

ప్రభుత్వం ఎన్ని నిర్బంధచర్యలు అవలంబించినా ప్రజలలో అసంతృప్తివున్నంతకాలం విధ్వంసక చర్యలు కొనసాగుతూనే వుంటాయి. ప్రతిదినం దేశంలో ఎదో ఒక మూల రైలుస్టేషను తగులబెట్టారనో, పట్టాలు పీకారనో, టెలిగ్రాఫ్ టెలిఫోన్ తీగలు తెగ్గొట్టారనో వార్తలు వస్తూనేవున్నాయి. ఇవి దేశహితకరంకాదని దేశభక్తులుకు నచ్చచెప్ప గలిగితేనూ, జాతీయ ప్రభుత్వం ఏర్పడి ప్రజలందరిని యుద్ధకృషికి సుముఖుల్ని చేసినపుడే యివి ఆగిపోతాయి. ప్రభుత్వం నిర్బంధ విధానము, సాముదాయక జరిమానాలు కొనసాగినకొలదీ దేశభక్తుల క్రోధం అలాగే వుంటుంది. అరాచక చర్యలు దేశభక్తి అనీ, ప్రభుత్వాన్ని దెబ్బకొడుతుందనీ భ్రమతో జరుపబడుతూనే వుంటాయి.

లోకల్ బోర్డులకు నామినేషన్లు

మద్రాసు ప్రభుత్వం యిదివరకు రాజకీయంగా సామ్రాజ్యవాదుల చెప్పుచేతలలో వుండలేదని అణచివేయబడిన లోకల్ బోర్డులను పునరుద్ధరించుతుందట. వాటిని లాయలిష్టులతోను, జాతీయ విద్రోహులతోను నింపడానికి నిశ్చయించుకుందట. ప్రజా విశ్వాసాన్ని పూర్తిగా గోల్పోయిన ప్రభుత్వం తమ జోహుకుంలకు నామినేట్‌చేసి, పదవులిచ్చి వారి విశ్వాసాన్ని చూరగొనాలని ప్రయత్నించుతూంది. ఈ జాతీయ విద్రోహులపై ఆధారపడినంత కాలం జపాన్ దుండగీడులను ఎదిరించడం దుస్సాధ్యమవుతుంది. ఏమంటే మాతృదేశం కొరకు వారెపుడూ త్యాగం చేయలేదు. రానున్న జపాన్ దుండగీడులకు వ్యతిరేకంగా ప్రాణాలొడ్డి పోరాడటానికి సిద్ధపడరు. క్లిష్ట సమయంలో రెండో పక్షాన చేరడానికి సిద్ధమయితే ఆశ్చర్యంలేదు.

కాబట్టి భారతదేశాన్ని జయప్రదంగాజపాన్ దురాక్రమణనుంచి ఎదిరించాలంటే ఒకేమార్గముంది. ప్రజావిశ్వాసాన్ని చూరకొన్న వివిధ పార్టీల ప్రతినిధులతో సంయుక్త జాతీయప్రభుత్వానికి సంపూర్ణ అధికారం అప్పగించినపుడే భారత ప్రజలందరూ ఉత్సాహంగా యుద్ధకృషికి తోడ్పడుతారు. జపాన్ దుండగీడులను జయప్రదంగా అరికట్టి, భారత స్వాతంత్ర్యాన్ని సాధించగల్గుతారు.

సామ్రాజ్య వాదుల ఎత్తులు

బ్రిటీషు, అమెరికన్ సామ్రాజ్య వాదులు మొన్నటి వరకు హిట్లరు ఏజెంటుగా పనిజేసి, ఫ్రెంచి ప్రజలకు ద్రోహంచేసిన డార్లాన్‌కు ఉత్తరాఫ్రికాలో సివిల్ అధికారం యివ్వడం, ఉత్తరాఫ్రికాలోని ప్రజల స్వాతంత్ర్యాన్ని గురించి ముచ్చటించక పోవడం, వారు యుద్ధములో ఫాసిస్టులను ఓడించినాక మరల సామ్రాజ్య వాద అధికారాన్ని కాలోనులపై సాగించాలంచాలని కుట్రలు పన్నుతున్నారని విదితమవుతూంది. కాని సామ్రాజ్య వాదుల కుట్రలు సాగవు. ఫాసిజాన్ని ఓడించడానికి పోరాడుతున్న ప్రపంచ ప్రజలు ప్రపంచమందలి వివిధ జాతుల స్వాతంత్ర్యాన్ని, ప్రజలకు ఆర్థిక న్యాయాన్ని, భద్రతను సంపాదించడానికి పోరాడుతున్నారు. ఆఫ్రికా ఎడారులలోగాని యూరపు రంగములోగాని హిట్లరును ఓడించిన ప్రజలు పాతప్రపంచంలో వున్న అసమానత్వాన్ని, వైరుధ్యాలను ఇకముందు కొనసాగనివ్వరు. ప్రజలు ధారబోసినరక్తం, చేసిన త్యాగం వృధాగా పోనివ్వరు.

ప్రజాశక్తి కోటాలు

జిల్లాలు	విడికాపీలు	చ. దాదార్లు	మొత్తం	లెనిన్ దినోత్సవం నాటికి
విశాఖపట్నం.	175	19	194	300
తూర్పుగోదావరి	595	46	641	500
పశ్చిమగోదావరి	440	307	747	1000
కృష్ణా	1251	1084	2335	2500
గుంటూరు	891	450	1341	1250
నెల్లూరు	524	299	823	1000
కర్నూలు	114	50	164	250
కడప	50	26	76	200
అనంతపురం	40	51	91	200
చిత్తూరు	68	37	105	300
యితరరాష్ట్రాలు	553	107	660	
	4701	2476	7177	7500

★ కార్మికుల కడగండ్లు ★

ప్రజాయుద్ధంలో ప్రజలు విజయంగాంచా లంటే యుద్ధ సప్లయిలు విరివిగా ఉత్పత్తిచేయ బడాలి. యుద్ధపరిశ్రమలలో మైకా ఉత్పత్తి ఒకటి. కాని గూడూరు మైకాగనులలో కార్మికు లనుభవించుతూన్న కష్టాల ఫలితంగా వారిలో అశాంతి వ్యాపించడమే కాకుండా, ఉత్పత్తి కూడా విరివిగా జరగడంలేదు. ఇండ్లలో దీపం వెలిగించుకొని వంటవండుకోవడానికి కిరసనా యిలు దొరకదు. రెండేసి, మూడేసి, గంటలు పనులు మానుకొని ఊరంతా తిరిగితే, కాస్త కిరసనాయిలు దొరుకుతుందేమో: కాని, ఈ రెండు మూడు గంటలు గనులలో పనినిలిచి పోతుంది. ఈ యిబ్బందిని గురించి మైకా యజమానులతోను, జిల్లా కలెక్టరుతోను, పని వారల సంఘ ప్రతినిధులు ఎంత మొరపెట్టు కున్నా ప్రయోజనం కనపడ్డంలేదు.

ప్రభుత్వం చౌకధరల డిపోలు స్థాపించడ మసాధ్యమనీ, కిరసనాయిలు అమ్మకంలో రేషనింగ్ పద్ధతిని ప్రవేశపెట్టడం కష్టమనీ, జిల్లా కలెక్టరు జవాబు చెప్పాడు.

రైల్వేకార్మికుల సంచలనం

బళ్లారి సెక్షన్ పి. డబ్లియు. ఇన్‌స్పెక్టరు కార్మికుల యెడగావించే అన్యాయాలకు అంతు లేకుండా పోతూంది. సంవత్సరాని కొక పర్యా యం కొత్తపనిముట్లు సప్లయిచేయవలసియుం డగా, మూడు సంవత్సరాలకొక పర్యాయమైనా యివ్వక, పాతపని ముట్లతోనే పనిచేయ వల సిందని నిర్బంధ పరుస్తున్నాడు. పాతపని ముట్లతో పనిచేయడం వల్ల కార్మికులకు భారీ రకంగా ఎంతో యిబ్బంది కలుగుతోంది. అట్టి స్థితిలో పనికి హాజరు కాలేకపోతే, ఆబ్సెంట్ మార్కు చేస్తాడు. అత్యవసరమైనప్పుడు సహితం సెలవులు గ్రాంట్ చేయడు. కార్మికుల కీయవలసిన జీతాలు పూర్తిగా యివ్వడు. ఎందుకని అడిగితే, కొట్టడం,తిట్టటం, చేస్తాడు 10 సంవత్సరాలుగా పనిచేసిన వారిని సహితం పర్మనెంటు చేయక, కొత్తవారిని పర్మనెంటు చేస్తాడు, సీనియర్లవద్ద లంచాలు పుచ్చుకొని ప్రమోషన్లు యిస్తాడు. ఇన్నిన్ని బాధలుపెట్టె పి. డబ్లియు. ఇన్స్పెక్టరుపై తగిన చర్యతీసు కోవడం అవసరం. రైల్వేపనివారల సంఘం అట్టి కోరికను కోరుతూ తీర్మానించడంన్యాయం. ఆహారపదార్థాలు దొరక్క కార్మికులు అనేక ప్రదేశాలలో మాడవలసి వస్తూన్నది. ప్రతి రైల్వేకాలనీలోను చౌకడిపోలు తెరవ బడాలని రైల్వేపని వారల సంఘం కోరుతూ తీర్మానిం చింది. జోన్లు పద్ధతిని రద్దుచేసి, రు 250 జీతం తీయువారందరికి రు 15 యుద్ధఅలవెన్సుయివ్వా లని అడిగింది.

ఆహార పదార్థాల ధరలు ప్రభుత్వపు అంచ నాల ప్రకారమే రోజురోజుకు పెరిగి పోతు న్నాయి. 20-10-42 వతేదీ మద్రాసు ప్రభుత్వ ప్రకటన ప్రకారం బళ్లారి కంటె గుంటకల్ ధరలు 100 కి 32. 46 పాయింట్లు అధికంగా ఉన్నట్లు తెలుపుతోంది. అయినప్పటికీ యుద్ధ అలవెన్సు మొదటి రేట్ల ప్రకారమే యిస్తు న్నారు. ఇది అన్యాయం కాబట్టి వెంటనేలోకల్ అలవెన్సు యిప్పించ వలసిందని కోరుతూ, గుంతకల్ రైల్వేకార్మికుల సమావేశం తీర్మానించింది,

జపాన్ రాక్షసుల చేతులలో రైల్వేలు పడ కుండా, ఎన్ని త్యాగాలైనాచేసి, దేశరక్షణకార్యా లకు పూర్తిగా తోడ్పడవలసినవారు రైల్వే కార్మికులు. వారి అసంతృప్తికి కారణమైన యిబ్బందుల్ని తొలగించడం రైల్వేబోర్డు ప్రభుత్వాల కర్తవ్యం.

అధికారుల నిర్బంధాలు- ప్రజానీకపు ఆందోళన

ప్రజా సహకారంతో యుద్ధకృషిని తీవ్ర పరచాలనే ప్రాథమిక సూత్రాన్ని స్థానికాధి కారులు గుర్తించక, అనేక రకాలైన నిర్బంధ విధానంతో అసంతృప్తి జ్వాలల నెక్కువ చేస్తున్నారు.

అవనిగడ్డ సబ్ ఇన్‌స్పెక్టరు దురంతాలు

జాతీయైక్యతా వారంలో (నవంబరు 1 మొ॥ 8 వరకు) రెండజాల జండా లమ్ముతూ ప్రచా రంచేస్తూన్న యిద్దరు కామ్రేడ్స్‌ను అవనిగడ్డ పోలీసులు స్టేషనుకు తీసుకెళ్ళి జెండాలు లాగు కున్నారు. దీనికి కారణం, జండాలమీద కాం గ్రెసు నాయకుల విడుదలనుకోరే నినాదం వున్నదని సబ్ ఇన్‌స్పెక్టరు స్థానిక పార్టీ ఆర్గనైజరుతో చెపుతూ, ఆ నినాదం చట్ట విరుద్ధ మని వాదించాడు. మరునాడు తాను చేసినపని చట్ట విరుద్ధమని గ్రహించి కాబోలు, జండాలు పంపించేశాడు.

కామ్రేడ్ గరికపాటి వెంకటరత్నం దివి తాలూకా వ్యవసాయ కూలీ సంఘానికి అధ్య క్షుడు కాంగ్రెసు నాయకుల విడుదలకై ఆందో ళన సల్పుతూ, జాతీయైక్యతా కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నాడు. ఒక రోజున అకస్మా త్తుగా అవనిగడ్డ సబ్ యిన్‌స్పెక్టరు వీరిని స్టేషనుకు పిలిపించి బండ బూతులు తిట్టి, బూటు కాలుతో తన్నాడు; బూటు ఊడదీసి విసిరికొట్టాడు. ఏహో కాగితం తీసుకొచ్చి, దానిపై సంతకం చేయమని నిర్బంధించాడు. ఇందుకు నిరాకరిస్తే స్పృహ తప్పిపడిపోయే వరకు తన్నాడు. ఆ గ్రామంలో మరి యిద్దరు వ్యవసాయ కూలీలు ఐక్యతా ప్రచారంలో సహాయపడుతున్నారని, వారినికూడా యిలాగే హింసించాడు.

అక్కడ క్యాంపు చేసి యున్న కలెక్టరును ఆ కామ్రేడ్ సందర్శించబోతే, మాట్లాడడానికి అనుమతి యివ్వలేదు

పిఠాపురం సివిక్‌గార్డుల ప్రోత్సాహం

గతమాసం 10 వ తేదీని, పార్టీయొక్క పిఠాపురం తాలూకా కమిటీ ఆఫీసుబోర్డు, విద్యార్థిసంఘపు ఆఫీసుబోర్డు, ప్రజాశక్తి— పీపుల్సువార్ పత్రికల బోర్డులు, రాత్రివేళ ఎవరో రౌడీలు దొంగిలించుకొని వెళ్ళారు. ఈపని స్థానిక సివిక్‌గార్డుల ప్రోత్సాహంతో జరిగినట్లు వదంతులు వ్యాపించాయి.

వెలుగోడు పోలీసుల అన్యాయాలు

నందికొట్కూరు తాలూకా (కర్నూలు జిల్లా) సర్కిల్ ఇన్‌స్పెక్టరు, వెలుగోడు సబ్ ఇన్‌స్పెక్టరు, కలిసి దాదాపు నెల క్రిందట 21 డబ్బాల కిరసనాయిలు ఒక వర్తకుని వద్ద స్వాధీనం చేసుకున్నారు. లైసెన్సు లేకుండా అతడు ఎక్కువ కిరసనాయిలు స్టాక్‌చేసుకొని అధికధరలకు అమ్ముతున్నాడట. కాని, ఆ వర్తకునిపై ఎట్టికేసు పెట్టబడలేదు. ఇందుకు కారణం లేకుండా ఉంటుందా!

(మిగత 9 వ పేజీలో)

కృష్ణాజిల్లా రైతాంగ విజయాలు

ప్రజా స్వాతంత్ర్య సిద్ధికై నేడు జరిగే ప్రపంచ సంగ్రామంలో భారత దేశ రైతాంగం కూడా ప్రముఖ పాత్రను ధరిస్తోంది. రైతాం గము యొక్క ప్రధాన ఆర్థిక, రాజకీయ హక్కులు నెరవేరితేగాని యుద్ధ కృషికి విరి విగా తోడ్పడటం సాధ్యం కాదనే యదార్థాన్ని రైతు సంఘాలు గ్రహించి పనిచేస్తున్నాయి. ఈ విషయంలో కృష్ణాజిల్లా రైతు సంఘం గత సంవత్సరంలో ముఖ్యమైన విజయాలు కొన్ని సాధించ గలిగింది.

జిల్లా రైతు సంఘంవారు ప్రకటించిన రిపోర్టు ప్రకారం గత సంవత్సరంలో 10,034 మంది ప్రాథమిక సభ్యులు, 450 గ్రామ సంఘాలు, 9 తాలూకా సంఘాలు వున్నాయి.

నజరానా వసూళ్ళకు వాయిదా

కొత్తగా ఆయకట్టులో చేర్చిన భూములపై యకరం 1కి రు 25 చొప్పున విధించబడిన నజరానా మొత్తం రు 30 లక్షలు చెల్లించడం రైతాంగానికి యే విధంగా కష్టసాధ్యమో చూపుచు, నజరానాలు రద్దు చేయవలసిందని కోరుచు, ప్రభుత్వానికి 250 పిటీషన్లు పంప బడ్డాయి. ఈ ఆందోళన ఫలితంగా నజరానా వసూళ్ళు యీ సంవత్సరం ఆపుచేసి, వచ్చే సంవత్సరం 31-3-43 వరకు వాయిదావేయిం చుకొన గలిగారు.

పెనాల్టీకేసులు ఉపసంహరించుకో బడ్డాయి

గతసంవత్సరం వర్షాలు సరిగా లేకపోవడం వల్ల చిన్నతూములగుండా తగినంత నీటిని సప్లయి చేసుకోవలసి వచ్చింది. దీనిపై రివెన్యూ అధికారులు రైతులపై పెనాల్టీకేసులు పెట్టారు. జిల్లారైతుసంఘ ప్రతినిధులు ప్రభు త్వోద్యోగుల వద్దకు రాయబారాలు వెళ్ళి, కేసులు ఉపసంహరించుకొనేటట్లు చేయగలి గారు. అంతేగాక, పల్లపుభూములకు దరఖాస్తు లతో నిమిత్తంలేకుండా నీరు పెట్టుకునే హక్కును సంపాదించారు.

మెట్టగ్రామాలలో సిస్తు రిమిషన్

మెట్టగ్రామాలలో సకాలానికి వర్షాలు లేక పోవడంవల్ల పూర్తి సిస్తు రెమిషన్ యివ్వ వలసిందనీ, పశువుల పుల్లరి రద్దుచేయవల సిందనీ, రైతుసంఘాలు ఆందోళనచేసి, రైత్వారీ ప్రదేశాలలో విజయం సాధించారు. మద్రాసు ప్రభుత్వం బంజరుభూముల సాగు విషయమై గావించిన ప్రకటనను పురస్క రించుకొని, 1200 యకరాల బంజరును బీద రైతు, కూలీల కిప్పించారు.

ఎరువులనిమిత్తం అప్పు

ఎరువుల నిమిత్తం కృష్ణాజిల్లాకు మం జూరుచేయబడిన 1 లక్ష రూపాయలు జిల్లాలో వివిధప్రాంతాల బీదరైతులకు వంచిపెట్టబడే టట్లు జిల్లా రైతుసంఘం కృషిచేసింది.

చెఱకుపంటకు నష్టపరిహారం

కొన్ని గ్రామాలలో రైతులు పండించిన చెరకును వుయ్యూరు పంచదార ఫ్యాక్టరీయజ మానులు విత్తనానికి అట్టేపెట్టించి, నీరు సప్లయి చేయలేకపోయారు. ఇందువల్ల చెరకు ఎండిపోయి రైతులు నష్టపడ్డారు. జిల్లారైతు సంఘ కృషి ఫలితంగా రు. 15,000 నష్టపరి హారం ఫ్యాక్టరీ యజమానులచే మంజూరు చేయబడింది.

ధరల కంట్రోలు

ధరల కంట్రోలు విషయమై జిల్లా అంతట ఆందోళన ద్వారా ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురాబడుతోంది. 160 గ్రామాల నుంచి రైతాంగం ప్రభుత్వానికి మహజర్లు పెట్టారు. దీని ఫలితంగా కొన్నిచోట్ల స్థాని కాధికారులు కంట్రోలు ధరలను అమలు పరు స్తున్నారు.

అఖిల భారత రైతుసంఘ తీర్మానానుసారం కొన్ని ప్రదేశాలలో రైతులు ప్రస్తుత విధ్వంస క్రియలలో పాల్గొనకుండా నివారించబడ్డారు.

ఈ విధంగానే యితర జిల్లాలలోకూడా రైతాంగంయొక్క దైనందిన కోర్కెలకై రైతుసంఘాలు తీవ్రంగా కృషిచేస్తే, ప్రభుత్వం స్థానికాధికారులు, కలిగించే ఆటంకాలను తొలగించుకొంటూ, రైతులు ప్రజావిజయానికి తోడ్పడగలుగుతారు.

వ్యవసాయ కూలీల విజయం

గుడివాడ తాలూకాలో కొర్నిపాడు గ్రామ అగ్రహారీకులు ప్రజానిరోధకులై, సదరుగ్రామ వ్యవసాయ కూలీలు సాగుచేసిన బంజరు భూములపై దాడిచేశారు. నవనవలాడే పంటను పీకివేయించడానికి పరిసర గ్రామాలనుంచి కూలీలను తీసుకొన్నారు. పంటను గొడ్ల మేతకు వేలంలో కొనుక్కోవడానికి కొందరు రైతుల్నికూడా తయారుచేశారు. ఈ ద్రోహా నికి తలపడవద్దని స్థానిక వ్యవసాయ కూలీ సంఘ ఆర్గనైజరు వారి నందరినీ 3 గంటల సేపు హెచ్చరించాడు. వెంటనే వారంగదరూ వెళ్ళిపోయారు. సవర్ణకూలీలకు ఒక్కొక్కరికి 1-0-0 చొప్పున కూలి యిస్తామని అగ్రహారీ కులు కొందరిని తీసుకొచ్చారు. కాని, వారు కూడా, అవర్ణ- సవర్ణ భేదాల్ని కల్పిస్తూన్న అగ్రహారీకుల కుట్రను గ్రహించి, వెళ్ళి పోయారు. ఇంతలో జిల్లాకలెక్టరువద్దనుండి స్టేఆర్డరును తీసుకొచ్చి, అమలు జరిపించారు. దీనితో అగ్రహారీకుల పరాజయం పూర్తి అయింది. ప్రజాందోళనద్వారాప్రజావిజయాన్ని ఎలా సాధించవచ్చునో ప్రత్యక్షంగారుజువైంది.

నాదెళ్ళవారి పాలెంలో మరొక విజయం

దివి తాలూకా నాదెళ్ళవారి పాలెంలో వ్యవ సాయ కూలీలు సకాలానికి భూమిశిస్తు చెల్లించ లేకపోయారు. ఇందువల్ల వారి యిళ్ళ స్థలాలు వేలం వేయడానికి స్థానికాధికారులు సిద్ధంగా వున్నారు. స్థానిక వ్యవసాయ కూలీ సంఘం ద్వారా కూలీలు తహసీల్దారుకు అర్జీపెట్టి, యీ సంవత్సరం శిస్తు చెల్లించ నక్కరలేకుండా వాయిదా వేయించుకున్నారు.

కాకినాడ పీచుపనివారలకు యుద్ధఅలవెన్సు

తూర్పుగోదావరి జిల్లాకలెక్టరు యెదుట కాకినాడ పీచుపనివారల సంఘం తీసుకువెళ్లిన రాయబారాల ఫలితంగా, అన్నిరకాల నారకు హంద్రడ్‌వెయిట్ 1 కి ఇదివరలో యిస్తూన్న రేట్లపై 0-2-0 చొప్పున అదనంగా యుద్ధఎలవెన్సు యివ్వాలనీ, అది 1-12-42 నుండి అమలుజరపాలనీ, పీచువర్తకులకు 12-11-42వ తేదీని ఉత్తరువుజారీచేయ బడింది.

బెజవాడ మ్యునిసిపల్ వర్కర్సు సాధించిన హక్కులు

17-11-42 వ తేదీని బెజవాడ మ్యునిసిపల్ వర్కర్సు అన్ని డిపార్టుమెంట్లు షుమారు 600 మంది స్పెషల్ ఆఫీసరుగారివద్దకు వెళ్ళి, తమ క్కోర్కెలను అమలు జరుపవలసిందని తీవ్రమైన ఒత్తిడితేగా, ఇంతకుముందు అమలు జరుపని ఈ దిగువ కోర్కెలను శాంక్షన్ చేశారు :

1. రోడ్లకూలీలకు, పంపింగ్ స్టేషన్, వగైరా వర్కర్సుకు సిక్‌లీవు, క్యాజువల్‌లీవు.

2. పది రూపాయల జీతం యిచ్చేవారం దరికీ హెచ్చుదల.

3. అన్ని డిపార్టుమెంట్లలోను సీనియారిటీని గుర్తించి, అమలుపరచుట.

4. అన్ని డిపార్టుమెంట్లపని వారికి యుద్ధ ఎలవెన్సు.

మొదటి మూడు కోర్కెలను ఆ నిమిషం నుంచి అమలు పరుస్తున్నాననీ, యుద్ధ ఎలవెన్సు విషయంలో ప్రభుత్వ కార్యదర్శికి రికమెండుచేసి, 1 వారంలో తెలియజేస్తాననీ, జవాబు చెప్పాడు.

ఇదేవిధంగా, ఏలూరు చుట్టల పనివారల సంఘం గావించిన ఆందోళనఫలితంగా, 1000 చుట్టలకు 0-9-0 చొప్పున యిచ్చేరేటుపై 0-1-0 యుద్ధ ఎలవెన్సుగాను అదనంగాయివ్వబడుతోంది.

వెలుగోడు పోలీసుల అన్యాయాలు

బట్టలధరల కెట్టికంట్రోలు లేకపోయినప్పటికే, వెలుగోడు పోలీసులు కొందరు సాలెవాండ్రపై కంట్రోలుధరలకంటె ఎక్కువధరలకు బట్టలమ్ముతున్నారని బెదరిస్తూన్నట్లు తెలుస్తోంది.

ఇవీ - అవీ

బహిరంగసభ నిషేధం

గతనెల 16 వ తేదీని గూడూరు పట్టణ కమిటీ యాజమాన్యాన బహిరంగసభను జరుప ప్రయత్నించగా, పోలీసులువచ్చి, సభను నిషేధించారు. అంతటితో ఊరుకోక, అక్కడ సమావేశమైయున్న ప్రజల్ని తరిమివేశారు.

రివెన్యూ అధికారుల అక్రమాలు

జమ్మలమడుగు తాలూకాలో వర్షంలేక, పైర్లన్నీ పూర్తిగా నశించి, కరువు పరిస్థితులేర్పడ్డాయి. ఆప్రాంతాలలో శిస్తురెమిషన్ యిచ్చి, కరువుపనులు ప్రారంభించడానికి బదులు, రివెన్యూ అధికారులు సరియైన సీజన్ రిపోర్టులు పంపడంలేదు. పంటల అంచనా విషయంలో గ్రామమునసబులసలహా అయినా తీసుకోనకుండా, యిష్టంవచ్చిన రిపోర్టులు పంపుతున్నారు. ముఖ్యంగా సాలెవారి ఉప్పలపాడు గ్రామంలో ఈ అక్రమచర్యలు మితిమీరుతున్నాయి

ప్రజాందోళన; యువజన సంఘాల కృషి

ఈవిధంగా అనేకచోట్ల స్థానికాధికారుల నిరంకుశ చర్యలు పెచ్చు పెరుగుతూంటే, మరొకవైపున వేర్వేరు ప్రజాసంస్థలు ప్రజల కోర్కెలకై తీవ్రంగా ఆందోళనచేస్తున్నాయి.

కాంగ్రెసు- ముస్లింలీగు ఐక్యతకు కృషి చేస్తూన్న రాజగోపాలాచారిగారు గాంధీజీని సందర్శించడానికి అనుమతి నిరాకరించినందుకు ప్రభుత్వచర్యను ఖండిస్తూ బందరు తాలూకా రైతుసంఘ సాధారణ సమావేశం, గుడ్లవల్లేరు యువజనసంఘం, గుంటూరుజిల్లా రాజకీయ ఖైదీల సహాయక సంఘం, తీర్మానించాయి బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని తీవ్రంగా ఖండించాయి.

ప్రజా ప్రతినిధులతోగూడిన ఆహారపదార్థాల సంఘం (food councils) స్థాపించి ప్రజలకు సరియైన సప్లయిమార్గాలు చూడవలసిందని సత్తెనపల్లి తాలూకా యువజన సంఘం తీర్మానించింది.

ధరల కంట్రోలు విషయమై ప్రజల యిక్కట్లు తీర్చవలసిందని కోరుతూ, పందిళ్ళపల్లి- వేటపాలెం- జాండ్రపేట యువజన సంఘాల తరఫున స్థానికాధికారుల వద్దకు డెప్యుటేషన్ వెళ్ళారు.

గుంతకల్ రైల్వేకార్మికుల నిరసన సమ్మె

గుంతకల్ రైల్వే లోకో కార్మికులు 4-11-42 వ తేదీని తమ కష్టాలను గురించి డి. టి. ఎస్. పి. తో సంప్రతించడానికి వెళ్ళితే, అతడు ఇంటర్‌వ్యూ నిరాకరించాడు. దానితో కార్మికులు మధ్యాహ్నం గం 1. 30 లకు డ్యూటీకి వెళ్ళి, టికెట్ బోర్డునందు టికెట్లుంచి, పనులు మానుకున్నారు. లోకోఫోర్‌మన్ యీ సంగతినిగురించి డి. టి. ఎస్. పి. తో ఫోన్‌లో మాట్లాడాడు. పనులు మానుకున్న 1 గంటకు జిల్లాఆఫీసరు షెడ్‌కువచ్చి, ఎంక్వయిరీ జరిపి వెళ్ళిపోయాడు. తరువాత కార్మికులు శాంతియుతంగా పనులలో ప్రవేశించారు. ఆ సాయంత్రం కామ్రేడ్ సయ్యద్ అహమ్మద్ అధ్యక్షతక్రింద జరిగిన బహిరంగ సభలో అన్ని డిపార్టుమెంటు రైల్వేకార్మికులుపై అధికార్ల చర్యను ఖండిస్తూ తీర్మానించారు.

గుంతకల్ రైల్వే కార్మిక సంఘం కోరిక ప్రకారం యుద్ధఎలవెన్సు హెచ్చించడంగాని, లోకల్ ఎలవెన్సుయివ్వడంగాని, జరుగనందున షుమారు 2500 మందికార్మికులు. ఉద్యోగస్తులు 4-11-42 మొదలు 14-11-42 వరకు జీతాలు తీసుకోలేదు. ఈ విషయమై పై అధికారులతో సంప్రతిస్తానని స్థానికరైల్వే అధికారిచెప్పగా 14 వ తారీఖున జీతాలుతీసుకున్నారు. గుంతకల్ రైల్వేకార్మికులతో తమ ఐక్యతను ప్రకటిస్తూ వారి న్యాయమైన కోర్కెల నంగీకరించవలెనని రైల్వేఅధికారుల్ని కోరుతూ, బెజవాడ రైల్వే కార్మికుల సభలో 21-11-42 వ తేదీని ఏకగ్రీవంగా తీర్మానించబడింది.

మిలిటరీ యూనిట్లలోచేరి, యుద్ధకృషికి తీవ్రంగా కృషిచేస్తూన్న రైల్వేకార్మికుల్ని అధికారులు యీ విధ గా రెచ్చగొట్టడం వల్ల యుద్ధకృషికి తామే ఆటంకాలు కల్పిస్తున్నారనే సంగతిని గ్రహించవలసియుంది.

తోళ్ళషాపు కూలీలు

రాజమండ్రిలో సుమారు 300 మంది తోళ్ళషాపు కార్మికులకు, జీవితావసరమైన సరకుల ధర విపరీతంగా పెరిగిన యీ రోజుల్లో కూలి హెచ్చించడానికి బదులు యజమానులు రు 1 చొ॥న తగ్గించారు. నెలకు రు 10 మొదలు రు 11 వరకు మాత్రమే వారికిస్తున్నారు. ఒక్కొక్కనికి రు 4-8-0 చొప్పున యుద్ధ ఎలవెన్సు యిప్పించమని వారు షాపుకార్లను కోరితే, నిరాకరించారు. ప్రభుత్వాధికార్లకు కూడా తమ కష్టాలను తెలియజేశారు. కాని, అదివరకే 16 రోజులుగా 2 షాపులలోను, 20 రోజులుగా మరొక షాపులోను, షాహుకార్లు తోళ్ళు నానవేయుట మాని, కూలీలను లొంగ తీసుకొనేటందుకు పన్నాగం పన్నారు. కార్మికులీమోసాన్ని గుర్తించి, నవంబరు 25 న తహసిల్దారు వద్దకు డెప్యుటేషన్ తీసుకెళ్ళారు. పోలీసు సర్కిల్‌ఇన్‌స్పెక్టరు అక్కడవారిని బండబూతులు తిట్టాడు. తహసిల్దారు సమక్షంలోనే షాహుకార్లు కార్మికుల కోర్కెలను నిరాకరించారు. అసలు నోటీసు లేకుండా యజమానులు పని నిలిపివేయడమే నేరం. ఈ నేరాన్ని పట్టపగలు బహిరంగంగా చేసిన షాపుకార్లను శిక్షించడానికి బదులు స్థానికాధికారులు వారి విషయంలో ఉదాసీనత వహించారు. కార్మికులిది సహించలేక మూడు నాలుగు రోజులలో పూర్తి చేయవలసిన పనిని నిలిపివేశారు.

రైతు-కూలీల ఐక్యతావిజయం

ఏలూరు తాలూకా వ్యవసాయకూలీ సంఘంవారు నవంబరు 12 తేదీని కనీసపు కూలి 0-7-0, 0-8-0 చొప్పున యివ్వాలని కోరుతూ తీర్మానించారు. 14 వ తేదీని కోతలు ప్రారంభమయాయి. కూలీసంఘ ప్రతినిధులు, కార్మిక సంఘ ప్రతినిధులు, కలిసి ప్రతిపేటలోను టముకు వేయించి, తక్కువ కూలీలకు పోవద్దనీ, ఐకమత్యంతో ఉండవలసిందని, హెచ్చరించారు. కూలీలు తమ సంఘంయొక్క తీర్మానానికి కట్టుబడివున్నారు. రైతులు కూడా వారి న్యాయమైన హక్కులు గుర్తించి, రోజుకు 0-7-0, 0-8-0 చొప్పున కూలి యిచ్చారు. కొన్ని గ్రామాలలో మాత్రం మొదట రైతులు యీ రేట్లకు నిరాకరించారు. కాని, వ్యవసాయకూలీసంఘనాయకులు వారితో సంప్రతించిన మీదట ఆ గ్రామస్థులు కూడా అంగీకరించారు.

(10 వ పేజీ తరువాయి) పడి దోచుకోవడం ప్రారంభించారు. ప్రభుత్వాన్ని స్తంభింపచేయడానికి బదులు, యీ "పోరాటం" వల్ల ప్రజలలో అరాజకం ప్రబలిపోతూంది. పోలీసులు, మిలిటరీ, ప్రవేశించినప్పుడు జరిగేది యేమో మనం సులభంగానే ఊహించుకోవచ్చును. యు. పి., బీహార్, మధ్య పరగణాలలో అనేక ప్రాంతాల ప్రజలపై జరిగే అత్యాచారాలు వర్ణనాతీతం. 1857 లో సిపాయిల కలహం జరిగి విఫలమయాక దేశంలో తాండవమాడిన హత్యాకాండ కూడా యిలాగే ఉండేదని ఆప్రాంతాలలో వున్న ముసలిరైతులు చెపుతున్నారు. ప్రజల స్వాతంత్ర్యకాంక్ష చచ్చిపోలేదు. కాని, రైతులపై దౌర్జన్యాలు జరుపబడుతున్నాయి. ఇందువల్ల వారెవరినీ నమ్మడంలేదు.

ఈవిధంగా, సోదరులు తమ తోడి సోదరులపై దౌర్జన్యానికి దిగుతున్నారు; ఏ స్వాతంత్ర్య పోరాటంలోనైనా యిది జరుగుతుందా ? ప్రజలందరికీ సమానమైన శత్రువుతో పోరేడేటప్పుడు దేశీయులందరు చేయి, చేయి కలిపి ఉత్సాహంతో ముందుకు పోవడం సహజంకాదా ?

సత్యాగ్రహం: ఇదెక్కడికి దారితీస్తుంది ?

విధ్వంసకక్రియల ప్రత్యక్ష ఫలితాలుచూచి, అనేకమంది కాంగ్రెసువాదులునిర్ఘాంతపోయారు. కాంగ్రెసుకూ, ఈవిధ్వంసకక్రియలకూ, సంబంధంలేదని వీరు ప్రకటిస్తున్నారు. విధ్వంసకక్రియలుమాని, సత్యాగ్రహమే చేయవలసిందని ప్రజల్ని హెచ్చరిస్తున్నారు. కాని, ఈ వైఖరివల్ల విధ్వంసకక్రియలు ఆగిపోవడానికి బదులు, విధ్వంసకారులకెంతో సహాయపడుతోంది. ఎందువల్లనంటే, కాంగ్రెసువాదులు చొరవతీసుకొని, తప్పుడుమార్గంలో నడిచేఇతర దేశభక్తుల్ని, విధ్వంసకచర్యలు స్వాతంత్ర్యానికిమార్గంకాదనినచ్చచెప్పి, ఆపగలిగితేగానివిధ్వంసకక్రియలుఆగిపోవు. కాబట్టి, వీటియెడలతటస్థవిధాన మవలంబించడం సరియైనమార్గంకాదు. విధ్వంసకక్రియలు దేశాన్నినాశనంచేసేవికాబట్టి, వాటినివ్యతిరేకించడంకాంగ్రెసువాదుల కర్తవ్యం. సత్యాగ్రహోద్యమం సాగినంతకాలం, దేశద్రోహులైన పంచమాంగదళంవారు కాంగ్రెసుబురఖాక్రింద తమనిజస్వరూపాన్ని దాచుకొన గల్గుతారు. ప్రజలలో విఖ్యాతిగాంచిన కాంగ్రెసు ప్రచారకులు అరెస్టు చేయబడినప్పుడు ప్రజలు ఆవేశపరవశులౌతారు. జపాన్ ఏజంట్లు కార్యరంగంలో ప్రవేశించడానికి ఇదే చక్కని అవకాశం. సత్యాగ్రహమంటే జైళ్ళు నింపడమేననీ, స్వాతంత్ర్య పోరాటం కాదనీ, తెలుసుకొన్న యువక దేశభక్తులను పంచమాంగదళంవారు సులభంగా తమవలలో వేసుకొనగల్గుతారు. ప్రస్తుత పరిస్థితులలో, కాంగ్రెసు యాజమాన్యంక్రింద సత్యాగ్రహంచేయమంటేఅర్థం, పంచమాంగదళానికి ప్రజాసహకారం సమకూర్చి పెట్టడమన్నమాట. కాబట్టి, పంచమాంగదళాన్ని ప్రజలకు దూరం చేయాలని మీ అభిప్రాయమైతే, సత్యాగ్రహోద్యమాన్ని మానండి. ఆదళంయొక్క నిజస్వరూపాన్ని బట్టబయలు చేయడానికి మార్గం యిదే. ఇలాచేస్తే, వారు దేశభక్తి అనే బురఖాతో విచ్చలవిడిగా తిరగలేరు.

విధ్వంసకక్రియల్ని వ్యతిరేకించాలి; ఐక్యతను నిర్మించాలి

విధ్వంసకక్రియలిక సాగకుండా మానిపించడానికి సర్వవిధాల ప్రయత్నించడమే ప్రతి దేశభక్తుని విద్యుక్త ధర్మమని మా పార్టీ నమ్ముతోంది. ఎందువల్లనంటే, వాటిద్వారా మనం జపాన్ ఫాసిస్టుల పనిని చేసినట్టివార మవుతాం. మన గొంతుకలు మనమే కోసుకున్న వారమవుతాం. మన కత్తితో మనమే ఆత్మహత్య చేసుకున్నవారమవుతాం. ఇది మన స్వాతంత్ర్యానికి మార్గంకాదు; ఫాసిస్టు బానిసత్వానికే యిది మార్గం.

అయితే, దీని స్థానే ప్రత్యక్షంగా మేము దేశానికిచూపే కార్యక్రమంకూడా వుంది. దేశం ఒకేతాడుపై నడిచేటట్లు మేము కృషిచేస్తాం. అన్ని రాజకీయ పార్టీలు, అన్నిజాతీయ సంస్థలు, కలిసి పని చేసేటట్లు మేము చూస్తాం. దేశాన్ని కాపాడి, అధికారాన్ని ప్రజలు తమ హస్తగతం చేసుకోవడానికి ఇట్టి ఐక్యత నేడు అత్యవసరం.

మన మాతృదేశం ఫాసిస్టు రాక్షసుల చేతుల్లో పడకుండా రక్షించుకోవలసిన అగత్యాన్ని మేము ప్రజలకు బోధించి, వారిలో ఉత్సాహాన్ని రేకెత్తించుతాం.

ఇతర మిత్రరాజ్య ప్రజల సహకారంతో మనం మన దేశాన్ని రక్షించుకోవడమే మన దేశ స్వాతంత్ర్యానికి మార్గమని మేము ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాం. ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యంలో మన స్వాతంత్ర్యంకూడా ఎలా ఇమిడివున్నదో స్పష్టంచేస్తాం

జాతీయ రక్షణను బలపరచడానికి, జాతీయ ప్రభుత్వాన్ని లాగుకోవడానికి, బ్రహ్మాండమైన ఐక్యప్రజా ఉద్యమాన్ని మేము నిర్మించ పూనుకున్నాం. అట్టి ఉద్యమాన్ని ఎదుర్కొనలేక, నిరంకుశాధికారవర్గం వెనకడుగు వేయవలసివస్తుంది. అట్టి ఉద్యమంద్వారా మనదేశపు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొన గల్గుతాము.

ప్రస్తుత ఉద్యమంలోవలె దేశభక్తులు తమలో తాము కత్తులు దూయడం స్వాతంత్ర్యానికి మార్గంకాదు. దేశభక్తులందరు, చేయి చేయికలిపి పనిచేయవలసివుందని చాటి చెప్తున్నాం. ఇదే నిజమైన దేశసేవ అని మాదృఢ విశ్వాసం. మనదేశాన్నిమనం కాపాడుకొంటూ, స్వాతంత్ర్యాన్ని సాధించడానికి మార్గమిదేనని మా గట్టినమ్మకం.

★ ఏది దేశసేవ?

(1 వ పేజీ తరువాయి) సామ్రాజ్యవాదులు తమ చేతు లలోవున్న నిర్బంధ చర్యల్ని ఇంకా తీవ్రతరంచేసి, తమ అధికారాన్ని ఇంకా కట్టుదిట్టం చేసుకున్నారు. కాని, యిదే సమయంలో, జపాన్ హంతకుల కెట్టి శ్రమలేకుండానే, ఉచితంగా, వారి కవసరమైన పని ఈడేరింది: ఎలాగు? దేశీయుల పట్టుదల, ఉత్సాహం, నశిస్తున్నాయి. దేశంలో అన్నిమూలల విధ్వంసకక్రియలు చెలరేగడంవల్ల రక్షణ కేంద్రాలు నాశనమవుతున్నాయి. నిజమైన పంచమాంగ దళానికి ఎక్కువ బలం, పలుకుబడి, లేకపోయినప్పటికీ, ఇవిజరుగుతున్నాయి.

ఈ "పోరాటం" ఎందుకు విఫలమయింది?

ఎందువల్ల ఈ "పోరాటం" విఫలమయిందో యిక పరిశీలిద్దాం. ఇది జాతీయ రక్షణను ధ్వంసంచేసే "పోరాటం." బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని నిర్మూలించడానికి బదులు, యిది ఫాసిస్టు దురాక్రమణదారుల్ని మన సమీపానికి తీసుకొస్తుంది. ఒక సామ్రాజ్యవాద ప్రభుత్వంక్రింద బానిసగా ఉంటూ, మరొక సామ్రాజ్యవాద ప్రభుత్వంచే ఆక్రమించబడ్డానికి సిద్ధంగావున్న వలసదేశ ప్రజలకు స్వాతంత్ర్య సంపాదనా మార్గం ఒక్కటేవుంది. అదే జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించి, జయప్రదమైన జాతీయ రక్షణకు పూనుకోవడం. మన దేశ రక్షణను భగ్నంచేసుకుంటే, బ్రిటిష్‌వాళ్ళ చేతుల్లోనుంచి జపాను రాక్షసుల చేతుల్లో పడడం మాత్రమే జరుగుతుంది. అలా కాకుండా, జాతీయ రక్షణను బలపరిస్తే, బ్రిటిషు సంకెళ్ళను బద్దలుకొట్టి, జపాను దుండగీండ్రను జయప్రదంగా ఎదుర్కొన గలుగుతాం. ఈ "పోరాటం" ఎందువల్ల విఫలమయిందంటే, ఇది మన దేశాన్ని నాశనం చేసే పోరాటం. ఇట్టిపోరాటం విఫలం కాక తప్పదు. ఇవెంతో కఠినమైన మాటలే; కాని, వాటిలో యెంతో యదార్థంవుంది. "పోరాటం" యొక్క ఫలితంగా మన జాతీయోద్యమాని కెట్టిగతి పట్టిందో యిక పరిశీలిద్దాం.

దేశభక్తుల చరిత్రాత్మక కర్తవ్యం

ఈ రోజున మన జాతికి వాటిల్లినంత ముప్పు యిదివరకెన్నడూ కలుగలేదు. కాని, పరిస్థితులు విషమించుతూన్న కొద్దీ ఐక్యతకుగల అవకాశాలుకూడా ఎక్కువౌతున్నాయి. మన దేశీయులందరు వాంఛించే జాతీయవాంఛను వివిధ రాజకీయ పార్టీలు బలపరుస్తున్నాయి. జాతీయ వాంఛకు సుముఖంగా, ఎంతో విశాలవంతమైన జాతీయైక్యతకొక కొత్తపునాది నేడు దేశంలో ఏర్పడింది. మితవాదులలో మితవాదులైన లిబరల్సు మొదలు, కమ్యూనిస్టులవంటి తీవ్రవాదుల వరకు, జాతీయ రక్షణ కవసరమైన జాతీయ ప్రభుత్వాన్ని వాంఛిస్తున్నారు. ఈ వివిధ జాతీయ పార్టీలన్నింటిని ఐక్యపరచి, జాతీయ వాంఛను సాధించడాని కవసరమైన ఒక జాతీయైక్య సంఘటనను నిర్మించవలసిన కర్తవ్యాన్ని కాంగ్రెసు సంస్థ నెరవేర్చియుండవలసింది. ఎందువల్లనంటే, దేశమంతటిలోను ప్రధాన రాజకీయ సంస్థ కాంగ్రెసు. చరిత్రాత్మకమైన ఈ కర్తవ్యాన్ని కాంగ్రెసు నిర్వహించడం అసాధ్యమైనపనికాదు. ఈ విధంగా, దేశమంతటినీ నడిపించగల అగ్రస్థానాన్ని కాంగ్రెసు అలంకరించి యుండేది. కాని నేటి "పోరాటం" ఈ అవకాశాన్ని కాంగ్రెసు కివ్వడం పోయి, ఇతర జాతీయ శక్తుల నుండి కాంగ్రెసు దూరమయేటట్లుచేసింది. ఎందువల్లనంటే, దేశరక్షణను ధ్వంసంచేసే కార్యక్రమం స్వాతంత్ర్య పోరాటమని కొందరు జాతీయవాదులు భ్రమించినంతమాత్రాన, దేశంలోవున్న జాతీయవాదులందరూ యెలా పొరబడతారు? కాబట్టి, జాతీయ ప్రభుత్వ స్థాపనకై దేశభక్తులందరూ ఏకంకావలసియుంది. ఇందుకవసరమైన పోరాటంలో ప్రజల్ని కాంగ్రెసు నడిపించవలసియుంది.

దేశభక్తులలోనే చీలికలా?

ఈ "పోరాటం" బ్రిటిష్ ప్రభుత్వం మీద మాత్రమేగాక, తన మీద కూడా చేయబడుతూందని ముస్లింలీగ్ అభిప్రాయం. బ్రిటిష్ ప్రభుత్వపు చేతుల్లో ఉన్న అధికారాన్ని కాంగ్రెసు లాక్కొని, తానే ఆ అధికారాన్ని అనుభవించ దలచుకొందని లీగ్ భావిస్తోంది. ఇది నిజంకాదనీ, భారతీయులందరికీ అధికారం ఉండాలని కాంగ్రెసు కృషిచేస్తూందనీ, జవాబు చెప్పడం సరిపోదు అసలు యదార్థమేమంటే, జాతీయ ప్రభుత్వాన్ని సాధించడానికి కాంగ్రెసు ముస్లింలీగ్‌ల మధ్య ఒడంబడిక అత్యవసరం. కాని, దేశంలో యిప్పుడు జరిగే "పోరాటం" వల్ల అట్టిఒడంబడిక సవకాశంకుండా పోతూంది. ఈరెండు సంస్థల మధ్యఒక అగాధం యేర్పడుతోంది.

ప్రస్తుతం దేశంలో జరుగుతూన్న ఉద్యమం ఏ విధంగా దేశానికి హానికరమో, కమ్యూనిస్టుపార్టీ ధైర్యంతో తెలియజేసింది. మేము ప్రభుత్వం తరఫున పనిచేస్తున్నామనీ, ప్రభుత్వానికి మేము అమ్ముడుపోయామనీ, దేశమంతటా కాంగ్రెసు మాపై దుష్ప్రచారం గావించింది. కాని, మేము కాంగ్రెసు నాయకుల విడుదలకు, కాంగ్రెసు సంస్థపై నిషేధాన్ని తొలగించడానికి, జాతీయ ప్రభుత్వ స్థాపనకు, గావించే నిరంతర ప్రచారాన్ని ఏమాత్రము మానలేదు. ఇట్టి ప్రచారం దేశభక్తులందరి కర్తవ్యం అని మాకు తెలుసు. దుష్ప్రచారానికి దుష్ప్రచారంద్వారా మేము జవాబీయలేదు. ఒక సోదర దేశభక్తుని యెడల మరొక సోదర దేశభక్తుడవలంబించవలసిన మార్గాన్ని మేమవలంబించాం. నేటి అరాజకోద్యమం ఏవిధంగా హానికరమో ఓపికతో బోధించాం. దీనికిఫలితంగా, అనేక వందలమంది కాంగ్రెసువాదులు తమ పొరబాటును గ్రహించి, మా సలహా యేమిటో తెలుసుకోవడానికి వస్తున్నారు. తమ్ము సరియైన మార్గంలో నడిపించవలసిందని కోరుతున్నారు. మొదట మాపై దుష్ప్రచారం గావించిన

స్వాతంత్ర్యానికి మార్గమేది?

వ్యక్తులు ఈ రోజున మా పంథాను కొనియాడుతున్నారు. కమ్యూనిస్టులు ఈ "పోరాటం"లో చేరకపోవడంవల్లనే అది విఫలమయిందని వారంటున్నారు. ఇది యదార్థం కాకపోయినా, మాకృషిని వారు ప్రశంసించినట్లు దీనివల్ల స్పష్టమవుతోంది. ఇది నిజమైన స్వాతంత్ర్య పోరాటమే అయినట్లయితే, మాపార్టీ ఈపాటికి ముక్కలు ముక్కలై యుండేది. మా సహకారంపై విజయం ఆధారపడియున్నదనే భ్రమకు ఆధారం వుండేదికాదు. ఇదివరకుకంటె మాపార్టీ బలపడియుండేదికాదు. సర్వనాశనమైయుండేది.

జాతీయ శక్తుల విచ్ఛిన్నం-ప్రజలలో నిరుత్సాహం

నిజమైన స్వాతంత్ర్య పోరాటం జాతీయ శక్తులన్నింటినీ ఐక్యపరుస్తుంది. కాని ఈ పోరాటం జాతీయైక్యతను విచ్ఛిన్నం చేసింది. కాబట్టి, యిది స్వాతంత్ర్య పోరాటం కానేకాదు; జాతీయ విచ్ఛిన్నం అని చెప్పాలి.

ఇది కాంగ్రెసును యితర జాతీయ సంస్థలనుండి వేరుపర్చడమేకాకుండా, కాంగ్రెసు సంస్థ నాశనమయే బీజాలు యిందులో వున్నాయి. ఇది నిజమైన స్వాతంత్ర్య పోరాటమే నని విశ్వసించినవారంతా ఆత్మవిశ్వాసంగల ఉత్సాహవంతులు, యోధులు, అయివుండాలి. కాని, మూడునెలల "పోరాట" ఫలితంగా కాంగ్రెసు దేశభక్తుల ఉత్సాహం, పట్టుదల, నశించాయి. జయించుతామనే విశ్వాసం వారిలో నేడు లేదు. అయితే ఎందుకు కాంగ్రెసువాదులింకా ఈ "పోరాటా"న్ని పట్టుకుని వేళ్ళాడుతున్నారు? దీనికి కారణం, కాంగ్రెసు పతాకాన్ని దింపకుండావుంచాలనే పట్టుదల. అంతేగాని, విజయం లభిస్తుందనే ఆశకాదు. పోరాటం విఫలమయిందనివారు గ్రహించారు. కాని, ప్రభుత్వానికి లొంగిపోవడం ఒక్కటే వారికి మిగిలిన మార్గమని భ్రమిస్తున్నారు. జయించటానికి మరొక మార్గం ఉన్నదని వారు గ్రహించలేకున్నారు. ఏవిధంగా అనుచరులు తమ నాయకులయెడ తీవ్రమైన అసంతృప్తిని కలిగియున్నారో, ఏవిధంగా నాయకులలో నాయకులు తగవులాడుకొంటున్నారో, ప్రతిరోజు అంతఃకలహాలేవిధంగా ఎక్కువౌతున్నాయో, మనం తెలుసుకొంటున్నాం. ఈ ఘటనలు సంతోషించవలసినవికావు; దుఃఖించవలసినవి. ఇది నిజమైన స్వాతంత్ర్య పోరాటమే అయితే, దేశభక్తులలో అత్యున్నతమైన లక్షణాలు ప్రదర్శించబడతాయి కాని, ఈ ఉద్యమం స్వాతంత్ర్య పోరాటం కానందువల్లనే వారిలోవున్న అల్పత్వాలు బయటికి వస్తున్నాయి. ఇందువల్లనే, చిత్తశుద్ధిగల కాంగ్రెసు దేశభక్తులు నిరాశలో కృంగిపోతున్నరు.

అంత్య దశ: దేశీయులపై దౌర్జన్యం

ఈ "పోరాటం" ద్వారా విదేశీ సామ్రాజ్యవాదుల్ని యెగరగొట్టగలమని మొదట యెందరో ఆశించారు. కాని ఆచరణలో యేమి జరుగుతూంది? తోడి దేశీయులపై దౌర్జన్యానికి దిగే స్థితికి దేశభక్తులు వస్తున్నారు. దేశాన్ని రక్షించుకోవలసిన విద్యార్థులు కాలేజీలలో తిరిగి ప్రవేశిస్తున్నారు ఇందుకు కారణం ఏమిటి? విదేశీ ప్రభుత్వం వారిలో ఆ వుత్సాహాన్ని రేకెత్తించజాలదు—జాతీయ ప్రభుత్వాన్ని సాధించేటందుకు జాతీయోద్యమంలో ఐక్యత కనపడదు—ఇట్టి పరిస్థితులలో విద్యార్థులు యుద్ధరంగాలలో యెలా ప్రవేశించగలరు? దేశీయ నాయకులు నెరవేర్చవలసిన కార్యాన్ని వారెలా నెరవేర్చగలుగుతారు? కాబట్టి, విద్యార్థిజీవితంలో తమ కాలాన్ని వినియోగించాలని దూరాలోచనగల ప్రతి దేశ భక్తుడు అంగీకరిస్తాడు. విద్యాలయాలలోనే వారుండి, విద్యార్థులలో ఐకమత్యాన్ని పెంపొందించి, జాతీయైక్యతకు వారు తోడ్పడడము ప్రస్తుత పరిస్థితులలో వారి కర్తవ్యం. కాని, యీరోజున మనం చూచే దృశ్యం యేమిటి? కాలేజీలలో బాంబులు పేలుతున్నాయి సమ్మెలు చేయవలసిందని వారిని యీ విధంగా భయపెడుతున్నారు. తమ పిల్లల్ని కాలేజీలకు తిరిగి పంపవద్దని తల్లి తండ్రుల్ని భయపెడుతున్నారు. కార్మికుల విషయము చూదాం. తమ పొట్టను తాముపోషించుకుంటూ, దేశరక్షణ కవసరమైన ఉత్పత్తిని యెక్కువ చేయడం తమ కర్తవ్యమని కార్మికులు భావిస్తున్నారు. వారిచే సమ్మెలు చేయించలేక, వారి నాయకులైన కమ్యూనిస్టుల్ని యెదుర్కొనజాలక, అరాజకవాదులు ఫ్యాక్టరీలలో బాంబులు పెడుతున్నారు. కార్మికులు పనులకు వెళ్ళితే తలలు పగులుతాయని బెదరిస్తున్నారు. మొదట బ్రిటిషు ప్రభుత్వాన్ని లొంగదీయుటకు ఉద్దేశించబడిన "పోరాటం", ఈ విధంగా ప్రజల్ని బెదిరించడానికి వినియోగపడుతోంది: ఈ ఉద్యమంయొక్కగతి యిలాగుంది:

పల్లెటూళ్ళలో బందిపోట్లు

ఇక పల్లెటూళ్ళలో పరిస్థితు లెలావున్నాయో చూదాం. పోలీసుస్టేషన్లపై దాడిచేయడానికి, బందిపోట్లు, విధ్వంసక చర్యలు వృత్తిగా పెట్టుకున్నవారు వినియోగించ బడ్డారు. మొదట పోలీసుస్టేషనులపై దాడులు జరిగాయి. కాని, యింతటితో ఈ బుద్ధిసుంతులు ఊరుకుంటారా? సంతలపైన, రైతుల స్వల్ప ఆస్థులపైన, విచ్చలవిడిగా (మిగతా 9 వ పేజీలో)

Published by Katragadda Rajagopala Rao and Printed at The Popular Printers, Governorpet, Beswada

END OF ISSUE